


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com




visit us @ http://epaper.suryaa.com

సంపుటి 17 | సంచిక 212

సోమవారం | 1 జూలై 2024 | హైదరాబాద్

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, జ్యేష్ఠ మాసం బ.దశమి ఉ.11.00, అశ్విని ఉ.7.39, వర్జ్యం సా.4.44 నుంచి 6.15 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.31 నుంచి 1.23 వరకు తిరిగి 3.07 నుంచి 3.59 వరకు

# అమ్మ పేరుతో ఒక మొక్క

- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- మలి విడత మన్ కీ బాత్ కార్యక్రమం ప్రారంభం
- మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞతలు
- 65 కోట్ల మందికిపైగా ప్రజలు ఎన్నికల్లో ఓటు వేయటం నిజమైన ప్రజాస్వామ్యం
- ఏక్ పేడ్ మా కే నామ్ పేరుతో సరికొత్త కొత్త ప్రచారం
- ఆంధ్ర కాఫీ గురించి ప్రత్యేక ప్రశంసలు

వివరాలు-6లో

ప్రజలకు సందేశమివ్వడంతో పాటు.. వారితో మమేకమయ్యేందుకు ప్రతి నెలా చివరి ఆదివారం ఏర్పాటు చేసే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ పునఃప్రారంభించారు. వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి రేడియో ప్రసంగం చేశారు. మరోసారి ఎన్‌డీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినందుకు దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఏక్ పేడ్ మాకే నామ్ పేరుతో తీసుకొచ్చిన కొత్త ప్రచారం గురించి ప్రస్తావించారు. మా అమ్మ పేరుతో నేను మొక్క నాటాను.



## ఏపీకి భారీ వర్ష సూచన



ఋతుపవనాల ఉత్తర పరిమితి ఇప్పుడు జైసల్మేర్, చురు, హిస్సార్, కర్నాల్, జలంధర్, తరంతరణ్ గుండా వెళుతుంది. సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా–గంగా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉన్న ఉపరితల అవర్తనము ఇప్పుడు తూర్పు జార్ఖండ్ పరిసరాల్లో ఉంది.

వివరాలు-2లో

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
# మోడీ ప్రశంసలు


6లో

- గ్రామస్థాయి నుంచి వచ్చి ఉన్నత స్థానానికి ఎదిగిన నేత
- పుస్తకాలను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోడీ
- వెంకయ్యపై పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయి

## ఏపీలో మారిన
# దుల్హన్ పథకం

- ఏపీలో చంద్రబాబు కొత్త పథకం
- మైనార్టీ యువతికి వివాహ సమయంలో సాయం
- లబ్ధిదారులకు రూ. లక్ష సాయం


2లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## మీతో మరో కప్ తాగాలనుకుంటున్నాను


2లో

### అరకు కాఫీ ట్వీట్‌పై స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు

అరకు కాఫీ నాణ్యతపై ప్రధాన మోది చేసిన ట్విట్ పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌కు సీఎం స్పందించ డమే కాకుండా గిరిజన ప్రజలు కాఫీ సాగు పట్ల తీసు కుంటున్న శ్రద్ధను వివరించారు.

## డీఎస్ లేని లోటు
# ఎవరూ తీర్చలేరు


7లో

- హైదరాబాదులో కన్నుమూసిన డీఎస్
- నిజామాబాద్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- డీఎస్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ నిన్న కన్నుమూసిన సంగతి తెలిసిందే. 76 ఏళ్ల డీఎస్ నిన్న వేకువ జామున హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు.

## రూ.10 లక్షల
# పరిహారం



దేశ రాజధాని ఢిల్లీని గత 5 రోజులుగా భారీ వర్షాలు వణికిస్తున్నాయి. వరదల్లో కొట్టుకుపోయి 11 మందికిపైగా మృతి చెందారు.బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కేజ్రీవాల్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ మేరకు మంత్రి అతిషి రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు.

వివరాలు-2లో

## అంతా ఇంతే!




మన సంకీర్ణంలా కాకుండా దంచి కొట్టారు సార్

## పోలవరాన్ని పరిశీలించిన
# అంతర్జాతీయ నిపుణులు

- ప్రాజెక్టును పరిశీలించిన అమెరికా నిపుణులు
- ఆదివారం ఉదయం ప్రాజెక్టు సందర్శన
- ప్రాజెక్టు డిజైన్‌తో పాటు ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాం, గైడ్ బండ్‌ల పరిశీలన


2లో

పోలవరం ప్రాజెక్టు ఎందుకు నిలిచిపోయింది. ప్రాజెక్టు నిర్మాణంలో అడ్డంకులు ఏమిటి? పనులను తిరిగి ఎలా ప్రారంభించాలి అనే అంశాలపై అంతర్జాతీయ నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది.

## కాంగ్రెస్‌లోకి మరో ఐదుగురు
# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ?


7లో

- కారు పార్టీకి అడుగడుగునా కష్టాలే
- బీఆర్ఎస్ పార్టీ మనుగడ సాగేనా ?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన కారు పార్టీకి అడుగడుగునా ఎదురుదెబ్బలే తగులుతున్నాయి.! అసెంబ్లీలో అట్టర్ ఫ్లాప్ కావడంతో పార్లమెంట్ ఎన్నికల్లో అయినా పరువు నిలబెట్టుకుందామని భగీరథ ప్రయత్నాలు చేసి అడ్రస్ లేకుండా పోయింది.! దీనికి తోడు రోజురోజుకూ కారు నుంచి ఎమ్మెల్యేలు దిగేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటూ ఉండటంతో పార్టీ రోజురోజుకూ ఖాళీ అవుతోంది.!



## తెలంగాణ సర్కారుపై
# బండి ఫైర్



- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ కూడా పయనిస్తోంది
- బీజేపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గం
- కేంద్రం కూడా అదే విధంగా చేస్తే కాంగ్రెస్ ఎంపీల పరిస్థితి ఎలా ఉంటుంది

వివరాలు-7లో



అరకు కాఫీ ట్వీట్‌పై స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు

# మీతో మరో కప్ తాగాలనుకుంటున్నాను : ప్రధాని మోడీ

సూర్య, ప్రధాన ప్రతినిధి : అరకు కాఫీ నాణ్యతపై ప్రధాన మోది చేసిన ట్వీట్ పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌కు సీఎం స్పందించ డమే కాకుండా గిరిజన ప్రజలు కాఫీ సాగు పట్ల తీసుకుంటున్న శ్రద్ధను వివరించారు. నరేంద్ర మోదీ అరకు కాఫీ గురించి ప్రస్తావిస్తూ, 2016లో చంద్రబాబుతో కలిసి అరకు కాఫీ తాగుతున్నప్పటి ఫొటోలను సోషల్ మీడియాలో పంచు కున్న సంగతి తెలిసిందే. దీనిపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మా గిరిజన సోదరసోదరీమణులు ప్రేమతో, అత్యంత శ్రద్ధాసక్తులతో అరకు కాఫీని సాగు చేస్తారు. అరకు కాఫీ సుస్థిరత, గిరిజన సాధికారత, ఆవిష్కరణకు ప్రతీకగా నిలుస్తుంది. ఏపీ ప్రజల హద్దుల్లేని శక్తిసామర్థ్యాలకు ఇది నిదర్శ నంగా నిలుస్తుంది. 2016లో మనం అరకు కాఫీ తాగుతున్న ఫొటోలను షేర్ చేసినందుకు, ఉత్పత్తి అవు తున్న అరకు కాఫీకి ప్రచారం కల్పిస్తున్నందుకు థాంక్యూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారూ. మీతో మరో కప్ అరకు కాఫీ తాగుతూ ఎంజాయ్ చేయాలని ఎదురుచూస్తున్నాను అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# మారిన దుల్హన్ పథకం

**● ఏపీలో చంద్రబాబు కొత్త పథకం ● మైనార్టీ యువతికి వివాహ సమయంలో సాయం ● లబ్ధిదారులకు రూ. లక్ష షురూ**



సూర్య, ప్రధానప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో



జరిగిన లోటుపాట్లను సరిచేస్తూ ఎప్పటికప్పుడు తీసుకువాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం మైనార్టీల కోసం దుల్హన్ పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద మైనార్టీలకు చెందిన యువతికి వివాహ సమయంలో రూ.50 వేలు ఇచ్చేవారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇదే పథకం కింద రూ.లక్ష అందజేస్తోంది. పథకానికి అర్హతలు వివాహం చేసుకోబయే తేదీకి ఒక నెలరోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. వధువు మైనార్టీ వర్గానికి చెందడంతోపాటు ఏపీలో నివసిస్తున్న వ్యక్తి అవ్వాలి. వరుడికి 21 సంవత్సరాలు, వధువుకు 18 సంవత్సరాలు నిండాలి. వధువు తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణాల్లో రూ.2 లక్షల్లోపు, గ్రామాల్లో రూ.1.50 లక్షల్లోపు ఉండాలి.

ఏమేం కావాలి.. ఎలా చేయాలంటే..

వధువు, వరుడి జన్మదిన సర్టిఫికెట్లు, ఇద్దరి ఆధార్ కార్డులు, లేటెస్ట్ ఫొటోలు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, వివాహ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, వివాహ ఆహ్వాన పత్రం( శుభలేఖ), నివాస ధ్రువీకరణ పత్రం, ఇద్దరి బ్యాంకు ఖాతాల వివరాలు, వాటి ఐఎఫ్ఎస్ సీ కోడ్, ఎంఐసీఆర్ కోడ్, బ్యాంకు శాఖ పేరు అందించాలి. వరుడు, వధువు ఫొటోలు, ఇద్దరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, శుభలేఖ, వయసు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్ పత్రాలను స్కాన్ చేసి అప్ లోడ్ చేయాలి.

అలాగే స్కాన్ చేసిన పత్రాలు సైజ్ తక్కువలో తక్కువగా 50 కేబీ నుంచి 150 కేబీ వరకు ఉండాలి. వెబ్ సైట్ ప్రారంభం కాగానే ప్రభుత్వం పోర్టల్ తెరవబోతోంది. ఆ తర్వాత ఈ పథకం అమల్లోకి రానుంది. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న తర్వాత స్థానిక తహశీల్దార్ కు వీటిని పంపించాలి. ఆయన మైనార్టీల సంక్షేమ అధికారికి వాటిని పంపిస్తారు. అందుకు వారం రోజుల సమయం తీసుకుంటారు. తర్వాత జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆన్ లైన్ లో డబ్బులు ఇస్తారు. వివాహానికి పదిరోజులు ముందుగా వధువు ఖాతాలో జమవుతుంది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొలుసు పార్థసారథి



సూర్య, ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయం చేరుకున్న మంత్రివర్యులకు ఆలయ ధ్వజ స్థంభానికి మొక్కిన అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపం నందు మంత్రివర్యులకు వేద పండితులు ఆశీర్వచనం పలికి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మీడియాతో మాట్లాడుతూ...గత ప్రభుత్వం హయంలో రాష్ట్రం ఎదుర్కొన్న కష్ట నష్టాల నుండి గట్టెంకించి రాష్ట్ర ప్రజలకు, రైతులకు, మహిళలకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు గారి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో కొన్ని అవకతవక నిర్ణయాలతో, దూరాలోచలన లేకుండా చేసిన ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రం అన్ని రంగాలలో వెనకబడి ఉందని నూతన ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రాన్ని పారిశ్రామికగా, వ్యవసాయపరంగా, ఉపాధి పరంగా అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నామని ఇందుకు అవసరమైన అనుగ్రహం, ఆశీస్సులు ఉండాలని వేంకటేశ్వర స్వామి వారిని ఈ సందర్భంగా కోరుకున్నానని తెలిపారు.అదే విధంగాఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి తన మొదటి సంతకం చేశారని ఆ హామీలలో భాగంగా రేపటి రోజున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను రూ.4000/- ను, వికలాంగుల పెన్షన్ ను రూ.15,000/- అదే విధంగా తదితర పెన్షన్లను మొత్తం 65 లక్షల మందికి రూ.4500 కోట్లు లబ్ధిని ప్రజలందరికీ తమ ఇంటి వద్దకే వెళ్లి ఇచ్చే కార్యక్రమం రేపటి జూలై 1 వ రోజున ఇవ్వనున్నామని తెలిపారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న మన ముఖ్యమంత్రిని , రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రజలను ఆశీర్వదించాలని ఆ శ్రీవారిని ప్రార్తించానని అన్నారు.

# పోలవరం పనులు పరిశీలించిన అంతర్జాతీయ నిపుణులు

**● ప్రాజెక్టును పరిశీలించిన అమెరికా నిపుణులు ● ఆదివారం ఉదయం ప్రాజెక్టు సందర్శన ● ప్రాజెక్టు డిజైన్‌తో పాటు ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం డయా ఫ్రం వాల్, కాఫర్ డ్యాం, గైడ్ బండ్‌ల పరిశీలన**

సూర్య ప్రధాన ప్రతినిధి, అమరావతి : పోలవరం ప్రాజెక్టు ఎందుకు నిలిచిపోయింది. ప్రాజెక్టు నిర్మాణంలో అడ్డంకులు ఏమిటి? పనులను తిరిగి ఎలా ప్రారంభించాలి అనే అంశాలపై అంతర్జాతీయ నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. 4 రోజుల పర్యటనలో భాగాంగా కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించిన అనంతరం, పనుల పురోగతిపై నివేదిక ఇవ్వనున్నారు.



పోలవరంలో కీలక సాంకేతిక సవాళ్లను పరిష్కరించేందుకు అంతర్జాతీయ జలవనరుల నిపుణుల బృందం ప్రాజెక్టును పరిశీలిస్తోంది. అమెరికా, కెనడాల నుంచి నలుగురు నిపుణులు వచ్చారు. కేంద్ర, రాష్ట్ర జలనరుల శాఖ అధికారులతో ఢిల్లీలో నిపుణులు బృందం సమావేశం అయ్యారు. అనంతరం రాత్ర రాజమండ్రికి చేరుకున్న నిపుణులు, పోలవరం ప్రాజెక్టు వద్ద అధికారులతో భేటీ అనంతరం ప్రాజెక్ట్ సైట్ను పరిశీలిస్తున్నారు. అధికారులను అడిగి ప్రాజెక్టు వివరాలు తెలుసుకున్నారు. కెనడాకు చెందిన నలుగురు నిపుణులు శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. నేటి నుంచి వారు పోలవరంలో తమ పని ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ నిపుణులు అక్కడే ఉంటారు. మొదటి రెండజుల పాటు ప్రాజెక్టును పూర్తిగా పరిశీలిస్తారు. ప్రతి కట్టడాన్ని క్షుణ్ణంగా పరిశీలించేలా పర్యటన షెడ్యూల్ సిద్ధమైంది. ఆ తర్వాత మరో రెండజుల పాటు సమస్యలను పరిష్కారాలపై మేధోమథనం చేయనున్నారు. ఇందులో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్యులు, కేంద్ర జలసంఘం నిపుణులు, సీఎస్ఎంఆర్ఎస్
సంస్థ ప్రతినిధులు, వ్యాప్కోస్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీ ప్రతినిధులు, అంతర్జాతీయ డిజైన్ సంస్థ అఫ్రి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. ఆ తర్వాత నైపుణ్య ఏజెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ నిపుణుల బృందం చర్చించనున్నారు.



**అంతర్జాతీయ స్థాయి నిపుణులు**

పోలవరం ప్రాజెక్టులో ఏర్పడ్డ అనిశ్చిత పరిస్థితులు, పెను సవాళ్ల పరిష్కారానికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం అవసరమని కేంద్ర జలసంఘం నిర్ణయించిన క్రమంలో ఈ అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా డిజైన్లను రూపొందించేందుకు అంతర్జాతీయ డిజైన్ ఏజెన్సీ అఫ్రి సాయం తీసుకుంటున్నారు. వీరికి తోడు అమెరికాకు చెందిన డేవిడ్ బి పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, సీస్ హించ్‌బెర్గర్, కెనడాకు చెందిన రిచర్డ్ డోన్నెల్లీలు నియమితులయ్యారు. పోలవరం ప్రాజెక్టులో సవాళ్లకు సంబంధించిన కీలక అంశాల్లో వీరంతా నిపుణులు. అంతర్జాతీయ డ్యాం భద్రత నైపుణ్యం, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, స్ట్రక్చరల్ సొల్యూషన్స్, సివిల్ ఇంజినీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, జియో టెక్నికల్ ఇంజినీరింగ్ వంటి అంశాల్లో వీరికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం ఉండటంతో వీరిని ఎంచుకున్నట్లు కేంద్ర జలసంఘం పేర్కొంటోంది.

## వినతులకు టోల్ ఫ్రీ నంబరు-73062 99999



(సూర్య, ప్రధాన ప్రతినిధి) : మంగళగిరి, ప్రజల నుంచి వినతుల స్వీకరణకు కొత్తగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెదేపా ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాష్ట పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎంకు వినతులు ఇచ్చేందుకు జనం పొటెత్తుతున్నారని చెప్పారు. వారి వినతుల స్వీకరణను సులభతరం చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజలు వారి సమస్యలను 73062 99999 నంబర్కు ఫోన్ చేసి తెలియజేస్తే... ప్రాధాన్యతను బట్టి సీఎంను కలిసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జగన్ ఫించనుదారులను మభ్యపెట్టారని ఆయన విమర్శించారు. జగన్ ఐదేళ్లలో రూ. వెయ్యి పెంచి హడావుడి చేశారని, చంద్రబాబు ఒకేసారి రూ. వెయ్యి పెంచి లబ్దిదారులకు మేలు చేశారని అన్నారు. పెంచిన పింఛను సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు. అమరావతిని త్వరితగతిన పూర్తి చేస్తామని, విశాఖను ఆర్థిక రాజధానిగా మార్చుతామని స్పష్టం చేశారు.

# షన్ అక్రమాలకు అడ్డాగా కాకినాడ పోర్ట్

## మంత్రి నాదెండ్ల స్పెషల్ ఫోకస్

కాకినాడ ... పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో తిష్ట వేసి అధికారులకు చెమటలు పట్టించారు. కాకినాడ పోర్టుతో పాటు జిల్లాలో పలు రైస్ మిల్లులపై రివ్యూ చేసి అక్రమ బియ్యం వ్యాపారంపై అధికారులను నిలదీశారు. అయితే నాదెండ్ల తరువాత పవన్ ఎంట్రీ ఉండబోతోందనే టాక్ వినిపిస్తోంది. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి విదేశాలకు తరలించేవారిపై సమగ్ర విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. మొదట పోర్ట్ ఏరియాలోని పలు గోదాముల్లో అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. ఇందులో ఆరు రైస్ మిల్స్ నుంచి పిడిఎఫ్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. రైస్ మిల్స్ వెనుక మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి హస్తం ఉందంటూ చెప్పకనే చెప్పేశారు. ఇటు కాకినాడ పోర్టులో కూడా తిష్ట వేసి ద్వారంపూడి కుటుంబ దౌర్జన్యంగా అడ్డగోలుగా సముద్రంలో ఓడలు కొనే స్థాయికి ఎదిగారంటూ ఆరోపించారు. అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కాకినాడ జిల్లాలో ఒక రోజుతోనే సమీక్షలు సరిపెట్టుకోలేదు మంత్రి నాదెండ్ల. రెండో రోజు కూడా కాకినాడ జిల్లా పర్యటించారు. ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం నిల్వల కేంద్రాలను తనిఖీలు చేశారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా రవాణ చేస్తున్న బియ్యాన్ని నిజాయితీగా చేరేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా పనిచేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు నిర్వహించిన పది ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం ట్రేడింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయన్నారు. వీరందరి మీద లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా కేసులు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ ప్రాంతాన్ని మాఫియాకు అడ్డాగా తయారు చేశారని, 2018-24 మధ్య చాలా మార్పు ఉందన్నారు. పీడీఎస్ బియ్యానికి సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయడం ప్రారంభించామని మంత్రి స్పష్టం చేశారు. ఈ క్రమంలో అధికారులు నిజాయితీగా పనిచేసి, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఆధారాలు దొరికిన చోట స్టార్ పేజ్ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖలు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తనిఖీలు భవిష్యత్తులో ఇంకా కొనసాగుతాయన్నారు మంత్రి నాదెండ్ల. నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొన్ని రోజుల్లోనే కాకినాడలో తిష్ట వేసి కాకినాడ పోర్టుపై దృష్టి సారించారు. దీనికి కారణం 2023 జూన్ జూలైలో పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో కాకినాడ స్థానిక ప్రజల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి పెద్ద మొత్తంలో రేషన్ తరలిపోతున్నట్టు ఫిర్యాదు చేయడమే. ఈ నేపథ్యంలోనే పలుమార్లు పవన్ కళ్యాణ్‌ను విమర్శించిన ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్న అక్రమాలు, బాగోతాలు అధికారంలోకి రాగానే బయట పెడతానని కాకినాడ సభల్లో పవన్ కళ్యాణ్ నేరుగానే చెప్పారు. ఈ నేపథ్యంలోనే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ



జీవనాడైన పోర్టుపై దృష్టి పెట్టారు. మొదటిరోజు 5300 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పాటు రెండవ రోజు ఏడువేల మెట్రిక్ టన్లకుపైగా రేషన్ బియ్యాన్ని గుర్తించారు. సముద్ర మార్గం ద్వారా ఓడల్లో ఆఫ్రికాకు తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని వెంటనే నిలిపివేయాలంటూ అధికారులకు సూచించారు. ఇంకా మారని అధికారులు ఎవరైనా ఉంటే వారి ప్రవర్తన మార్చుకోవాలంటూ హెచ్చరించారు. ఇది ఇక్కడితో ఆగదని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన వెనుకున్న అనుచరుల అక్రమాలన్నీ బయటపడతామని హెచ్చరించారు. జులైలో మూడు రోజులపాటు పవన్ కళ్యాణ్ కూడా కాకినాడ జిల్లాలో అధికారులతో సమీక్షించబోతున్నారు.

## ఏపీకి భారీ వర్ష సూచన



(సూర్య, ప్రధాన ప్రతినిధి) : ఋతుపవనాల ఉత్తర పరిమితి ఇప్పుడు జైసల్మేర్, చురు, హిస్సార్, కర్నాల్, జలంధర్, తరంతరణ్ గుండా వెళుతుంది. సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా-గంగా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉన్న ఉపరితల అవర్తనము ఇప్పుడు తూర్పు జార్ఖండ్ పరిసరాల్లో ఉంది. సముద్ర మట్టానికి సగటున 5.8 7.6 కిమీల మధ్య 20ఓ ఉత్తర అక్షాంశము వద్ద గల గాలి కోత / షీర్ జోన్ ఇవుడు బలహీన పడినది. ఈ క్రమంలో రాబోవు మూడు రోజులకు వాతావరణ సూచనలు ఇప్పుడు తెలుసుకుందాం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశము ఉంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశము ఉంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశము ఉంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. లికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

# కేంద్రం మూడు కొత్త చట్టాలుప్రగతి నిరోధకాలు

**● బిఆర్ఎస్ ఎంపీ కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్.... మూడు కొత్త చట్టాలకు గతేడాది డిసెంబర్ 21న పార్లమెంట్ ఆమోదం లభించగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 25న ఆమోదం తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మూడు ఒకే విధమైన నోటిఫికేషన్ల ప్రకారం, కొత్త చట్టాల నిబంధనలు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయి. బ్రిటీష్ వలస పాలన నాటి చట్టాల స్థానంలో కొత్తగా కేంద్ర ప్రభుత్వం నేర న్యాయ చట్టాలను తీసుకొస్తున్నట్టు తెలిపింది. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత 2023, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 ప్లేస్ లో భారతీయ సాక్ష్య అధినయమ్ 2023 చట్టాలు నేటి అర్ధరాత్రి (2024 జులై 1) నుంచి అమలులోకి రానున్నాయి. జీరో ఎఫ్ఆర్, ఆన్ లైన్ లో పోలీసు ఫిర్యాదు, ఎలక్ట్రానిక్ రూపంలోనే సమన్లు, దారుణమైన నేరాలకు సంబంధించి నేరం జరిగిన ప్రదేశాన్ని తప్పనిసరిగా వీడియో చిత్రీకరించడం వంటి కీలక అంశాలను ఈ కొత్త చట్టాల్లో ఉండనున్నాయి. ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీస్ స్టేషన్ కు వెళ్లనవసరం లేకుండానే ఆన్ లైన్ లో ఫిర్యాదు చేసేందుకు వీలు కలగనున్నది. ఇప్పటికే పోలీసులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించేందుకు ట్రైనింగ్ ఇచ్చారు.

**కొత్త చట్టాలతో బాధితులకు నష్టం -వినోద్ కుమార్**

జూలై 1 వ తేదీ నుండి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కొత్త చట్టాలను తీసుకువస్తుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఈ చట్టాలు




వున్నాయి. మార్పు అంటే మంచి జరగడం.. కానీ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలు ప్రాథమిక హక్కులకు విఘాతంగా ఉన్నాయి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. 2023 ఆగస్టులో చట్టాల మార్పు బిల్లులను పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టింది. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలపై విస్తృతంగా పరిశీలించి అనేక మంచి సూచనలు చేశారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనలను కేంద్రం పట్టించుకోలేదు. దాదావు 160 మంది పార్లమెంట్ సభ్యులను బయటకు పంపి బిల్లును కేంద్రం పాస్ చేయించుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ న్యాయవాదులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. కొత్త చట్టాలను రద్దు చేయాలని కేంద్ర హోంశాఖా మంత్రి, న్యాయ శాఖా మంత్రులకు లేఖ రాశాను. చట్టాలను ఇంగ్లీష్‌లో ప్రవేశపెట్టాలని రాజ్యంగంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు ఇండియన్ పీనల్ కోడ్‌కు భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు భారతీయ నాగరిక సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ కి భారతీయ సాక్ష్య అధినయమ్ అనే పేర్లు పెట్టారు.

కొత్త చట్టాలకు హిందీ, సంస్కృతంలో పేర్లు పెట్టారు. ఇవి దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా ఉన్నాయి అని వినోద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాల మార్పులను వాయిదా వేయాలని మోడీని డిమాండ్ చేస్తున్నాం. ఎఫ్ఐఆర్‌ను రిజిస్టర్ చేయకుండా ప్రిలిమినరీ ఎంక్వైరీ చేసే విధంగా కొత్త చట్టం తెచ్చారు. స్టేషన్ బెయిల్‌ను స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ దుర్వినియోగం చేస్తున్నారు. బాధితుడు హింసకు గురి అవుతున్నారు.

దేశ న్యాయ వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తుంది. కొత్త చట్టాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతంగా మారాయి. చేతికి బేడీలు వేయవద్దని సుప్రీం కోర్టు చెప్పింది. ఇప్పుడు కొత్త చట్టాల్లో చేతికి బేడీలు వేయాలని వుంది. కొత్త చట్టాల వలన బాధితుడికి అన్యాయం జరుగుతోంది. పోలీస్ కస్టడీకి తీసుకోవడానికి 14 రోజులకు బదులుగా 90 రోజుల వరకు అవకాశం ఇచ్చారు.

బార్ కౌన్సిల్‌ను మోడీ మోసం చేశారు. కొత్త చట్టాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేస్తున్నా. కొత్త చట్టాలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

## రూ.10 లక్షల పరిహారం ఎక్కడ?



ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని గత 5 రోజులుగా భారీ వర్షాలు వణికిస్తున్నాయి. వరదల్లో కొట్టుకుపోయి 11 మందికిపైగా మృతి చెందారు.బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కేజ్రీవాల్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ మేరకు మంత్రి అతిషి రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు.వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారందరి కుటుంబాలకు రూ.10లక్షలు పరిహారంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు అతిషి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆసుపత్రులు, పోలీసుల సాయంతో ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలను గుర్తించాలని ఆదేశించారు. జీఎన్సీటీడీ తరఫున వారికి పరిహారాన్ని వెంటనే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు పరిహారం ఆర్థికంగా సాయపడుతుందని అతిషి పేర్కొన్నారు.



# టీడీపీ కార్యకర్తలకు ఊరట

● మూడు నెలల్లో రౌడీ షీట్లు, కేసుల ఎత్తివేతకు చర్యలు
● కేసుల వివరాలు సేకరిస్తున్నాం- పల్లా శ్రీనివాసరావు

సూర్య, ప్రధాన ప్రతినిధి : టీడీపీ కార్యకర్తలపై గత ప్రభుత్వం పెట్టిన రౌడీషీట్లు, ఇతర కేసుల ఎత్తివేతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాల్లోని కార్యకర్తలపై నమోదైన కేసుల వివరాలను తెలుసుకుని వాటి ఎత్తివేతకు మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఈ మేరకు వివరాలను సేకరిస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. లీగల్ విభాగం ద్వారా కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించిన సమయంలో కేసుల ఎత్తివేతపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తప్పుడు కేసులు నమోదు చేసిన అధికారులపై చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు కూడా తమపై నమోదు అయిన కేసుల వివరాలను టీడీపీ పార్టీ కార్యాలయానికి అందచేయాలని ఆదేశించినట్లు పల్లా వివరించారు.

# ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆషాఢ సరే మహోత్సవం

● ఆలయంలోని ఆరవ అంతస్తులో ఆషాఢ మాసపు సారెకు ఏర్పాట్లు.. ● సారె ఇచ్చిన వారికి అమ్మవారి దర్శనం కల్పిస్తాం: ఈవో రామారావు



విజయవాడ ... ఆషాఢ మాసంలో అమ్మవారికి ఆషాఢ మాసవు సారె ఇస్తారు అని ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయం ఈఓ రామారావు తెలిపారు. ఆలయంలోని ఆరవ అంతస్తులో ఆషాఢ మాసవు సారెకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సారె ఇచ్చిన వారికి అమ్మవారి దర్శనాన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఆ తరువాత శాఖంబరీ ఉత్సవాలకు కావాల్సిన కూరగాయలు భక్తులు సమర్పించడానికి ముందుకు వస్తున్నారు.. జులై 19, 20వ తేదీలలో ఇంద్రకీలాద్రిపై శాకాంబరి ఉత్సవాలు కొనసాగనున్నాయని ఆయన చెప్పుకొచ్చారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆషాఢ సరే మహోత్సవం అద్భుతంగా జరుగుతుంది.. కదంబం ప్రసాదంగా ఇవ్వడానికి ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ఈవో రామారావు వెల్లడించారు.

ఇక, వారాహి నవరాత్రులు వస్తున్నాయి.. వారాహి ఉపాసన, హోమం, హవనం, చండీ పారాయణ, రుదహ్రోమం వారాహి నవరాత్రులలో జరువుతామని ఇంద్రకీలాద్రి ఆలయ ఈవో రామారావు చెప్పుకొచ్చారు. జులై 6 నుంచి 15 వరకూ వారాహి నవరాత్రులు కొనసాగనున్నాయి. 14వ తేదీన మహంకాళీ ఉత్సవ కమిటీ బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి బోనం సమర్పిస్తారు.. కనకదుర్గమ్మ ఆలయంలో బోనాలు సమర్పణకు విశేషంగా ఏర్పాటు చేస్తున్నాం.. జులై 26న ఇంద్రకీలాద్రి నుంచి భాగ్యనగరం మహంకాళి అమ్మవారి ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలకు పట్టు వస్త్రాల సమర్పణ జరుగుతుందన్నారు. నిన్న మల్లేశ్వరస్వామి వారికి బంగారు తాపడం చేసిన కవచం, నాగాభరణం, మకరతోరణం, పీఠం దాతలు ఇచ్చారు అని ఆలయ ఈవో పేర్కొన్నారు.

అయితే, కనకదుర్గమ్మ ఉన్న ఇంద్రకీలాద్రిపై సనాతనంగా ఉన్న శివలింగం స్వరణమయం అయింది అని ఈవో రామారావు చెప్పారు. అత్యంత పురాతన ఆలయం పూర్తిగా అభివృఎద్ధి జరిగింది.. మహానివేదన సమయంలో సామాన్య భక్తులు అధిక సంఖ్యలో వేచి ఉంటారు.. ఆ సమయంలో ప్రోటోకాల్ దర్శనాలు ఆపాలని నిర్ణయించామన్నారు. 11:45 నుంచి 12:15 వరకూ మహా నివేదన ఉంటుంది.. 11:30 నుంచి 1:30 వరకూ ప్రోటోకాల్ దర్శనాలు ఉండవు.. సామాన్య భక్తులకు దర్శనంలో ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

# టీడీపీ విధానాలపై బొత్స ప్రశంసలు

విశాఖపట్నం, జూన్ 30: టీడీపీ నేతృఎత్వంలోని కూటమి ప్రభుత్వ విధానాలను మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కొనియాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఆయన ప్రశ్నించారు. ఆదివారం నాడు మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ.. టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి 20 రోజులైందని.. ఆ పాలనపై తానిప్పుడే విమర్శలు చేయబోనని అన్నారు. ఇదే సమయంలో రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వటం మంచిదేనని ప్రశంసించారు. మిగిలిన హామీలను కూడా అమలు చేసే శక్తి వారికి రావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇదే సమయంలో వీసీల రాజీనామాలపై బొత్స స్పందించారు. వీసీ ల రాజీనామాలను ప్రభుత్వం కోరటం తప్పు కాదన్నారు. వైసీపీ కార్యాలయాల్లోకి కూటమి నేతలు చొరబడితే తప్పు అంటున్నానని అన్నారు. గతంలో టీడీపీ ఆఫీస్పై తమ పార్టీ నేతలు చేసిన దాడి కూడా తప్పు అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఉభయ పక్షాల వారు సంయమనం పాటించాలని బొత్స విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన వలన కలిగే నష్టం కంటే జగన్ పాలన వల్లే నష్టం ఎక్కువైందని అంటున్నారని.. ఎప్పుడు నష్టం జరిగింది? ఎప్పుడు లాభం జరిగిందనేది లెక్కల్లో తేలుతుందని చెప్పారు బొత్స. ఇక తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను మీడియా ప్రతినిథులు ప్రస్తావించగా.. స్పందించేందుకు నిరాకరించారు. నిజాలు నిలకడగా తెలుస్తాయని వ్యాఖ్యానించారు. ఇక పార్టీ ఓటమిపై స్పందించిన బొత్స.. ప్రజలను తమను అంగీకరించలేదు కాబట్టే తాము ఓడిపోయామన్నారు.



# నేడు టెట్ నోటిఫికేషన్ విడుదల

అమరావతి... ఏపీ ప్రభుత్వం జూన్ 1 ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్ విడుదల చేయనుంది. జులై 2 నుంచి టెట్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ నేడు ఒక ప్రకటనలో వెల్లడించింది ప్రభుత్వవెబ్ పోర్టల్ లో టెట్ కు సంబంధించి పూర్తి వివరాలు పొందుపరిచారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తున్న సంగతి తెలిసిందే. టెట్ పై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ, అదనపు సమాచారం కోసం కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశామని చెప్పారు.

వైసీపీ ప్రభుత్వం ఫిబ్రవరిలో టెట్ నిర్వహించగా... 58.56 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఆ సమయంలో టెట్ కు 2.35 లక్షల మంది హాజరయ్యారు. ఏపీలో కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో ఇటీవల మెగా డీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన 6,100 పోస్టుల డీఎస్సీ నోటిఫికేషన్ ను ఇవాళ రద్దు చేస్తూ జీవో కూడా జారీ చేశారు.

### హైదరాబాద్ పబ్బుల్లో

# డాగ్స్ శిక్షణ

హైదరాబాద్.... హైదరాబాద్ పబ్బుల్లో ఫుల్లీ ట్రైన్డ్ డాగ్స్ ఎంటర్ అయ్యాయి. ఆదివారం పబ్బులు చుట్టేస్తూ హడావిడి చేశాయి. అయితే ఈ డాగ్స్ పబ్స్ కి వెళ్ళింది ఎంజాయ్ చేయడానికో, కస్టమర్స్ ని ఎంటర్టైన్ చేయడానికో కాదు. అలాగే ఇవి సాధారణ డాగ్స్ కూడా కాదు. పోలీసు శాఖలో క్రిమినల్స్ ని పట్టుకోడానికి స్పెషల్ గా శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి డ్రగ్స్ నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. మాదకద్రవ్యాలు సేకరించడం వల్లే యువతలో ఉన్మాదం పెరిగిపోతోందని, డ్రగ్స్ తీసుకుంటున్నవారు క్రిమినల్ యాక్టివిటీస్ కి కూడా పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. రాష్ట్రంలో క్రైం రేట్ తగ్గించడానికి డ్రగ్స్ నియంత్రణ కూడా అవసరమని భావిస్తోన్న సర్కార్... ఆ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు డ్రగ్స్ పెడ్లర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.

ఈ క్రమంలో పబ్బులు, క్లబ్బులపై ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన స్నిపర్ డాగ్స్ ని సోదాలకి తీసుకెళ్తున్నారు. వీకెండ్ కావడంతో ఆదివారం హైదరాబాద్ లోని పలు పబ్బుల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జూబిలీహిల్స్, బంజారాహిల్స్ లోని పబ్బుల్లో డాగ్స్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు.

### వాలంటీర్లకు త్వరలోనే గుడ్ న్యూస్ : మంత్రి కందుల దుర్గేష్

అమరావతి... ఏపీ వాలంటీర్ వ్యవస్థపై త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. నిడదవోలులో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వానికి మించి కూటమి సర్కారు సంక్షేమం అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృఎద్ధి పథంలో ముందుకు తీసుకువెళతామని చెప్పారు. వైసీపీ హయాంలో ప్రభుత్వం ఐదేళ్లలో పెన్షన్ రూ. వెయ్యి మాత్రమే పెంచిందని అన్నారు. కానీ.. కూటమి అధికారంలోకి రాగానే పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచి 3 నెలలతో కలిపి మొత్తం రూ. 7 వేలు ఇస్తుందని పేర్కొన్నారు. జూలై 1వ తేదీ రోజు 90 శాతం వరకు పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల ఏపీలో అభివృఎద్ధి కుంటు పడిందని ఆరోపించారు.

# క్రికెట్ అభిమానులకు పండగే

### తెలంగాణలో కొత్తగా మూడు స్టేడియంలు...

హైదరాబాద్... బీసీసీఐ సహకారంతో రాష్ట్రంలో క్రికెట్ సర్వతోముఖాభివృఎద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సీఏ) కొన్ని విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుంది. ఆదివారం జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, కార్యదర్శి దేవ్రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ తెలంగాణ క్రికెటర్ల శ్రేయస్సు, ప్రగతిని దృఎష్టిలో పెట్టుకుని హెచ్సీఏ క్రికెట్ ఆపరేషన్స్ హెడ్గా మాజీ పేసర్ వెంకటేష్ ప్రసాద్ను నియమించేందుకు ఆయనతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్కు తగ్గట్టు త్వరలో కొత్త అంతర్జాతీయ స్టేడియం నిర్మించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరపనున్నామని, సర్కార్ భూమిస్తే సులభంగా కట్టవచ్చు అన్నారు. అలానే రెండు, మూడు జిల్లా కేంద్రాల్లోనూ స్టేడియాల నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నామని, టెండర్లు పిలిచి మహబూబ్నగర్ స్టేడియంలో టర్ఫ్ వికెట్, నిజామాబాద్ స్టేడియంకు చుట్టు ఫెన్సింగ్ వేయనున్నామని తెలిపారు.

**జూలై 8 నుంచి డొమిస్టిక్ సీజన్ ప్రారంభం..:** ఈనెల 8 నుంచి డొమిస్టిక్ క్రికెట్ షెడ్యూల్ ప్రారంభమవనుందని కార్యదర్శి దేవ్రాజ్ చెప్పారు. అలానే మహిళల లీగ్ క్రికెట్ను కూడా ప్రారంభించేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మించే ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. కొత్త కోచ్లు, అంపైర్లు, గ్రౌండ్స్మెన్, స్కోరర్ల ఉద్యోగాల భర్తీ కూడా చేపట్టనున్నామని దేవ్రాజ్ తెలిపారు.

**పెండింగ్ ఆడిట్లకు మోక్షం.. :** 2018 నుంచి పెండింగ్లో ఉన్న ఆడిట్లను ఆమోదించామని జగన్ మోహన్ రావు తెలిపారు.

# ఏపీ సీఎం అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా

● కేంద్ర సర్వీసుల నుంచి రిలీవైన ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా ● ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేసిన కార్తికేయ మిశ్రా

అమరావతి... ఏపీ సీఎం అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా నియామకమయ్యారు. కేంద్ర సర్వీసుల నుంచి ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా రిలీవయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కార్తికేయ మిశ్రా రిపోర్ట్ చేశారు.

కేంద్ర సర్వీసుల్లో ఉన్న పలువురు ఏపీ కేడర్ అధికారులను రిలీవ్ చేయాల్సిందిగా కోరుతూ కొద్ది



రోజుల కిందట కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. ఇప్పటికే కేంద్రం నుంచి ఐఏఎస్ పీయుష్, ఐపీఎస్ మహేష్ చంద్ర లడ్హా రిలీవ్ అయ్యారు. తాజాగా కేంద్రం నుంచి కార్తికేయ మిశ్రా రిలీవ్ అయ్యారు. కేంద్ర ఆర్థిక సేవల విభాగం డైరెక్టరుగా పని చేసి కార్తికేయ మిశ్రా రిలీవయ్యారు.

# ఏపీకి భారీ వర్షాలు...

అమరావతి... ఋతుపవనాల ఉత్తర పరిమితి ఇప్పుడు జైసల్మేర్, చురు, హిస్సార్, కర్నాల్, జలంధర్, తరంతరణ్ గుండా వెళుతుంది. సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా-గంగా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉన్న ఉపరితల అవర్తనము ఇప్పుడు తూర్పు జార్ఖండ్ పరిసరాల్లో ఉంది. సముద్ర మట్టానికి సగటున 5.8 7.6 కిమీల మధ్య 20ఓ ఉత్తర అక్షాంశము వద్ద గల గాలి కోత / షీర్ జోన్ ఇవుడు బలహీన పడినది. ఈ క్రమంలో రాబోవు మూడు రోజులకు వాతావరణ సూచనలు ఇప్పుడు తెలుసుకుందాం

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాం :-ః

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశము ఉంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది . తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ :-

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశము ఉంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా



ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది.

తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది

రాయలసీమ : తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 30 -40 కి మీ వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరువులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.

# వెంకట్రామిరెడ్డి అజ్ఞాతం వీడి అరెస్ట్ అవుతారా..?

● ఇంతకీ ఎక్కడున్నారనే పోలీసులు నిఘా ● పోలీసులకు లొంగిపోతారా? లేక పోలీసులే అరెస్ట్ కు సిద్ధమవుతారా?



అమరావతి... ఈవీఎం ధ్వంసం సహ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డి అరెస్ట్ అయ్యారు. అయితే ఇప్పుడు అందరి దృఎష్టి పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డి తమ్ముడు వెంకట్రామిరెడ్డి మీద పడింది. ఆయన ఎక్కడున్నారనే దానిపై పోలీసులు నిఘా పెంచారు. ఆయన కూడా తన అన్నలాగే పోలీసులకు లొంగిపోతారా? లేక పోలీసులే ఆయనను అరెస్ట్ చేస్తారా? అనే చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గం పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. ఈవీఎంల ధ్వంసంతో పాటు పార్టీ కార్యాలయాలపై దాడులు, బాంబుల మోతలు, ఏజెంట్లపై ఎటాక్లతో రెండు రోజుల పాటు ఈ ప్రాంతం అట్టుడికి పోయింది. దీంతో అసలు అక్కడ ఏం జరుగుతుందనే చర్చ అంతటా మొదలైంది. పోలీసులు అల్లర్లకు పాల్పడిన వారందరినీ అరెస్ట్ చేసి జైలుకి పంపించారు. పోలింగ్ బూత్లో ఈవీఎం ధ్వంసం చేసి అడ్డువచ్చిన నంబూరి శేషగిరిరావుపై దాడి చేసిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పోలీసులు 307 హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

దీంతో పాటు కారంపూడిలో సిఐ నారాయణ స్వామిపై దాడి చేయడమే కాకుండా టీడీపీ కార్యాలయం దగ్ధం చేసిన ఘనటలోనూ పిన్నెల్లిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డి మధ్యంతర బెయిల్ పిటిషన్ను హైకోర్టు కొట్టేయడంతో పోలీసులు రెండు రోజుల క్రితం ఆయనను అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. ఆయన అరెస్ట్ తరువాత అందరి దృఎష్టి ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపైనే పడింది. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఎక్కడున్నారనే దానిపై పోలీసులు ఫోకస్ పెట్టారు. సీఐపై దాడి ఘటన కేసులో వెంకట్రామిరెడ్డితో కూడా ఉన్నాడని పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పిన్నెల్లి సోదరుల స్వగ్రామమైన కండ్లకుంటలో టీడీపీ ఏజెంట్ మాణిక్యాలరావుని బెదిరించి దాడి చేసిన ఘటనలోనూ ఆయనపై హత్యయత్నం కేసు నమోదైంది. ఈ రెండు కేసులతో పాటు మరో ఏడు కేసుల్లో వెంకట్రామిరెడ్డి నిందితుడిగా ఉన్నారు. పోలింగ్ జరిగిన మే 13 తర్వాత వెంకట్రామిరెడ్డి తన అన్న రామకృఎష్ణారెడ్డితో కలిసి హైదరాబాద్ వెళ్లారు. అయితే అప్పటి నుంచి వెంకట్రామిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. రామకృఎష్ణారెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించి కౌంటింగ్ అయ్యేంత వరకు మధ్యంతర బెయిల్ పొందారు. ఆయన బెయిల్ రద్దు కావడంతో పోలీసులు రామకృఎష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. ఇంతా జరుగుతున్న వెంకట్రామిరెడ్డి అజ్ఞాతం వీడలేదు. ఆయన ఎక్కడున్నారన్నది ఆయన అభిమానులకు కూడా తెలియడం లేదు. ఈ క్రమంలోనే పోలీసులు వెంకట్రామిరెడ్డి కోసం గాలింపు ముమ్మరం చేశారు. మరోవైపు ఈ వ్యవహారంలో పోలీసుల తీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకూ వెంకట్రామిరెడ్డి ఎందుకు అరెస్ట్ చేయలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే రామకృఎష్ణారెడ్డి అరెస్ట్ కావడంతో పోలీసులు తమ దృఎష్టి అంతా వెంకట్రామిరెడ్డి మీద పెట్టారని.. త్వరలోనే ఆయనను కూడా అరెస్ట్ చేస్తారని తెలుస్తోంది. మొత్తానికి పిన్నెల్లి సోదరులు వ్యవహారం పల్నాడులో చర్చనీయాంశంగా మారింది.

### ఉచిత బస్సు ప్రయాణంపై

# త్వరలోనే మహిళలకు తీపి కబురు

● మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎన్నికల హామీ ● త్వరలోనే విశాఖ నుంచే ప్రారంభిస్తామన్న మంత్రి రాంపప్రాద్ రెడ్డి ● కర్ణాటక, తెలంగాణల్లో పథకం అమలు తీరును పరిశీలిస్తామని వెల్లడి



విశాఖపట్నం ... మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీపై త్వరలోనే తీపి కబురు చెబుతామని ఏపీ రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంపప్రాద్ రెడ్డి వెల్లడించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని విశాఖ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని తప్పకుండా నెరవేర్చుతామని వివరించారు. ప్రస్తుతం ఈ పథకం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అమల్లో ఉందని, ఆ రెండు రాష్ట్రాల్లో పథకం అమలు తీరును నిశితంగా పరిశీలించి, ఏపీలో విధివిధానాలు ప్రకటిస్తామని రాంపప్రాద్ రెడ్డి స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిగా విలీనం చేయలేదని, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో ఆర్టీసీని ప్రక్షాళన చేస్తామని చెప్పారు. జగన్ పాలనలో మంత్రులు గంగిరెద్దుల్లా తలలు ఊపడం తప్పించి ఏంచేయలేదని, కానీ కూటమి మంత్రులకు సీఎం చంద్రబాబు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని వెల్లడించారు.

# ఏపీలో నేడు పెన్షన్ల పంపిణీ

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పెన్షన్ల అందజేత ● పెంపుతో కలిపి రూ.7 వేల పెన్షన్ అందించనున్న చంద్రబాబు సర్కారు



విజయవాడ... నేడు జులై 1 న, పెంచిన పెన్షన్ల పంపిణీకి ఏపీ సర్కారు సన్నద్ధమవుతోంది. ఏప్రిల్ నుంచి పెంచిన మేర రూ.3 వేలు, నెలవారీ పెన్షన్ రూ.4 వేలు కలిపి రేపు లబ్ధిదారులకు రూ.7 వేలు అందించనున్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెంచిన పెన్షన్లు అందుకోనున్న తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

దీనిపై ఏపీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. లబ్ధిదారులకు ఇంటి వద్దనే పెన్షన్లు అందజేస్తామని స్పష్టం చేశారు. పెన్షన్ రూ.1000 పెంచేందుకు వైసీపీకి ఐదేళ్లు పట్టిందని విమర్శించారు. ఇక, వాలంటీర్లపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

కాగా, ఏపీలో తొలి రోజే వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో, ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ జరగాలని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు అందించాలని స్పష్టం చేశారు.

అటు, తాడేపల్లి మండలం పెనుమాకలో సీఎం చంద్రబాబు రేపు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేయనున్నారు.

# ఉపాధి హామీ బకాయిలను విడుదల చేయండి

### చంద్రబాబుకి రాజేందప్రసాద్ విజ్ఞప్తి

సూర్య, ప్రధాన ప్రతినిధి : 2018- 19 సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనుల పాత బకాయిలను చెల్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి ఉపాధి హామీ పనుల వివరాలను వెల్లడించారు. ఆ బకాయిలు చెల్లించాలని అధికారులకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేసిన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి త్వరలోనే బిల్లులు చెల్లించడమే కాకుండా, చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.

# విజయవాడ విమానాశ్రయంలో కార్గో సేవలు

సూర్య , ప్రధాన ప్రతినిధి : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో జులై 1వ తేదీ నుంచి కార్గో సేవలు పునః ప్రారంభం కానున్నాయి. కార్గో సర్వీసుకు 2021లో ముందడుగు పడినప్పటికీ కరోనా కారణంగా నిలిచిపోయాయి. తాజాగా కార్గో సేవల పునరుద్ధరణకు పిలిచిన టెండర్ ను ఒమేగా ఎంటర్ ప్రైజస్ సంస్థ దక్కించుకుంది. విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రం నుంచి ఆక్వా ఉత్పత్తులైన చేప, రొయ్యలతోపాటు పూలు, పండ్లు, మిర్చి తదితర ఉత్పత్తులను దేశంలోని ఏ ప్రాంతానికైనా సరసమైన ధరలలో గంటల వ్యవధిలో చేర్చేందుకు కార్గో సర్వీసు దోహదపడుతుందన్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ సర్వీసు నడిపేందుకు కస్టమ్స్ అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

# ఎన్నికల డీఎస్సీ ప్రకటనను రద్దు

● గత డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారు రుసుము చెల్లించనవసరం లేదు ● కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి ● ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

సూర్య, ప్రధాన ప్రతినిధి: మెగా డీఎస్సీతోపాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జులై 1న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో.. గత ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల డీఎస్సీ ప్రకటనను రద్దు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లో 6,100 టీచర్ పోస్టులు మాత్రమే ఉన్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించిన టెట్లో అర్హత సాధించని వారు, ఈ టెట్ ప్రకటన తర్వాత బీఈడీ, డీఈడీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నందున మెగా డీఎస్సీతోపాటు టెట్ కూడా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

టెట్, మెగా డీఎస్సీకి ఒకేసారి కొంచెం తేదీల మార్పుతో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మొదట టెట్ నిర్వహిస్తారు. ఆ తర్వాత డీఎస్సీకి సన్నద్ధమయ్యేందుకు 30 రోజులు సమయం ఇవ్వాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. అనంతరం డీఎస్సీ పరీక్ష ఉంటుంది. జులై 1న మెగా డీఎస్సీ, టెట్కు ప్రకటనలు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. గత డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారు రుసుములు చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

అక్షరం



సోమవారం 1 జూలై 2024

editpage@suryaa.com

# స్వారోచిషుడే స్వారోచిష మనువు



వనం జ్వాలా నరసింహారావు
8008137012

వరూధిని కొడుకు స్వరోచికి ఇందీవరాక్షుడి కూతురు మనోరమతో వివాహం స్వరోచి బాణ ప్రయోగం వల్ల రాక్షసాకారాన్ని వీడి నిజరూపాన్ని ధరించిన గంధర్వరాజు ఆకాశంలో వున్న తన విమానం నుండి భూమ్మీదకు దిగాడు. తనతో పోరాడిన రాక్షసుడు గంధర్వాకారం దాల్చడం స్వరోచికి విస్మయం కలిగించింది. కిందికి దిగిన గంధర్వుడు స్వరోచిని ఆలింగనం చేసుకున్నాడు. తాను స్వరోచి తల్లికి సోదరుడినని, అందువల్ల అతడు తన మేనల్లుడని, తన పేరు ఇందీవరాక్షుడని, మనోరమ తన కుమార్తె అని, ముని శాపాన తనకు రాక్షసత్వం కలిగిందని, చివరకు తన ప్రియపుత్రికనే భక్షించడానికి పూనుకున్నానని అన్నాడు గంధర్వరాజు. ఇలా ఇందీవరాక్షుడు తన విషయం చెప్తుంటే ఆయన కూతురు మనోరమ తండ్రి పాదాలకు నమస్కారం చేసింది. ఆ తరువాత ఇందీవరాక్షుడు తన శాప వృత్తాంతాన్ని వివరించాడు స్వరోచికి. మోసం చేసి తాను ఒక ముని దగ్గర వైద్యశాస్త్రాన్ని అభ్యసించిన కారణాన ఆయన తనను రాక్షసుడివి కమ్మని శపించినట్లు చెప్పాడు. తన అపరాధాన్ని మన్నించమని మునిని కోరానని, శాపం పోవడానికి ఎన్ని దినాలు పట్టుతుందని అడిగానని, అప్పుడాయన కనికరించి స్వల్పకాలంలోనే అని చెప్పాడని అన్నాడు. రాక్షసాకారంలో తాను తన కుమార్తెను మింగబోయే సమయంలో ఒకానొక మహానుభావుడు వేసిన బాణం వల్ల తన శరీరం దహించి దివ్యరూపం వస్తుందని శాప విమోచన కూడా చెప్పాడని అన్నాడు. తన రాక్షసత్వం పోగొట్టి తనకు మహోపకారం చేసిన స్వరోచికి ప్రత్యుపకారంగా తన కూతురునిచ్చి వివాహం చేస్తానని చెప్పాడు ఇందీవరాక్షుడు. తాను నేర్చుకున్న వైద్యశాస్త్రాన్ని కూడా తన కూతురుతో సహా స్వరోచికిస్తానని అన్నాడు. స్వరోచి దానికి అంగీకరించాడు.

తమరాజుకు శాప విమోచనం కలిగిన సంగతి తెలుసుకొని, మర్నాడు, ఇందీవరాక్షుడి పూర్వ సేవకులైన గంధర్వులు అక్కడికి వచ్చి ఆయన దర్శనం చేసుకొన్నారు. స్వరోచి, మనోరమ సహితంగా ఇందీవరాక్షుడు స్వర్ణమయ రథం ఎక్కి ఆకాశమార్గాన మందరగిరికి (గంధర్వ పురానికి) పోయారు. ఆ తరువాత ఇందీవరాక్షుడు మందరాద్రి విశేషాలను స్వరోచికి వివరించాడు. ఒక రాజమందిరంలో స్వరోచిని విడిది చేయించాడు ఇందీవరాక్షుడు. స్వరోచిని, మనోరమను పెళ్లికొడుకుగా, పెళ్లికూతురుగా అలంకారం చేశారు పేరంటాలు. ఆ తరువాత ఇరువురూ వివాహ వేదికకు చేరుకున్నారు. పెండ్లికుమారుడైన స్వరోచికి మామైన గంధర్వరాజు శాస్త్రోక్తంగా మధుపర్కాన్ని ఇచ్చాడు. గంధర్వరాజు విష్ణుమూర్తిని పూజించిన విధంగా అల్లుడిని గౌరవించి లక్ష్మీ సమానురాలైన కూతురును స్వరోచికి ధారాపూర్వకంగా సమర్పించాడు. అంటే కన్యాదానం చేశాడు. తదనంతరం మంగళసూత్ర ధారణ, తలంబ్రాల కార్యక్రమం నడిచింది. అగ్నికి ప్రదక్షిణ నమస్కారాలు కూడా జరిగాయి. అరుంధతీదేవికి నమస్కారం చేయించారు వధూవరులను. వంద భద్రజాతి ఏనుగులను ఇందీవరాక్షుడు అల్లుడైన స్వరోచికి అరణంగా ఇచ్చాడు. తండోపతండాలుగా హయాలను కానుకగా ఇచ్చాడు. రత్నాలతో ప్రకాశించే విమానాన్ని కానుకగా ఇచ్చాడు. కూతురు మనోరమకు అనేక రకాల ఆభరణాలను, పనిముట్లలను, వస్త్రాలను, వస్తుసమూహాలను దాచుకోవడానికి చక్కటి పెట్టెలను, సుగంధ ద్రవ్యాలను, పనికత్తెలను, దాసీజనాన్ని అరణంగా ఇచ్చాడు ఇందీవరాక్షుడు. కొన్ని గ్రామాలను కూడా వివాహ సమయంలో అరణంగా ఇచ్చాడు కూతురుకు. పెండ్లికి వచ్చిన వారందరికీ కట్నకానుకలు ఇచ్చి ఇందీవరాక్షుడు సత్కరించాడు.

స్వరోచికి, వనదేవతకు పుట్టినవాడే స్వారోచిష మనువు స్వరోచి, మనోరమలు వివాహానంతరం కలిసిమెలిసి సుఖాలను అనుభవించారు. అలా వుండగా ఒకనాడు విచారంగా వున్న భార్యను చూసి కారణం అడిగాడు స్వరోచి. తన మీద అమితమైన ప్రేమకల ఇద్దరు చెలికత్తెలు ఒక ముని శాపం వల్ల రోగపీడితులై వున్నారని, వారి రోగం పోగొట్టే విధానం తెలియక విచారపడుతున్నానని, కాబట్టి స్వరోచి ఆ రోగం పోగొట్టుతే తనకు సౌఖ్యం వుంటుందని చెప్పింది మనోరమ. భార్యను విచారపడవద్దని అంటూ, తాను నేర్చుకొన్న వైద్యశాస్త్రాన్ని ఉపయోగించి ఆమె చెలికత్తెల రోగబాదను మాన్పిస్తానని అన్నాడు స్వరోచి. ఆమె చెలికత్తెలు ఎక్కడున్నారో చెప్తే వైద్యం చేస్తానని, అక్కడికి మనోరమను కూడా తనతో రమ్మని చెప్పి, ఇద్దరూ కలిసి వారిదగ్గరికి వెళ్లారు. తనకు తెలిసిన వైద్యం ద్వారా వారికి దివ్య ఔషధం ఇచ్చి, ఆ రోగానికి తగ్గ అనుపానం, పథ్యం కూడా ఇచ్చి, రోగ నిర్మూలన చేసి వారిని ఆరోగ్యవంతులుగా మార్చాడు స్వరోచి. రోగబాధ నుండి విముక్తి పొందిన ఆ ఇరువురు చెలికత్తెలు పూర్వపు కాంతిని పొంది, స్వరోచిని స్తోత్రం చేశారు. ఆయన చేసిన మహోపకారానికి ప్రత్యుపకారంగా తాము ఏమీ ఇవ్వలేకపోయినప్పటికీ, ఆయన సంపాదించదానికి అవసరమైనవి కొన్ని తమ దగ్గరున్నాయని వాటిని ఇస్తామని చెప్పారు. వారిలో ఒకామె, తాను మందారుడు అనే విద్యాధరుడి కూతురినని, తన పేరు విభావసి అని, భూమ్మీద కల మృగాల, పక్షుల మాటల అర్థం తనకు తెలుసని, ఆ గొప్ప విద్యను తన దగ్గరనుండి గ్రహించి తనను పెండ్లి చేసుకొమ్మని స్వరోచిని కోరింది. ఆ వెంటనే మరొకామె తన పేరు కళావతి అని, తాను ఒక ముని కుమార్తెనని, తనతల్లి తనను పుట్టగానే వదిలి వెళ్లిపోయిందని, ఒక గంధర్వుడు తనను కోరగా తన తండ్రి నిరాకరించడం వల్ల ఆయన్ను ఆ గంధర్వుడు చంపాడని, తనకు దిక్కుతోచక ప్రాణత్యాగం చేద్దామనుకుంటే ఆకాశవీధిలో పోతున్న పార్వతీదేవి వారించిందని, తనకు మహారాజైన స్వరోచి భర్త కాగలదని అన్నదని, అతడిని వివాహం చేసుకొని సకల సౌఖ్యాలు అనుభవించమని అన్నదని చెప్పింది.

తనకు పార్వతీదేవి 'పద్మిని' అనే విద్యను కూడా ఉపదేశించినట్లు పేర్కొన్నది కళావతి. దానిని స్వరోచికి ఉపదేశిస్తానని చెప్పింది. విభావసి, కళావతిల నుండి రెండు విద్యలను నేర్చుకున్నాడు స్వరోచి. ఒక సుముహూర్తంలో ఆ ఇద్దరినీ వివాహం చేసుకున్నాడు. వారి వివాహ సమయంలో దేవదుందుభులు మోగాయి. మలయమారుతం వీచింది. ఆ విధంగా మనోరమను, విభావసి, కళావతిలను పెండ్లి చేసుకొని తన ముగ్గురు భార్యలతో సుఖంగా జీవించసాగాడు స్వరోచి. ఈ నేపథ్యంలో స్వరోచి ఒకనాడు వేటాడదలచి అడవికి పోయాడు. ఆయన వేటాడుతుంటే జంతుజాలాలు భయపడి పారిపోసాగాయి. అపుడు ఆయన దృష్టి ఒక అడవి పందిమీద పడింది. స్వరోచి ఆ సూకరాన్ని చంపడానికి ధనుస్సు సంధించగా ఒక ఆడ లేడి రాజును చూసి మనుష్య భాషలో దాన్ని చంపవద్దని, అది అతడికి ఏ అపకారం చేయలేదని, దాన్ని వదిలి తనను చంపమని అన్నది. ఎందుకు ఇలా చావడానికి సిద్ధపడ్డావని లేడిని అడిగాడు స్వరోచి. తన హృదయం స్వరోచి మీద లగ్నమై వున్నదని, మదన తాపంతో బాధపడుతున్నానని, తనను కూడమని కోరింది లేడి. ఆమె మృగమని, తాను నరుడినని ఇద్దరికీ సంబంధం ఎలా కుదురుతుందని ప్రశ్నించాడు స్వరోచి. తనను స్వరోచి ప్రేమతో కౌగలించుకుంటే చాలునని అనగానే స్వరోచి అలాగే చేశాడు. తక్షణమే ఆ లేడి ఒక మనుష్య స్త్రీ ఆకారంలో కనిపించింది. అలా ఆమె లేడి రూపం ధరించడానికి, ఆ తరువాత మనుష్య స్త్రీ కావడానికి కారణం ఏమిటని అడిగాడు స్వరోచి. తాను ఆ వనానికి దేవతనని, స్వరోచి వల్ల ఒక 'మనువు'ను కనాలని దేవతలు కోరగా ఆయన దగ్గరకు వచ్చానని, తనను కలిసి కొడుకును కనమని, దానివల్ల పుణ్యలోకాలు కలుగుతాయని చెప్పింది. దానికి అంగీకరించిన స్వరోచి ఆమెతో సుఖాలను అనుభవిస్తుండగా ఆమె గర్భాన్ని దాల్చింది. ఒక శుభ దినాన సింహపరాక్రమ సమానుడైన, మన్మథుడిని మించిన సౌందర్యం కల, సార్వభౌమ లక్షణాలు కల, సద్గుణాలు కల, అభిమానధనుడైన ఒక కుమారుడిని కన్నది ఆ వనదేవత. స్వారోచిషుడు అన్న పేరు కల ఆ బాలుడు ఇంద్రియ నిగ్రహం కలవాడై, విష్ణుదేవుడిని గూర్చి బహుకాలం తపస్సు చేశాడు. ఆ ఆదినారాయణుడు కొంతకాలానికి అతడికి ప్రత్యక్షమయ్యాడు. స్వారోచిషుడు విష్ణును పరిపరి విధాల స్తోత్రం చేశాడు. ఆయన దశావతారాలలో ఏమేమి చేశాడో వర్ణించాడు. విష్ణుమూర్తి ఏం వరం కావాల్నో కోరుకొమ్మని స్వారోచిషుడికి చెప్పాడు. విష్ణుమూర్తి సమీపంలో సంచరించే వృత్తిని తనకిమ్మని స్వారోచిషుడు ప్రార్థించాడు. రెండవ మనువుగా నీతిని, ధర్మాన్ని వృద్ధిపరచి, చక్కగా భూమిని పాలించి, ఆ తరువాత సాలోక్య పదవిని పొందమని స్వారోచిషుడికి చెప్పాడు నారాయణుడు. అలా చెప్పి స్వారోచిషుడిని మనుపదానికి పట్టాభిషిక్తుడిని చేసి అంతర్థానం అయ్యాడు విష్ణుమూర్తి. స్వారోచిషుడు మనుత్వాన్ని పొంది శాస్త్ర పద్ధతిన దుష్టులను శిక్షిస్తూ, శిష్టులను రక్షిస్తూ, భూమిని పాలించాడు. స్వారోచిష మనువుగా ప్రసిద్ధికెక్కాడు. చివరకు దేవత్వాన్ని పొందాడు.

(మనుచరిత్ర భాగాలన్నీ సమాప్తం)

(వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ ప్రచురించిన మనుచరిత్రము, పంచమాశ్వాసం షష్టాశ్వాసంఆధారంగా)




## మనుచరిత్ర కథ–5&6

## చప్పట్లే చప్పట్లు



శిఖరానికి చేరినపుడు
చప్పట్లే చప్పట్లు
ఆ హోరులో కానరావు
పొడ చూపిన పొరపాట్లు
లోయలోకి జారినపుడు
చీవాట్లే చీవాట్లు
ఆ జోరులోన గుర్తురావు,
మేలుచేసిన ముచ్చట్లు
అలలపైన స్వారీలో
ఆటుపోట్లు సహజం
లోకరీతి ఎట్లున్నా,
భంగపాట్లు ఎదురైనా,
చిరునవ్వుల నౌకలోన
సాగిపోవాలి నీ పయనం
చేరుకోవాలి కలల తీరం.

డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ.
9440836931.

## ఓ కొంగొత్త ఆవిష్కరణ!



ఒకానొక రోజు తెలియని
అసంబద్ధ సందిగ్ధంలో ముడుచుకుపోయి
ఓ విప్లవ మూలన కూర్చున్నప్పుడు...
చీకట్లో మసక ఎరుపు వెలుతురులో
ఆ గదిలోని ఓజోన్ ఖాళీలోకి
తనలోని అరణ్యాల అతలాకుతలం
అంతా జొరబడి...
అదృశ్య వాస్తవాధీన రేఖలను
ఒకదానికొకటి ఢీకొనే
క్లిష్టమైన నగ్న ఆకారాల
పగిలిన చేనేత అల్లికలను నింపి...
ఊహాచిత్రంలో–
ఒక అల్ట్రావయోలెట్ గీతల
ఊచకోతల కేయాస్ ను
ముద్రపరుస్తుంది!
గుట్టలు గుట్టలుగా–
దారాల చిక్కుముళ్ళ జాలం
చీకట్లో రేడియంలా కనిపిస్తే గనక
విభిన్న వికృత సంస్కృతుల
ఎలుకల ప్రపంచం ఎలా వుంటుందో...
అలా పసలేని మాటలను కూడా
అధివాస్తవికంగానే చూస్తున్నాడతను!
అంతేగాక... తనని తాను కూడా
ఒక త్రిమితీయ ఆయామంలో
పారదర్శకంగా... తన బానిస చర్మాన్ని
లోపలి వ్యాపార అవయవాలను
అనుకరించే నరాలను ఎముకలను
గతచరిత్ర గాథ కళేబరాలను కూడా
తీసి ఆరబెడుతున్నాడు!
కరెన్సీ సమయాన్ని–
గోడమీంచి దోసిట్లోకి బంధించి
ఆపబోతే...
లిక్విడ్ మెర్క్యురీ ఒక తలంపై దొర్లినట్టే
ఓ పట్టాన చిక్కట్లేదు!
స్పృహతో బతకడానికే కదా
ఈ పోరాటాల లోకంలోకి మనం
రక్తపు మడుగులోంచి చొచ్చుకుని
వచ్చింది..!
అయ్యో..!!
తన కన్స్యూమర్ మెదడులోని
కలగాపులగపు ఆలోచనల పొరలను
రూబిక్స్ క్యూబ్ ను సాల్వ్ చేసినట్టే
ఏకాగ్రతతో
యాంత్రికంగా కూరుస్తున్నాడు..!
రేపో మాపో అందులోంచే
ఓ కొంగొత్త ఆవిష్కరణను వెలికితీస్తాడా
ఈ వినూత్న మానవుడు
"మానవత్వం" ఏమాత్రం మరవక..!!?

– రఘు వగ్గు
9603245215

## ఓ మనిషీ తిరిగి చూడు!



ఓ మనిషీ తిరిగి చూడు!
నీ నిర్దయను అడుగులెలా
ముద్రించాయో
ఆ ముందుకెళ్ళే దారిలోనే వసంతం
వాడిపోయి శిశిరాలు మొల్చింది
నువ్వు నాటిన అదృశ్య కంటకాలు
పడగవిప్పి నాట్యమాడుతున్నాయి
మొండిగా వెళితే కాలుష్య కాసారాల్ని
కక్కుతాయిజి
ఆగిపో! దారి మార్చు
మానవత్వపు జాడలు కొసరుకైనా లేని
గతాన్ని ఓ మారు తవ్విచూడు..
శిథిలాల్లో వృథా అయిన కోట్ల వర్షపు
చినుకులు
సముద్రాల్లో ఆత్మహత్య చేసుకుంటున్న
నదులు
మూలుగుతూ ఏదో చెప్పాలని
చూస్తూంటాయి
నోట్ల రెపరెపల్లో వినబడదు..
పుడమితల్లి గర్భాన్ని చీల్చి
అభివృద్ధిపేరుతో
అవయవాలమ్ముకున్నావు కదా!
నువ్వు రంగులు మార్చి బతికిందే కాక
నదుల్ని నల్లగా అడవుల్ని తెల్లగా
మార్చావు
అంతరిక్షంలోంచి కూడా కనబడేటంత
విధ్వంసాన్ని సృష్టి చేశావు!
కూర్చున్న కొమ్మను సొంతం నరికేసావు
ఇక దిగు..
పంచభూతాత్మకమైన ప్రకృతి ముందు
మోకాళ్ళపై కూలబడి నీ తప్పులన్నిటికీ
కన్నీళ్లతో క్షమాభిక్ష వేడుకో
పర్యావరణం చెప్పినట్టు నడు తప్పదు
నీ పిల్లలకు బంగారం కంటే పిడికెడు
మట్టిని మిగిల్చు..
బంగారంలో ఆహారాన్ని పండించలేం
కదా!

– భీమవరపు పురుషోత్తమ్
9949800253

## చరవాణి లీలలు..!

చేతిలో పుస్తకం
ఒకనాటి హస్తభూషణం
చేతిలో చరవాణి
ఈనాటి హస్తభూషణం
పసికందు నుంచి పండు ముదుసలి
వరకు
సామాన్యుల నుండి సంపన్నుల వరకు
అయస్కాంతపు శక్తిలాంటి చరవాణి
శక్తికి
అందరూ ఆకర్షితులే..!
అది సృష్టించే మాయాజాలానికి
అందరూ బందీలే..!
ఉదయం లేచింది మొదలు
రాత్రి పడుకునే వరకు
సెల్ ఫోనే మనిషికి తోడూనీడ!
అదే అన్నింటికీ అండాదండ!
వాయిస్ రికార్డులు, వాట్సప్ మెసేజులు
చాటింగులు, మెయిల్స్
ఫేస్ బుక్కులు, రకరకాల యాప్‌ల
అద్భుత ఆవిష్కరణలతో
సమాచార రంగంలో కొత్త పుంతలు
తొక్కి



ప్రపంచాన్నే దగ్గర చేసిన
సెల్ ఫోన్ లీలలు వర్ణించ తరమా..!?
ఒక తప్పనిసరి ఉపకరణమై
మానవ జీవితంలో ముఖ్య అవసరమై
మనిషితో విడదీయరాని బంధమై
మానవాళికి కార్యసాధక సాధనమై
చెలామణౌతున్న చేతిలోని చరవాణిని
అవసరం మేర వాడితే బహుళ
ప్రయోజనాలు!
మితిమీరి వాడితే బహు అనర్థాలు!!

పి.వి.ప్రసాద్,
9440176824

## మోడుబారిన మొద్దు నుండి మొక్క ఒక్కటీ...

మొదలు నరికిన మోడు ఒకటి
విలపించే అయ్యయో నాపని సరిఅని!
మోడుమొద్దును చూసి పిచ్చిమొక్క
కూడా
పరిహసించే నువ్వు ఖతంఅని!
కానీ ఎక్కడో పుడమి తల్లి కడుపు లో
దాచుకున్న సన్నటి "వేరు" బంధం
కడుపు తీపి చంపుకొనక "జీవం"
ఇచ్చి!
నేనున్నా నంటూ బతుకు భరోసా ఇచ్చి
మొలచి చిగుర్చి చిద్విలాప్యపు
చిరునవ్వుతో
నిటారుగానిలిచి రాజీవి
ఒలకిస్తూ కాలం కలిసి వస్తే మళ్ళీ ఇదే
మోడుతో
వినివికాశపు అంచులు తాకుతూ
రేపటి రోజు నాదై మళ్ళీ
గంభీరంగాఇదేచోట ఉద్భావిస్తాఅంటూ
ఇదే కదాజీవితం? అలుపెరుగని



తల ఒగ్గని జీవన పోరాటం, ఓ మొద్దే
ఇలా
పోరాడితే ? పడి లేచే మనిషి నువ్వెంత
పోరాడాలి? ఎదురు దెబ్బలు తిని
కూడా
ధీశాలి లా ఎదురొడ్డి నిలబడాలి!
ఇదేకదా జీవనమాధుర్యం పరమార్థం
!!

భరత్ భూషణ్ రాజ్ నూతుల పాటి
94942 03379

## న్యాయ పరీక్ష



నల్లకోటు నవ్వింది
తిమ్మిని బమ్మిచేసి
తిరకాసులతో కేసు గెలిచి
నాలుగ్గోడల మధ్య నిశ్శబ్ద–
తీర్పు చిన్నబోయింది
బాధితుడి మోములో
తన్నుకొస్తున్న ఉక్రోషం
పేలవమైన, అచేతనమైన

నెత్తుటి చుక్కను మింగేస్తుంది
మరో నల్లకోటు అప్పీలుకై
ఆశలతో అర్థిస్తుంది ...
నవ దశాబ్దానికి తెర లేపుతూ
బాధితుడి మోహంలో
అప్పులబాధలు ఎండిపోయి
మరీచికలా స్వాగతిస్తుంటే...
మళ్ళీ మొదలైంది కథ
సరికొత్త ఆశలను కూడగట్టుకుని...!

స్యాలకంటి సాయిరాయణ
9550833490

## వర్షం వెలిశాక



వర్షం వెలిశాక
పచ్చిగా వున్న వీధుల్లో పచార్లు
చెయ్యటమంటే
నాకెంతో ఇష్టం
వాడల వెంబడి నెమ్మదిగా ఒక్కో
అడుగు వేస్తూ
తడిసిన గోడల్నీ ..
ఆ గోడల మీద వాలిపోయిన చెట్ల
కొమ్మలు నెమ్మదిగా
నీటిబిందువుల్ని జారవిడుస్తూ మళ్ళీ
కొత్తగా
సంపూర్ణ కిరణజన్యసంయోగక్రియని
జరిపే దృశ్యాన్ని
నేను పరికించి చూడగలను
దారులకిరువైపులా నిలిచివున్న
దుమ్ముకొట్టుకుపోయిన వాహనాలూ
వాటిని మోస్తున్న రోడ్లు కూడా
అప్పటికప్పుడు తళతళా మెరిసిపోవటం
చూపులకెంతో సౌకర్యంగా ఉంటుంది
ఎక్కడెక్కడో తిరిగొచ్చాక
జిడ్డుగా మారిపోయిన పాదరక్షలను
నల్లాకింద కడిగాక
అవి పాదాలకు అందించే శుభ్రమైన
స్పర్శ
ఎంత మృదువుగా వుంటుందో..
అంతకన్నా స్వచ్ఛమైన స్పర్శ
వర్షం వెలిశాక నా చూపులకు
తగులుతుంది
అపరిశుభ్రత గురించి దిగులే లేకుండా
ధూళిలో ఆడుకున్న పిల్లవాడిని
అమ్మ బలవంతంగా లాక్కెళ్ళి స్నానం
పోసిన తర్వాత
ఆ పసివాడి నగ్నదేహం మీద నిలిచిన
నీటి బిందువులు
ఎంత ముచ్చటగొలుపుతాయో !
అలాంటి అనుభూతే
వర్షం వెలిశాక ఆకుల మీద సేదతీరే
పువ్వులు
పకపకమని నవ్వినప్పుడు కూడా
కలుగుతుంది
వాన .. !
సమస్త ప్రాణికోటికి దాహం మాత్రమే
తీరుస్తుందా ? !
ఆకాశగంగ .. !
భూస్పృశుల పాపాలను మాత్రమే
కడిగేస్తుందా ? !
మనుగడలో పేరుకుపోయిన
మురికినంతా
ఎక్కడికో లాక్కెళ్ళిపోయి భూగర్భంలో
కలిపేస్తుంది
ప్రకృతి, పరిసరాలను కడిగే ప్రక్రియలో
ఎంత ఖచ్చితత్వం ఉంటుందో కదా !!
చినుకు సెలయేరై .. నదుల గుండా
సముద్రంలో కలిసే లోపు
ఎన్ని విత్తనాలకు ప్రాణం పోస్తుందో ..
వృథా కావటం వానకు ఉన్న ప్రాథమిక
లక్షణమే కావచ్చు
కానీ, దానికి అది
గురుత్వాకర్షణ నేర్పించిన క్రమశిక్షణ
పాఠం.
నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది
ఈ మురికి ప్రపంచాన్ని కడిగే
చినుకులకుమల్లే
మనస్సు పొరల్లో నిరంతరం
పేరుకుపోతున్న మురికిని కూడా
కడిగేసే వానజల్లు ఏదైనా కురిస్తే
ఎంత బావుంటుందోనని

సోమిశెట్టి వేణుగోపాల్
9182584724

## వారిది నిర్భాగ్యపు జీవితం



నగ్నంగా ఆకారం తిరుగుతుంది
సమాజంలో
ఆదిమానవుడి ఆనవాళ్లను గుర్తుచేస్తూ
నూలు పోగుల దారం నిప్పులా
కాలిపోతే
మతిస్థిమితం తప్పి మనిషికి వస్త్రము
భారమై నిలిచే...

ఏ వ్యాధులు తెలియని నిర్భాగ్యపు
జీవితం
చెత్త కుప్పలపై సేదతీరుతున్న వైనం
మురికి పట్టిన ఆహారం పరమాన్నమై
రుచిస్తుంటే
ఈగలు ముసిరిన దేహం సందేహాలు
లేవనెత్తుతుంది...

రాత్రి పగలు తేడా తెలియని నడకల
వ్యాయామం
తనలో తాను వేదాంతం
వాదించుకుంటూ
అరుపులు కేకల మాటల సవ్వడులా
లావణ్యం
ఎవ్వరికి చెప్పెనో ఆత్మ ధర్మపు ప్రబోధ
విలాసం...

నిండైన సొగసైన తనువుల రూపం
మాలిన్యపు సొగసుతో అలంకారమై
ప్రకాశించే
కాల పరీక్షలో గతి తప్పిన మనసు
విచ్చిన్నమై
కొత్త లోకంలో విహరించే పాత
స్వప్నమై తిరిగే...

తనువుల పై మానసిక దాడి
జరుగుతుంటే
తెలియని అయోమయం కన్నీటి
వీడ్కోలు
కామపు మృగాలకు దొరుకుతున్న
విగతజీవులు
కండ్లున్న సమాజం చీకట్లో చూస్తూ
నిలబడిపోయింది..

అడగడానికి ఎవరున్నారు అనాథలా
నడుస్తుంటే
ఛీత్కారపు మాటలతో శిక్షలు విధిస్తుంటే
గమ్యం లేని బ్రతుకులో కోటి ప్రశ్నలు
ఉదయిస్తుంటే
సూర్యునికి ఏం తెలుస్తుంది పొద్దు
గడిస్తే పోయే వాడికి..

అనాథ శవంలా ఆవిరైపోయే తనువులు
కన్నీటి చుక్కలు రుచి చూడక దేహం
కలిసే భూమిలో
కొందరు పిచ్చినిరి మానసిక రోగిగా
తేల్చిరి
జీవన యాత్రలో వింత జీవిగా
శరీరాన్ని వదిలి పోయేను..

కొప్పుల ప్రసాద్
9885066235

## కదిలే కలలు

నా నేత సోదరుడు
పోగు పోగుకూ రంగులు అద్ది
కలలు మేలుకునే చేతిమగ్గం
రాజవ్వ తెచ్చిన చేపలగంప
ఈ ఇల్లూ ఆ ఇల్లూ దాటుకుని
కాళ్ళు అరిగిపోయేలా
కాలం ఈడ్చుకు పోతున్న విషాదగీతం
సత్తెమ్మ కోసుకొచ్చిన పాలకూర
ఆ ఇంటికి ఈ ఇంటికీ మొక్కుతూ
ఎంత తిరిగినా
శెక్కుడు సంచి నిండని ఆకలి రాగం
ఆటో నరసింహ
చమురు ధరలకు సలాము
కొడుతున్నడు
లలితక్క బొగ్గు తోడేసి
కొలిమిలో నిప్పయితున్నది
వేముగంటి సారు ఎప్పటిలాగే
పాఠాలు చెప్పే పంతులయ్యిండు
నందు
రేపటి బొమ్మకు ఊహలు అద్దుతున్నడు
మెహరు భాయ్ కవిత్వం
మూటగట్టుకుని
ఆఫీసుకు పయనమయ్యిండు
సద్దులు చేత పట్టుకొని
తారు నదిలో ఈదుతున్న చేపలు
నగరం ముందు పొర్లు దండాలు
ఆదర బాదరగ
కలలు ఏవో వెతుకులాడుతున్న
మూగనోములుజి
బదులు దొరకని లోకంలో
ఊరుతున్న ప్రశ్నలు.

–గజ్జెల రామకృష్ణ
8977412795

## ఏలికలు..ఎలికలే

అవును కదా ..మరచే పోయాను
వాళ్ళు ఎలికలుకదా
వాళ్ళెంతైనా భుజం
తట్టే వాళ్ళు కదా
మనమే భరించాల్సిన ధైన్యులం
వాళ్ళు మనకన్నా
చిన్నవాళ్ళు కావచ్చు
తక్కువెరిగిన వాళ్ళు కావచ్చు
మనల్ని గురువులనే
వాళ్ళు కావచ్చు కాని ...
అవి గది లోపలి మాటలే ...
ఏకాంత దీపసన్నిధి
ఎంత వెలుగిచ్చినా
అది ఒకరం ఉన్నప్పుడే
జీవన వ్యాకరణంలో
అనుస్వారం మన
చేతిలో ఉంటె శూన్యం
వాళ్ళ చేతుల్లో ఉంటే అనంతం
అవి సాహిత్య సభలే కావచ్చు
సినీ గీతాల ప్లాస్టిక్
చిగురులే కావచ్చు
కులం చివర వాడి
సూచన వాన్ని
నీ నెత్తి కెక్కిస్తుంది
అది మొదటినుండి
ఉన్నదే తమ్ముడూ
వాడు తింటే భోజన ప్రియుడు
నువ్వు తింటే
తిండి బోతువు
అయినా భయపడేది లేదు
ఈ మర్రి చెట్టు నీడలోనే
నువ్వు ఎదగాల్సి ఉంది
వేర్లమీది అగ్గి కుంపటులను
తన్నుతూనె నువ్వు మరింత
హరిత హరితంగా ఆకాశ వీధికి
కొమ్మలు చాచ వలసి ఉంది .

కాంచనపల్లి గోవర్ధన్ రాజు
9676096614.

## పట్టాభిషేకం

కవి కలానికి
వ్యవస్థ లో కదలిక వస్తే
అదే అతనికి
నిజమైన సన్మానం
కవి ఆలోచనలకు
లోకం చైతన్యమైతే
అదే అతనికి
నిజమైన సత్కారం
కవి ఆవేదనలకు
సమాజం లో మార్పువస్తే
అదే అతనికి
నిజమైన పురస్కారం
కవి సాహిత్యం
సామాన్యుడికి సైతం అర్థమైతే
అదే అతనికి
నిజమైన పట్టాభిషేకం

కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## భాష పై పట్టు కోల్పోతున్న నేటి యువత

(గత వారం తరువాయి)

నేటి యువత వాట్సప్ మెసేజ్ కల్చర్ ని చూస్తే, వారు తెలుగులో అనుకున్న భావాన్ని ఇంగ్లీష్ అక్షరాల రూపంలో వ్రాయడానికి అలవాటు పడుతున్నారు. అంటే తెలుగు, ఇంగ్లీష్ రెండూ మిక్స్ చేసిన ఒక లాంగ్వేజ్ ని వారు ఉపయోగిస్తున్నారు. ఈ మిక్స్ లాంగ్వేజ్నే మనం సరదాగా "తెంగ్లీష్" అని అనవచ్చు. అందుకే ,నేటి యువత ఆంగ్ల భాషతో పాటుగా మాతృభాష పై కూడా పట్టును కోల్పోతున్నారు. యువత ఈ "తెంగ్లీష్" కల్చర్ నుండి వెంటనే బయట పడాలి లేకపోతే వారికి మాతృభాషలో పొరపాట్లు, ఆంగ్లభాషతో అగచాట్లు తప్పవు. భాషకు పునాది మనిషి లోని వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేది భాషే. భాష పై పట్టు సాధించని వ్యక్తి తనలోని సృజనాత్మక శక్తిని ప్రపంచానికి పరిచయం చేసుకోలేడు. అందుకే ప్రాథమిక విద్య నుండే తప్పనిసరిగా అమ్మ నేర్పిన కమ్మని మాతృభాషలో విద్యార్థులకు గట్టి పునాది వెయ్యాలి. ఆ పునాదే ఇతర ప్రామాణిక భాషలను నేర్చుకోవడానికి ఆసక్తిని కలిగిస్తుంది. మాతృభాషలో పటిష్టమైన పునాది ఉన్న ఏ విద్యార్థైనా ఇతర భాషలను చాలా సులువుగా స్పష్టంగా నేర్చుకోగలుగుతాడనేది అక్షర సత్యం. ఆంగ్ల భాష – విద్యాసంస్థల పాత్ర మన మాతృభాష కాని ఆంగ్ల భాషను విద్యార్థులు సమర్థవంతంగా నేర్చుకోవాలంటే అందుకు అవసరమైన వాతావరణాన్ని విద్యాసంస్థలు సృష్టించగలగాలి. విద్యాసంస్థలు విద్యార్థులందరూ మంచి ఆంగ్ల భాషలో పరస్పరం సంభాషించుకునే అనుకూల వాతావరణాన్ని సృష్టించాలి. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా ఆంగ్ల భాషలో వినండి,మాట్లాడం, చదడం మరియు వ్రాయడం పై చక్కటి తర్ఫీదిస్తూ విద్యార్థుల మధ్య ఒక మంచి భాషా సంస్కృతి ( ఏ కల్చర్ అఫ్ లాంగ్వేజ్ ) నెలకొల్పాలి. విద్యార్థులు మంచి వక్తలు మాట్లాడే స్ఫూర్తిదాయకమైన వీడియోలను వీక్షిస్తూ వారు ఉపయోగించే ఇంగ్లీషు భాషను వినే అవకాశాలను విద్యాసంస్థలు కల్పించాలి. తరచుగా ఆంగ్ల భాష లో వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలను విద్యార్థులకు నిర్వహిస్తూ ఉండాలి. విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల ఆసక్తి కలగడానికి ఆ భాష ఔన్నత్యాన్ని తెలియపరిచే "లాంగ్వేజ్ వర్క్ షాప్స్ "ని క్రమం తప్పకుండా నిర్ణీత వ్యవధిలో నిర్వహించాలి. అంతేకాకుండా, విద్యార్థుల చుట్టూ ఉన్న వాతావరణం వారి భాషపై ప్రభావం చూపుతుంది. అందుకే,అసభ్య పదజాలంతో విద్యార్థులు పరస్పరం సంభాషించుకునే అసభ్యకరమైన వాతావరణాన్ని విద్యాసంస్థల్లో ప్రోత్సహించకూడదు. ఇటువంటి వాతావరణం విద్యార్థుల పై మరియు వారి భాషపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అందుకే ఇలాంటి చెడు సంస్కృతిని కూకటివేళ్లతో పెకలించి వెయ్యాలి. ఈ విధమైన జాగ్రత్తలను తీసుకుంటూ విద్యార్థులు చక్కటి ఆంగ్ల భాషను అభ్యసించడానికి అనువైన వాతావరణాన్ని మరియు అవకాశాల్ని విద్యాసంస్థలు ఆచరణలో కొంచెం క్లిష్టమైనా తప్పనిసరిగా కల్పించాలి. భాష – సాంకేతిక ప్రభావం నేడు ఆర్టిఫిషియల్ ఇంటిజెన్స్ లో విప్లవాత్మకత వలన వస్తున్న లాంగ్వేజ్ సాఫ్ట్వేర్స్ కూడా మనిషి భాష పై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. మనిషి సాంకేతికత పేరుతో పూర్తిగా ఈ లాంగ్వేజ్ సాఫ్ట్వేర్స్ పై ఆధారపడితే కొంతకాలానికి మనిషి మళ్లీ మాటలు రాని, రాతలు రాని పాత రాతియుగం లోకి వెళ్ళవలసిన పరిస్థితులు వస్తాయి. అందుకే, విద్యార్థులు స్వయంగా వినడం, మాట్లాడడం,చదవడం మరియు వ్రాయడం పై పూర్తిగా పట్టు సాధించిన తర్వాతే మాత్రమే ఈ లాంగ్వేజ్ సాఫ్ట్వేర్స్ సహకారాన్ని తీసుకోవడం ఉత్తమం.మనిషి మేధస్సులోంచి వస్తున్న ఆలోచనలకు సహకారిగా మాత్రమే ఈ లాంగ్వేజ్ సాఫ్ట్వేర్స్ ని ఉపయోగించుకోవాలి లేనిచో మనిషి మేధస్సులోని సృజనాత్మకత అంతరించిపోతుంది. చదువు మాధ్యమం

ఈ కథనానికి ముగింపుగా, ప్రాథమిక విద్య నుండి మాతృభాష మాధ్యమంలో చదవాలా లేదా ఆంగ్ల మాధ్యమంలో చదవాలా అనే మీమాంశ అవసరం లేదు. మన ప్రవృత్తికి మాతృభాష ఎంత అవసరమో మన వృత్తికి నేడు ఆంగ్ల భాష కూడా అంతే అవసరం. అందుకే, మాతృభాషను పునాదిగా చేసుకుని ఆంగ్లభాషను మరియు అవసరమైన ఇతర ప్రామాణిక భాషలను నేర్చుకోవాలి.

భాష ఒక పాఠ్య పుస్తకం కాదు
మనిషి అంతరంగానికి ప్రతిరూపం
ప్రపంచాన్ని అనుసంధానించే దివ్య సృష్టి

ననుబోలు రాజశేఖర్, 9885739808

# బిజినెస్

## జులైలో బ్యాంకులకు ఎన్ని రోజులు సెలవులో తెలుసా?

రోజుల్లో చాలా వరకు బ్యాంకింగ్ పనులు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. బ్యాంక్ మొబైల్ యాప్‌లో అనేక రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పటికీ రుణం తీసుకోవడం వంటి అనేక పనులు ఉన్నాయి, దీని కోసం బ్యాంకు శాఖకు వెళ్లాలి. అయితే బ్యాంకు బ్రాంచ్‌కి వెళ్లి మూసి ఉంటే? మీ పని ఆగిపోతుంది. మీ సమయం కూడా వృథా అవుతుంది. దీన్ని నివారించడానికి, మీ బ్యాంక్ ఎప్పుడు మూసివేయబడుతుందో మీరు ముందుగానే తెలుసుకోవాలి. నెలలో ప్రతి ఆదివారం, రెండవ, నాల్గవ శనివారం బ్యాంకులకు సెలవు. జులై నెలలో మొత్తం 12 రోజుల పాటు బ్యాంకులు మూసివేయబడతాయి. జూలైలో బ్యాంకులు ఏ తేదీలలో మూసివేయబడతాయో తెలుసుకోండి.

జులైలో విడుదల కానున్న టాప్ స్మార్ట్‌ఫోన్లు ఇవే..

జులైలో ఈ తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉంటాయి.

3 జులై 2024: బెహ్ డింక్లామ్ కారణంగా షిల్లాంగ్ జోన్‌లో బ్యాంకులకు సెలవు 6 జులై 2024: %ఎంఖా% డే కారణంగా ఐజ్వాల్ జోన్‌లో బ్యాంకులకు సెలవు

జులై 7, 2024: ఆదివారం, బ్యాంకులకు

8 జులై 2024: కాంగ్ (రథయాత్ర) కారణంగా ఇంఫాల్ జోన్‌లో బ్యాంకులకు సెలవు

9 జులై 2024: ద్రుక్ప త్షే-జీ కారణంగా గ్యాంగ్‌టక్ జోన్‌లో బ్యాంకులకు సెలవు

13 జులై 2024: రెండవ శనివారం, బ్యాంకులకు సెలవు

14 జులై 2024: ఆదివారం కారణంగా, దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

16 జులై 2024: హరేలా కారణంగా డెహ్రాడూన్ జోన్‌లో బ్యాంకులకు సెలవు

17 జులై 2024: మొహర్రం కారణంగా దేశం మొత్తం బ్యాంకులకు సెలవు

21 జులై 2024: ఆదివారం, బ్యాంకులకు

27 జులై 2024: నాల్గవ శనివారం, బ్యాంకులకు సెలవు

28 జులై 2024: ఆదివారం, బ్యాంకులకు వారపు సెలవు

## జేబులు ఖాళీ చేస్తున్న క్యాష్లెస్ పేమెంట్స్




ప్రస్తుత టెక్ యుగంలో భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా నగదు రహిత చెల్లింపుల వినియోగం పెరిగింది. చాలా మంది ప్రజలు నగదును ఉపయోగించకుండా.. క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, మొదలైన వాటి ద్వారా ఎక్కువ చెల్లింపులు చేయడానికి ఇష్టపడుతున్నారు. అయితే, ఇదే ప్రజల జేబులను చిల్లులు పెడుతుందని చెబుతున్నారు ఆర్థిక నిపుణులు. తాజాగా సర్వే ప్రకారం.. నగదుకు బదులుగా నగదు రహిత చెల్లింపుల మాధ్యమాన్ని ఎంచుకోవడం వల్ల ప్రజలు ఖర్చులు భారీగా పెరుగుతున్నాయట. మెల్బోర్న్ విశ్వవిద్యాలయం, అడిలైడ్ విశ్వవిద్యాలయాలకు చెందిన కొందరు నిపుణులు.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నగదు రహిత లావాదేవీలపై తమ నివేదికను సిద్ధం చేశారు. 17 దేశాలకు చెందిన ప్రజల ఖర్చుల తీరును పరిశీలించారు. అదుపు లేకుండా ఖర్చు..సర్వే ప్రకారం.. ఇంతకు ముందు ప్రజలు తమ ఖర్చులను డైరీల్లో రాసుకుని.. లెక్కలు వేసుకునేవారు. కానీ, ప్రస్తుతం డిజిటల్ లావాదేవీల ట్రెండ్ పెరిగిపోవడంతో డైరీల్లో అకౌంట్స్ రాసుకునే అలవాటు తగ్గిపోయింది. అందుకే.. డబ్బు ఆదా చేసుకోవాలనుకునేవారు.. కార్డులు, ఆన్లైన్ పేమెంట్స్పై మాత్రమే ఆధారపడకుండా నగదును కూడా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్కు బదులుగా నగదు ద్వారా చెల్లిస్తే వారు తమ ఖర్చులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయగలుగుతారు. ఇది మరింత డబ్బును ఆదా చేయడంలో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. నగదును ఉపయోగించేటప్పుడు ప్రజలు తమ వద్ద ఉన్న నగదును లెక్కిస్తుంటారు. ఇది వారి ఖర్చులను ట్రాక్ చేయడానికి సహాయపడుతుందని సర్వే నివేదికలో పేర్కొన్నారు. విలాస వస్తువులపై పెరిగిన ఖర్చు.

## ఐపీవోతో కంపెనీలకు ఇంత లాభమా?



స్టాక్ మార్కెట్ గురించి ఇటీవల ప్రజలకు అవగాహన బాగా పెరిగింది. వివిధ కంపెనీల షేర్లను కొనడం, అమ్మడం చేస్తున్నారు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు బాగా పెరిగాయి. అయితే స్టాక్ మార్కెట్ లోకి కంపెనీలు ఎలా ప్రవేశిస్తాయి. తమ వాటాలను ఎలా విక్రయిస్తాయనే విషయంపై అవగాహన తక్కువగా ఉంటుంది. అయితే ఇటీవల కంపెనీలు ఐపీఓలకు ఎక్కువగా వెళ్తున్నాయి. దీంతో ఐపీఓ అంటే ఏమిటి అన్న ప్రశ్నలు కూడా చాలా మంది నెటిజనులు గూగుల్ ని అడుగుతున్నారు. ఈ క్రమంలో అసలు ఐపీఓ అంటే ఏమిటి? కంపెనీలు ఐపీఓకి వెళ్లడం వల్ల లాభాలు ఏంటి? దానిలో ప్రజలు ఎలా భాగస్వాములు కావొచ్చు? తెలుసుకుందాం..

**ఐపీవో అంటే..**

స్టాక్ మార్కెట్ లో కంపెనీలు ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) విధానం ద్వారా తమ షేర్ల విక్రయాలు చేస్తాయి. ఇందుకోసం సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అనుమతి తీసుకుంటాయి. సాధారణంగా కంపెనీలు తమ వ్యాపారాన్ని విస్తరించడం, ఉత్పత్తిని పెంచుకోవడం, నష్టాలను పూడ్చుకోవడం కోసం ఐపీవోకు వస్తాయి. దీని ద్వారా తమ వాటాలను ప్రజలకు విక్రయిస్తాయి. తద్వారా మూలధనాన్ని సేకరించుకుని వ్యాపారాన్ని విస్తరించుకుంటాయి.

**మూలధనం సేకరణ..**

ఐపీవో విధానంలో పబ్లిక్ ఇన్వెస్టర్ల నుంచి ప్రైవేటు కంపెనీలు తమ వాటాలను విక్రయించి మూలధనాన్ని సేకరిస్తాయి. ఈ విధానంలో కంపెనీ బిడ్డింగ్ విండో మూడు రోజులు తెరిచి ఉంటుంది. ఈ సమయంలో పెట్టుబడిదారులు ఆ కంపెనీ షేర్ల కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఆ తర్వాత కేటాయింపు ప్రక్రియ జరుగుతుంది. ఇది పెట్టుబడిదారుల నుంచి వచ్చిన ప్రతిస్పందనపై ఆధారపడి ఉంటుంది. వివిధ అంశాలు ఈ కేటాయింపు ప్రక్రియను ప్రభావితం చేస్తాయి.

**సెబీ నిబంధనలు..**

సెబీ నిబంధనల ప్రకారం షేర్లను కేటాయిస్తారు. అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారులు (క్యూఐబీ), సంస్థాగతేతర పెట్టుబడిదారులు, రిటైల్ పెట్టుబడిదారులు అనే మూడు వర్గాల వారు ఇందులో ఉంటారు. రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించిన షేర్ విధానాన్ని అర్థం చేసుకునే ముందుగా లాట్ సైజ్ పై అవగాహన పెంచుకోవాలి. ఒక కంపెనీ ఐపీవోకి వచ్చినప్పుడు దాని మొత్తం ఈక్విటీ షేర్లను లాట్ లుగా విభజిస్తారు.

**వారం రోజుల లోపు..**

వాటాల కోసం వచ్చిన దరఖాస్తులు మొత్తం లాట్ ల కంటే తక్కువగా ఉన్నప్పుడు , ప్రతి ఒక్కరూ వేలం వేసిన లాట్ల సంఖ్యను అందుకుంటారు. అలాగే లాట్ల కంటే దరఖాస్తులు ఎక్కువ వచ్చినప్పుడు సెబీ నియమాలను పరిగణనలోకి తీసుకుంటారు. అప్పుడు ఏ వ్యక్తికి ఒక లాట్ కంటే ఎక్కువ కేటాయించరు. సాధారణంగా సబ్‌స్క్రిప్షన్ పిరియడ్ ముగిసిన ఒక వారంలోపు పెట్టుబడిదారులకు వారి డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్లను కేటాయిస్తారు.

**షేర్లు కేటాయించకపోవడానికి కారణం..**

కంపెనీల ఐపీవో ఆఫర్ లో షేర్లను కేటాయించకపోవడానికి కొన్ని కారణాలను ఉన్నాయి. దరఖాస్తుదారుడి పాన్ నంబర్, డీమ్యాట్ ఖాతా చెల్లక పోయినా, ఒకే పేరు మీద అనేక దరఖాస్తులు వచ్చినా వారికి షేర్లు కేటాయించరు. భారీ ఓవర్ సబ్‌స్క్రిప్షన్ విషయంలో, షేర్ల కేటాయింపు కోసం లక్కీ డ్రా ప్రక్రియ తర్వాత దరఖాస్తు ఏదీ కేటాయించబడదు.

**చివరిగా..**

ప్రైవేటు కంపెనీలు పబ్లిక్ యాజమాన్యానికి మారే దశలో ఐపీవో అనేది చాలా కీలకం. దీనిని ఇన్వెస్టర్లు అర్థం చేసుకుని, వాటాలను కొనుగోలు చేయాలి. అన్ని విషయాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలి.గత కొన్నేళ్లుగా ప్రజలు లగ్జరీ వస్తువులపై తమ ఖర్చును పెంచుకున్నారని కూడా ఈ నివేదిక వెల్లడించింది. ప్రస్తుత కాలంలో ప్రజలు విలాస వస్తువులపై ఖర్చు చేయడాన్ని స్టేటస్ సింబల్గా చూస్తున్నారు. దాదాపు చాలా మంది ప్రజలు నగదు రహిత లావాదేవీలకు అలవాటు పడ్డారని ఈ అధ్యయనం వెల్లడించింది. మొత్తంగా నగదు రహిత లావాదేవీలు ప్రజల్లో డబ్బు ఖర్చు చేసే అలవాట్లను పెంచాయని.. ఇది మానుకుంటే మేలని అధ్యయనం సూచించింది. క్యాష్లెస్ పేమెంట్స్ కారణంగా ముందు వెనుకా ఆలోచించకుండా డబ్బు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంది.

## ఐఐఐడి ఈవెంట్ 2024లో 'క్యూ ది కర్వ్' కలెక్షన్ ఆవిష్కరించిన బే విండో

హైదరాబాద్ : ప్రత్యేకమైన డిజైన్ విధానం మరియు స్టేట్మెంట్ మేకింగ్ ఫర్నీచర్కు ప్రసిద్ధి చెందిన బే విండో, ఐఐఐడి ఈవెంట్ 2024లో తన తాజా సేకరణ 'క్యూ ది కర్వ్'ని ఆవిష్కరించినందుకు థ్రిల్గా ఉంది. ఈ ఈవెంట్ని ఇన్స్టిట్యూట్ ఆఫ్ హౌస్ట్ చేసింది. ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడి ), ఇంటి యజమానుల కోసం సరికొత్త డిజైన్లు మరియు మెటీరియల్ల ప్రదర్శనగా హామీ ఇచ్చారు.బే విండో యొక్క 'క్యూ ది కర్వ్' సేకరణ ద్రవ డిజైన్లు మరియు సొగసైన ఆకృతులను సూచిస్తుంది. ఈ సేకరణలోని ప్రతి భాగం ఆధునిక అంతర్గత ప్రదేశాలను నిర్వచించే కార్యాచరణ



మరియు సొగసుల సమ్మేళనాన్ని అందిస్తూ, స్టైలిష్ జీవనాన్ని ప్రేరేపించడానికి సూక్ష్మంగా రూపొందించబడింది. బే విండో భారతీయ జీవనశైలి కోసం రూపొందించిన గ్లోబల్ డిజైన్లను పరిచయం చేయడంలో ప్రత్యేకత కలిగి ఉంది. "ఇలాంటి ప్రతిష్టాత్మక ప్లాట్ఫారమ్లో మా 'క్యూ ద కర్వ్' సేకరణను ప్రదర్శించడానికి మేము సంతోషిస్తున్నాము. మా డిజైన్లు ఆవిష్కరణ మరియు నాణ్యత పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తాయి మరియు సందర్శకులు మా ఫర్నిచర్ను స్ఫూర్తిదాయకంగా మరియు ఆచరణాత్మకంగా కనుగొంటారని మేము విశ్వసిస్తున్నాము" అని బే విండో సహ వ్యవస్థాపకుడు సిద్ధాంత్ ఆనంద్ అన్నారు.

## హానెస్ట్ టీ ఫైన్డ్ యువర్ గుడ్ ప్రచారాన్ని ప్రారంభిన కోకా-కోలా కంపెనీ

హానెస్ట్ టీ, ఆర్గానిక్ గ్రీన్ టీతో తాగడానికి సిద్ధంగా ఉన్న పానీయం, ప్రముఖ రచయిత, కాలమిస్ట్ మరియు వెల్నెస్ ఔత్సాహికురాలు ట్వింకిల్ ఖన్నా సహకారంతో వారి సరికొత్త చఫైన్డ్ యువర్ గుడ్ ప్రచారాన్ని ప్రకటించింది. కొత్తగా ప్రారంభించబడిన చిత్రం ప్రసిద్ధ మకైబారి టీ ఎస్టేట్ నుండి సేకరించిన ఆర్గానిక్ గ్రీన్ టీతో తయారు చేసిన చహానెస్టీ టీతో, రోజువారీ గజిబిజి జీవితం మధ్య ట్వింకిల్ ఖన్నా ప్రశాంతంగా ఉన్నట్లు చూపిస్తుంది.సామాజిక అంచనాలతో నిండిన ప్రపంచంలో, హానెస్ట్ టీ ప్రచారం వ్యక్తులు తమ విశ్రాంతికి వారి స్వంత మార్గాన్ని ఎంచుకునేలా ప్రోత్సహిస్తుంది. ఈ ప్రయత్నంలో బ్రాండ్ నిమ్మకాయ-తులసి మరియు మామిడి అనే రెండు గొప్ప రుచులను అందిస్తుంది. హానెస్ట్ టీ ప్రచారాన్ని ప్రారంభించడంలో భాగంగా సోషల్ ఫిల్మ్ మరియు డిజిటల్ యాక్టివేషన్ల శ్రేణితో వివిధ ప్లాట్ఫారమ్లలో కస్టమర్లను నిమగ్నం చేస్తుంది. డబ్ల్యుపిపి ఓపెన్ ఎక్స్ రూపొందించిన ప్రచార చిత్రం, ట్వింకిల్ ఆమె చేయవలసిన పనుల జాబితాను చూస్తున్నట్లు చూపిస్తుంది. ఆమె విశ్రాంతి తీసుకోవడానికి కూర్చున్నప్పుడు, ఆమె నిజాయితీగల టీని ఆస్వాదిస్తూ, "మీకు ఏది మంచిదో నిర్ణయించుకోవడం మీ ఇష్టం అని చెబుతుంది.హానెస్ట్




టీ సహకారం గురించి ట్వింకిల్ ఖన్నా మాట్లాడుతూ, "చఫైన్డ్ యువర్ గుడ్ ప్రచారంలో భాగం కావడం నన్ను ఉత్తేజపరుస్తుంది, ఎందుకంటే ఇది మంచి, సంపూర్ణమైన జీవితాన్ని గడపాలనే నా నినాదాన్ని ప్రతిబింబిస్తుంది. సాధారణ వ్యక్తుల రోజువారీ జీవితంలో ఆనందం మరియు సమతుల్యతను కనుగొనడం యొక్క ప్రాముఖ్యతతో స్ఫూర్తి పొందిన, హానెస్ట్ టీ ప్రచారం ఆధునిక మహిళ శ్రేయస్సులో సానుకూల పరివర్తనను తీసుకురావడం దిశగా కృషి చేస్తుంది."కొత్త ప్రచారాన్ని ప్రారంభించడంపై వ్యాఖ్యానిస్తూ, రుచిరా భట్టాచార్య, సీనియర్ డైరెక్టర్, కోకా-కోలా కంపెనీ మార్కెటింగ్, ఇండియా మరియు సౌత్-వెస్ట్ ఆసియా ఆపరేటింగ్ యూనిట్ ఇలా అన్నారు, "మీ రోజువారీ గజిబిజి జీవితంలో శాంతి మరియు ప్రశాంతతను జరుపుకునే ఫైన్డ్ యువర్ గుడ్ ప్రచారాన్ని ప్రారంభించినందుకు హానెస్ట్ టీ గర్విస్తోంది. ట్వింకిల్ ఖన్నాతో భాగస్వామ్యం ఈ వేగవంతమైన ప్రపంచంలో సమతుల్యత మరియు శ్రేయస్సు గురించి ప్రతి వ్యక్తి యొక్క స్వంత భావనకు మద్దతు ఇవ్వడం మరియు ప్రోత్సహించడంలో మా ఉద్దేశ్యం ప్రతిధ్వనిస్తుంది." ముకుంద్ ఒలేటీ, ఎగ్జిక్యూటివ్ క్రియేటివ్ డైరెక్టర్, , "మా సరికొత్త ప్రచారం, ఫైన్డ్ యువర్ గుడ్, మనలో చాలా మంది తరచుగా మరచిపోయే చాలా ముఖ్యమైన విషయాన్ని హైలైట్ చేస్తుంది: ఇది మన దైనందిన జీవితంలో శాంతి మరియు ఆనందమయ క్షణాల కోసం సమయాన్ని కేటాయించడాన్ని సూచిస్తుంది", ట్వింకిల్ ఖన్నాతో సహకారం గురించి మాట్లాడుతూ "ట్వింకిల్ ఖన్నాతో కలిసి ఈ ప్రచారంలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. మహిళల శ్రేయస్సు కోసం ప్రతిపాదకురాలిగా, ఈ ప్రచారం ద్వారా మేము స్పష్టం చేయాలనుకుంటున్న సూక్ష్మ నైపుణ్యాలను ఆమె సహజంగా తెలియజేస్తుందన్నారు.

## ట్రిపుల్ నెగిటివ్ రొమ్ము క్యాన్సర్ కు విజయవంత చికిత్స

విజయవాడ గుంటూరుకు చెందిన 42 ఏళ్ల మహిళా రోగి తీవ్ర స్థాయి రొమ్ము క్యాన్సర్తో బాధపడుతున్నట్లు గుర్తించడంతో పాటుగా ఆమెకు విజయవంతమైన చికిత్సను చేసినట్లు విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ మంగళగిరి వెల్లడించింది. గత ఆరు నెలలుగా కుడి రొమ్ములో క్యాన్సర్ కణితితో ఆమె ఇబ్బంది పడుతున్నారు. ఇది 3.5ఐ2.5 సెం.మీ. పరిమాణంతో వుంది. కుడి ఆక్సిల్లాలో తాకుతూ వుండే శోషరస కణుపులను కలిగి ఉంది. ఆమెను పరిశీలించిన తర్వాత, బయాప్సీ నిర్వహించారు. అక్కడ ఆమెకు డక్టల్ కార్సినోమా, ఒక రకమైన రొమ్ము క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. తీవ్రస్థాయి స్టేజి 3బి ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ కారణంగా, రోగి కణితిని తగ్గించడానికి మరియు శస్త్రచికిత్స అనంతర ప్రతిస్పందనను అంచనా వేయడానికి నియోఅడ్జువాంట్ కెమోథెరపీ ని ప్రారంభించారు. కీమోథెరపీ తర్వాత అల్ట్రాసౌండ్ లో ఎటువంటి కణితి లేదని వెల్లడైంది.ఇటీవల, రోగి కుడి రొమ్ము కు



మాడిఫైడ్ రాడికల్ మాస్టెక్టమీని చేయించుకున్నారు . శస్త్రచికిత్స అనంతర నివేదికలో ఎటువంటి అవశేష కణితి లేదని సూచించింది, ఇది రోగి కోలుకోవటానికి బలమైన సూచిక. రోగి ప్రస్తుతం అడ్జువాంట్ రేడియేషన్ థెరపీని పొందుతున్నారు మరియు ఆమె ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా మాట్లాడుతూ "శస్త్రచికిత్సకు ముందు కీమోథెరపీని నిర్వహించడం ప్రారంభ మరియు లోకల్ గా అభివృద్ధి చెందిన ట్రిపుల్-నెగటివ్ రొమ్ము క్యాన్సర్లలో చికిత్స ప్రమాణం. అన్ని ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్లు ఒకే విధమైన చికిత్స విధానం కలిగి ఉండవు, ఈ సందర్భంలో, కీమోథెరపీ మరియు శస్త్రచికిత్స తర్వాత రోగి యొక్క పూర్తి ప్రతిస్పందన మంచి రోగ నిరూపణను నిర్ధారిస్తుంది. మా ఇన్స్టిట్యూట్లో అందించబడిన అధునాతన మరియు వ్యక్తిగతీకరించిన సంరక్షణకు నిదర్శనంగా ఈ చికిత్స నిలుస్తుంది" అని అన్నారు. ఆర్సిఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, "అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్లో, క్లినికల్ ఎక్సలెన్స్, అత్యాధునిక సాంకేతికత మరియు అంతర్జాతీయ నైపుణ్యం తో కూడిన అత్యున్నత ప్రమాణాలతో సమగ్ర క్యాన్సర్ సంరక్షణను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఈ కేసు లో మా వైద్య బృందం ప్రదర్శించిన నైపుణ్యం మరియు అంకితభావం అసాధారణమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంలో మా నిబద్ధతను నొక్కి చెబుతున్నాయి.." అని అన్నారు.

## పన్ను మినహాయింపు సరే రాయితీ లెక్కలు తేల్చండి

మునుపటి ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్నును తనిఖీ చేయడానికి ఇప్పుడు సమయం ఆసన్నమైంది. ఐటీ రిటర్న్ దాఖలు చేసేందుకు జూలై 31 వరకు సమయం ఉంది. వచ్చే బడ్జెట్లో ఆదాయపు పన్ను శ్లాబ్లో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల ప్రకారం రెండున్నర లక్షల రూపాయల పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచవచ్చని అంటున్నారు. మీరు ఆదాయపు పన్ను గురించి చదివినప్పుడు, మీరు పన్ను మినహాయింపు లేదా పన్ను రాయితీ పేర్లు వినే ఉంటారు. ఈ మూడు కూడా పన్ను భారాన్ని తగ్గించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అదేవిధంగా చాలా మంది ఈ రెండింటి మధ్య తేడా ఏమిటి? అని గందరగోళానికి గురవుతారు.

పన్ను మినహాయింపు అంటే ఏమిటి?

ప్రస్తుతం రూ.3 లక్షల పన్ను మినహాయింపు పరిమితి ఉంది. మీ మొత్తం పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంలో



మూడు లక్షలు పన్ను నుండి మినహాయించబడ్డాయి. ఉదాహరణకు, మీ వార్షిక ఆదాయం రూ. 8,00,000 అనుకుందాం. పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.7,50,000 అని భావించండి. 3 లక్షలపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. మిగిలిన రూ. 4,50,000 సంబంధిత స్లాబ్ రేటు ప్రకారం పన్ను విధిస్తారు. అలాగే నిర్దిష్ట పన్ను మినహాయించదగిన పెట్టుబడులలో ఇన్వెస్ట్ చేసిన ఆదాయం ఉంటే, ఆ మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. దీని కోసం సెక్షన్ 80 సి, సెక్షన్ 80డి , సెక్షన్ 80ఈ ఉన్నాయి. జీవిత బీమా ప్రీమియం, పీపీఎఫ్, ట్యూషన్ ఫీజు, గృహ రుణ వడ్డీ మొదలైనవి సెక్షన్ 80 సికిందకు వస్తాయి. ఇందులో రూ.1.5 లక్షల వరకు పెట్టుబడికి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది పన్ను మినహాయింపు అంటారు.

పన్ను రాయితీ అంటే ఏమిటి?

మీ ఆదాయం మైనస్ పన్ను మినహాయింపు పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంగా పరిగణిస్తారు. అయితే ఇది పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం. ఈ ఆదాయం రూ.7 లక్షల లోపు ఉంటే పన్ను రాయితీ లభిస్తుంది. చెల్లించాల్సిన పన్ను మొత్తంపై రూ.25,000 వరకు రాయితీ లభిస్తుంది. కొత్త పన్ను విధానంలో ఇదొక అవకాశం. పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపు అనేది ఒక సదుపాయం అని గమనించాలి. పన్ను రాయితీ అనేది కొత్త పన్ను విధం.

## సింగిల్ చార్జ్‌పై 100కిలోమీటర్ల రేంజ్

మన దేశంలో ఎలక్ట్రిక్ స్కూటర్లకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో అనేక కంపెనీలు తప్ప ఉత్పత్తులను లాంచ్ చేస్తున్నాయి. వాటిల్లో టాప్ బ్రాండ్లు చాలానే ఉన్నాయి. అలాంటి బ్రాండ్లలో ఒకటైన ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్ మేకర్ ఈబైక్గో తన కొత్త మువీ 125 5జీ ఎలక్ట్రిక్ స్కూటర్ ను పరిచయం చేసింది. ఈ కొత్త ఈ-స్కూటర్ ఇప్పటికే ఈ కంపెనీ నుంచి అందు బాటులో ఉన్న 4జీ మోడల్ స్థానాన్ని భర్తీ చేయనుంది. భారతీయ వినియోగదారుల అవసరాలు, వారి కోరుకుంటున్న అంశాలను జోడించి ఈ కొత్త స్కూటర్ తీసుకువచ్చినట్లు ఈబైక్ గో కంపెనీ ప్రకటించింది. ఈ కొత్త స్కూటర్ కు సంబంధించిన స్పెసిఫికేషన్లు, ఫీచర్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

100కిలోమీటర్ల రేంజ్..

కొత్త మువీ 125 5జీ ఎలక్ట్రిక్ స్కూటర్ 100 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ ప్రకటించింది. దీనిలో 5కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఇది మూడు గంటల సమయంలోనే సున్నా నుంచి 80



శాతం బ్యాటరీ చార్జ్ అవుతుంది. ఇది మార్కెట్లో ఉన్న ఇతర స్కూటర్ల చార్జింగ్ టైంతో పోల్చితే చాలా తక్కువ సమయం అని కంపెనీ పేర్కొంది.

ఈబైక్ గో మువీ 125 5జీ ఫీచర్స్..

ఈ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లో స్మార్ట్ ఎల్ఈడీ డిజిటల్ డిస్ ప్లే డ్యాష్ బోర్డు ఉంటుంది. మొబైల్ యాప్ తో కనెక్ట్ చేసిన అనేక ఫీచర్లు ఉంటాయి. ఈ కొత్త స్కూటర్ గురించి ఈబైక్ గో ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్ మాట్లడుతూ అర్బన్ మొబలిటీలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చేందుకు నడుం బిగించామన్నారు. అందులో భాగంగానే కొత్త రవాణా సాధనాలను పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. వాటిల్లో మువీ 125 5జీ ఈ-స్కూటర్ భారతీయ వినియోగదారులకు సరిగ్గా సరిపోతుందని, వారి అవసరాలకు అనుగుణంగా తయారు చేసినట్లు చెప్పారు. ఈబైక్ గో భవిష్యత్ ప్రణాళికలు..

ఈబైక్ గో తమ భవిష్యత్ ప్రణాళికలు కూడా ప్రకటించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలోపు తమ ద్విచక్ర వాహనాల శ్రేణిలో ఒక లక్ష ఈవీలను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గత మూడేళ్లుగా తమ ఆపరేషన్స్ ను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కాగా మార్కెట్లో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల శ్రేణిలో ఓలా టాప్ సెల్లర్ గా ఉంది. ఆ తర్వాత స్థానంలో ఏథర్, టీవీఎస్, బజాజ్ చేతక్ వంటి ఇతర బ్రాండ్లు ఉన్నాయి. అయితే ఈ స్కూటర్ ఇంటి అవసరాలను తీర్చడంలో బాగా ఉపకరిస్తుంది.

## ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లను సవరించిన ఐసీఐసీఐ

సీనియర్ సిటిజన్ ప్రత్యేక ఆఫర్ రూ.3 కోట్ల కంటే ఎక్కువ ఉన్న ఎఫ్‌డీలను మాత్రమే బల్క్ డిపాజిట్లుగా గుర్తింపు%×% వినియోగదారులకు న్యూస్ చెప్పిన ఐసీఐసీఐ బ్యాంక్.. ఇక నుంచి భారీగా వడ్డీ రేట్లు ఈ మధ్య బ్యాంకులు కొత్త నిబంధనలను తీసుకొస్తున్నాయి. ఇప్పటికే ఎస్బీఐ బ్యాంక్ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై రివార్డ్ పాయింట్స్ ని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రెడిట్ కార్డుల ద్వారా ప్రభుత్వ లావాదేవీలు జరిపితే రివార్డ్ పాయింట్స్ వర్తించవని యూజర్స్ కి షాకింగ్ న్యూస్ చెప్పింది. ఈ కొత్త నిబంధన జూలై 15 నుంచి అమలులోకి రానుంది. ఇక ఐసీఐసీఐ బ్యాంక్ కూడా క్రెడిట్ కార్డుల విషయంలో కొత్త మార్పులు తీసుకొచ్చింది. ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు రీప్లేస్ మెంట్ రుసుమును పెంచింది. జూలై 1 నుంచి ఆ మార్పులు చోటు చేసుకోనున్నాయి.

తాజాగా ప్రముఖ ప్రైవేటు బ్యాంక్ ఐసీఐసీఐ కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. ఈ బ్యాంక్ రూ.3కోట్ల లోపు డిపాజిట్లపై సాధారణ ప్రజలకు (60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు) అత్యధికంగా 7.2 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. సీనియర్ సిటిజన్ (60 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు)లకు 7.75 శాతం వడ్డీ రేటు అందిస్తోంది. 2024 జూన్ 29 నుంచి కొత్త రేట్లు వర్తిస్తాయి. ఇటీవల %=దీ×%, ఫిక్స్‌డ్ డిపాజిట్ల నిబంధనల్లో కొన్ని మార్పులు చేసింది. ఇంతకు ముందు రూ.2 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న ఏదైనా ఎఫ్‌డీని బల్క్ డిపాజిట్‌గా పరిగణించేవారు. కొత్త రూల్ ప్రకారం, రూ.3 కోట్ల వరకు ఉన్న ఏదైనా ఎఫ్‌డీని రిటైల్ ఎఫ్‌డీగా పరిగణిస్తారు. రూ.3 కోట్ల కంటే ఎక్కువ ఉన్న ఎఫ్‌డీలను మాత్రమే బల్క్ డిపాజిట్లుగా గుర్తిస్తారు. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఐసీఐసీఐ ఎఫ్‌డీ రేట్లు సవరించింది. ఐసీఐసీఐ లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు(రూ.3 కోట్ల లోపు) సాధారణ ప్రజలకు వడ్డీ రేట్లు : 7 నుంచి 29 రోజులు టెన్యూర్ ఎఫ్‌డీలకు 3% వడ్డీ లభిస్తుంది. 30 నుంచి 45 రోజుల్లోపు ఎఫ్‌డీకి 3.5% రిటర్న్ అందుతాయి. 15 నుంచి 18 నెలలకు చేసిన ఎఫ్‌డీకి అత్యధికంగా 7.2% రేటు చెల్లిస్తుంది. 7 సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల టెన్యూర్‌కి 6.9% వడ్డీ అందుతుంది. 7 నుంచి 29 రోజుల టెన్యూర్‌కి 3.5% వడ్డీ లభిస్తుంది. 30 నుంచి 45 రోజుల్లోపు డిపాజిట్లపై 4% ఆదాయం ఉంటుంది. 15 నెలల నుంచి 18 నెలల టెన్యూర్‌కి అత్యధికంగా 7.75% వడ్డీ రేటు చెల్లిస్తుంది. 7 సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల కాలానికి చేసిన ఎఫ్‌డీకి 7.4% వడ్డీ దక్కుతుంది. 1 సంవత్సరం నుంచి 15 నెలల కంటే తక్కువ సమయానికి చేసిన డిపాజిట్లకు 7.2% చెల్లిస్తుంది.

## జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనంపై రాజుకున్న రగడ




హైదరాబాద్ : కంటోన్మెంట్ ప్రజల కల సాకారం అయింది. ఈ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేవలం తెలంగాణలోనే కాదు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ తోపాటు దేశంలోని అన్ని కంటోన్మెంట్‌లలో ఉన్న పౌర ప్రాంతాలను సమీప మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేసేందుకు కేంద్ర డిఫెన్స్ మినిస్ట్రీ శనివారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిఫెన్స్ ఏరియా డైరెక్టర్ జనరల్ ప్రతిపాదనలు, మంగళ, గురువారాల్లో రక్షణ శాఖ కార్యదర్శి నేతృత్వంలో జరిగిన కీలక సమావేశ తీర్మానాలను.. శుక్రవారం ఆమోదిస్తూ.. అన్ని కంటోన్మెంట్ల సీఈవోలకు శనివారం సర్క్యులర్ (నంబర్ 8078) జారీ చేశారు. దీంతో.. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి కీలక అడుగు ముందుకుపడింది.

అయితే కంటోన్మెంట్ విలీనం విషయంలో రాజకీయ రగడ మొదలైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య క్రెడిట్ వార్ నడుస్తోంది. మా ప్రయత్నాలు ఫలించాయని ఇరు పార్టీలు మోత మోగిస్తున్నాయి. ఆధారాలతో నిరూపించుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. కంటోన్మెంట్ విలీనం ఘనతను తమ ఖాతాలో వేసుకునేందుకు మాటల యుద్ధం చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వేదికగా కౌంటర్లు, ఎన్ కౌంటర్లు ఇచ్చుకుంటున్నాయి.

రేవంత్ కృషి వల్లే... -కాంగ్రెస్

కాంగ్రెస్ ఏమంటోందంటే... "నగరం నలుమూలల అభివృద్ధి విషయంలో కంటోన్మెంట్ లోని రక్షణ శాఖ భూములు అడ్డంకిగా ఉంటున్నాయి. దీంతో ఈ అంశాన్ని ఢిల్లీ వెళ్లినప్పుడల్లా రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మార్చి 5న రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని స్వయంగా కలిసి కంటోన్మెంట్ అంశాన్ని తేల్చాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 25న రక్షణ శాఖ కార్యదర్శి వర్చువల్‌గా నిర్వహించిన కీలక సమావేశంలోనూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి "విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని వివరించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణశాఖ భూములను సేకరించడంలోనూ రేవంత్ ప్రత్యేక చొరవ చూపించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడే రేవంత్‌కు కంటోన్మెంట్ సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. సీఎం అయ్యాక కేంద్రంతో సంప్రదింపుల్లో వేగం పెంచారు. కేంద్రం కంటోన్మెంట్ల విలీనానికి ఆమోదం తెలపడం వెనక రేవంత్ రెడ్డి కృషి ఫలితమే అని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనిది, కాంగ్రెస్ ఆరు నెలల్లో సాధించిందని ఆ పార్టీ శ్రేణులు కాలర్ ఎగరేస్తున్నారు.

మాది ఏడేళ్ల పోరాటం అంటోన్న బీఆర్ఎస్

"కంటోన్మెంట్ ప్రాంత విలీనం కోసం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించింది. కంటోన్మెంట్ ప్రజల చిరకాల స్వప్నం సాకారం చేయడానికి మంత్రి కేటీఆర్ అవిశ్రాంత పోరాటం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత కృషి చేసిందో%ా% అప్పటి మంత్రి కంటోన్మెంట్ విలీనానికి ఎంత పట్టుదలతో పోరాటం చేసారో%ా% కేటీఆర్ కలిసిన ఐదుగురు రక్షణ మంత్రులకు తెలుసు, రక్షణ శాఖ అధికారులకు తెలుసు, మంత్రి పలుమార్లు రాసిన లేఖలు ప్రచురించిన పత్రికలకు తెలుసు, కంటోన్మెంట్ ప్రజలకు తెలుసు, మొత్తం తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి తెలుసు. వేరొకరి శ్రమ ఫలితాన్ని తమ ఖాతాలో వేసుకొనే పార్టీల కుసంస్కారం అందరికీ తెలుసు" అంటూ బీఆర్ఎస్ వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి.

### పన్ను మినహాయింపు రాయితీ..

## ఈ రెండింటి మధ్య తేడా ఏమిటి?

మునుపటి ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్నును తనిఖీ చేయడానికి ఇప్పుడు సమయం ఆసన్నమైంది. ఐటీ రిటర్న్ దాఖలు చేసేందుకు జూలై 31 వరకు సమయం ఉంది. వచ్చే బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబ్‌లో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల ప్రకారం రెండున్నర లక్షల రూపాయల పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షల రూపాయలకు పెంచవచ్చని అంటున్నారు. మీరు ఆదాయపు పన్ను గురించి చదివినప్పుడు, మీరు పన్ను మినహాయింపు లేదా పన్ను రాయితీ పేర్లు వినే ఉంటారు. ఈ మూడు కూడా పన్ను భారాన్ని తగ్గించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అదేవిధంగా చాలా మంది ఈ రెండింటి మధ్య తేడా ఏమిటి? అని గందరగోళానికి గురవుతారు.

ప్రస్తుతం రూ.3 లక్షల పన్ను మినహాయింపు పరిమితి ఉంది. మీ మొత్తం పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంలో మూడు లక్షలు పన్ను నుండి మినహాయించబడ్డాయి. ఉదాహరణకు, మీ వార్షిక ఆదాయం రూ. 8,00,000 అనుకుందాం. పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.7,50,000 అని భావించండి. 3 లక్షలపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. మిగిలిన రూ. 4,50,000 సంబంధిత స్లాబ్ రేటు ప్రకారం పన్ను విధిస్తారు. అలాగే నిర్దిష్ట పన్ను మినహాయించదగిన పెట్టుబడులలో ఇన్వెస్ట్ చేసిన ఆదాయం ఉంటే, ఆ మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. దీని కోసం సెక్షన్ 80%జ%, సెక్షన్ 80% function%, సెక్షన్ 80%జు% ఉన్నాయి. జీవిత బీమా ప్రీమియం, పీపీఎఫ్, ట్యూషన్ ఫీజు, గృహ రుణ వడ్డీ మొదలైనవి సెక్షన్ 80%జ% కిందకు వస్తాయి. ఇందులో రూ.1.5 లక్షల వరకు పెట్టుబడికి పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది పన్ను మినహాయింపు అంటారు.

మీ ఆదాయం మైనస్ పన్ను మినహాయింపు పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయంగా పరిగణిస్తారు. అయితే ఇది పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం. ఈ ఆదాయం రూ.7 లక్షల లోపు ఉంటే పన్ను రాయితీ లభిస్తుంది. చెల్లించాల్సిన పన్ను మొత్తంపై రూ.25,000 వరకు రాయితీ లభిస్తుంది. కొత్త పన్ను విధానంలో ఇదొక అవకాశం. పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపు అనేది ఒక సదుపాయం అని గమనించాలి. పన్ను రాయితీ అనేది కొత్త పన్ను విధానం లక్షణం.

## రేషన్ అక్రమాలకు అడ్డాగా కాకినాడ పోర్ట్..

**కాకినాడలో తిష్ట వేసి అధికారులకు చెమటలు**

**అక్రమ బియ్యం వ్యాపారంపై అధికారులను నిలదీతలు**

**మంత్రి నాదెండ్ల స్పెషల్ ఫోకస్..**

కాకినాడ .... కాకినాడ జిల్లాలో ఒక రోజుతోనే సమీక్షలు సరిపెట్టుకోలేదు మంత్రి నాదెండ్ల. రెండో రోజు కూడా కాకినాడ జిల్లా పర్యటించారు. ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం నిల్వల కేంద్రాలను తనిఖీలు చేశారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా రవాణ చేస్తున్న బియ్యాన్ని నిజాయితీగా చేరేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా పనిచేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు నిర్వహించిన పది ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం ప్రెడింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయన్నారు. వీరందరి మీద లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా కేసులు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ ప్రాంతాన్ని మాఫియాకు అడ్డాగా తయారు చేశారని, 2018-24 మధ్య చాలా మార్పు ఉందన్నారు. పీడీఎస్ బియ్యానికి సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయడం ప్రారంభించామని మంత్రి స్పష్టం చేశారు. ఈ క్రమంలో అధికారులు నిజాయితీగా పనిచేసి, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఆధారాలు దొరికిన చోట స్టార్ పేజ్ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖలు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తనిఖీలు భవిష్యత్తులో ఇంకా కొనసాగుతాయన్నారు మంత్రి నాదెండ్ల.

నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొన్ని రోజుల్లోనే కాకినాడలో తిష్ట వేసి కాకినాడ పోర్టుపై దృష్టి సారించారు. దీనికి కారణం 2023 జూన్ %-% జూలైలో పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో కాకినాడ స్థానిక ప్రజల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి పెద్ద మొత్తంలో రేషన్ తరలిపోతున్నట్లు ఫిర్యాదు చేయడమే. ఈ నేపథ్యంలోనే పలుమార్లు పవన్ కళ్యాణ్‌ను విమర్శించిన ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్న అక్రమాలు, బాగోతాలు అధికారంలోకి రాగానే బయట పెడతానని కాకినాడ సభల్లో పవన్ కళ్యాణ్ నేరుగానే చెప్పారు. ఈ నేపథ్యంలోనే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జీవనాడైన పోర్టుపై దృష్టి పెట్టారు. మొదటిరోజు 5300 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పాటు రెండవ రోజు ఏడువేల మెట్రిక్ టన్నులకుపైగా రేషన్ బియ్యాన్ని గుర్తించారు. సముద్ర మార్గం ద్వారా ఓడల్లో ఆఫ్రికాకు తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని వెంటనే నిలిపివేయాలంటూ అధికారులకు సూచించారు. ఇంకా మారని అధికారులు ఎవరైనా ఉంటే వారి ప్రవర్తన మార్చుకోవాలంటూ హెచ్చరించారు. ఇది ఇక్కడితో ఆగదని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన వెనుకున్న అనుచరుల అక్రమాలన్నీ బయటపడతామని హెచ్చరించారు.

## నేడు కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఇవ్వనున్న ధర్మాసనం

న్యూ ఢిల్లీ బ్యూరో ప్రతినిధి: ఢిల్లీ లిక్కర్ పాలసీ వ్యవ హారంలో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్పై రేపు ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించనుంది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మతో కూడిన ధర్మాసనం ముందు ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించ నున్నారు. కాగా ఈ కేసులో కవితను మార్చి 15న ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయగా ఆమె తిహార్ జైలులో ఉన్నారు. అయితే కవిత రాజకీయాల్లో ఉండి లిక్కర్ కేసు లో చిక్కుకోవడంతో గత అసెంబ్లీ ఎన్నికల తో పాటు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి కి ప్రజలు ఓట్లు వేయలేక అధికారాన్ని కోల్పోయి అయోమయంలో పడింది. ఇలాంటి పరిస్థితుల్లో కవిత రాజకీయ జీవిత భవితవ్యం భారత రాష్ట్ర సమితి రాజకీయ నేపథ్యం ఎటుపోయి వెళు ుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.



## దేశ ఔన్నత్యాన్ని కాపాడాలి ; ప్రవంతి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: భారత దేశ ఔన్నత్యాన్ని కావడం కాపాడాల్సిన బాధ్యత అందరి పైన ఉందని రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని ప్రవంతి అన్నారు. భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు భరతమాతను ప్రేమించాలని భారతీయ జనతా పార్టీ ధ్యేయమన్నారు.
ఆదివారం దేశవ్యాప్తంగా టెలివిజన్ ద్వారా ప్రసారమైన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాన్ కి బాత్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని ప్రవంతి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు వీక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించినట్టు ప్రతి ఒక్కరూ భరతమాతను ప్రేమించాలని కన్నతల్లి పేరు మీద ఒక మొక్కను నాటాలని చెప్పిన అంశాన్ని వెంటనే పాటిస్తామని ఈ సందర్భంగా చెన్నమనేని ప్రవంతి స్పష్టం చేశారు.

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

# వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరు



- గ్రామస్థాయి నుంచి వచ్చి ఉన్నత స్థానానికి ఎదిగిన నేత
- పుస్తకాలను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోడీ
- వెంకయ్యపై పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయి
- వెంకయ్యపై ప్రధాని ప్రశంసల వర్షం



హైదరాబాద్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గ్రామీణం ప్రాంతం నుంచి ఉన్నత స్థానానికి ఎదిగారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. వెంకయ్యనాయుడి పుట్టిన రోజు సందర్భంగా ఆయన జీవిత ప్రస్థానంపై రూపొందించిన మూడు పుస్తకాలను వర్చువల్గా ప్రధాని విడుదల చేశారు. దీనికి సంబంధించి హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్లో కార్యక్రమం నిర్వహించారు. 'సేవలో వెంకయ్యనాయుడు జీవితం', '13వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు లక్ష్యం, సందేశం', 'మహానేత వెంకయ్యనాయుడు జీవితం, ప్రయాణం' అనే పుస్తకాలను మోదీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వెంకయ్య జీవితంపై పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఇవి దేశ ప్రజలకు మార్గనిర్దేశం చేస్తాయని చెప్పారు. వెంకయ్యనాయుడితో సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం నాకు దక్కింది. వేలాది కార్యకర్తలు ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నారు. అత్యయిక పరిస్థితి వేళ ఆయన పోరాడారు. 17 నెలల జైలు జీవితం గడిపారు. గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖలో వెంకయ్యనాయుడు తనదైన ముద్ర వేశారు. స్వచ్ఛభారత్, అమృత్ యోజన వంటి ఎన్నో పథకాలు సమర్థంగా అమలు చేశారు. ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరు. రాజ్యసభ ఛైర్మన్గా సభను సజావుగా నడిపారు. ఆయన సేవలను దేశం మరవదు. ఆర్టికల్ 370 రద్దు బిల్లు తొలుత రాజ్యసభ ముందుకు వచ్చింది. బిల్లు ఆమోదంలో వెంకయ్య పాత్ర కీలకం. రాజ్యసభ నిర్వహణలో ఆయన అనుభవం ఉపయోగపడింది. దీర్ఘకాలం ఆయన ఆరోగ్యంగా ఉండి మార్గనిర్దేశం చేయాలి" అని ప్రధాని మోదీ అన్నారు.

రాజకీయాల్లో జవాబుదారీతనం తీసుకురావాలి: వెంకయ్యనాయుడు

దేశ ప్రజలకు ప్రధాని అందిస్తున్న సేవలు కొనసాగించాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. రిఫార్మ్, పర్ఫార్మ్, ట్రాన్స్ఫార్మ్ నినాదంతో ఆయన ముందుకెళ్తున్నారని చెప్పారు. అవసరం ఉన్నంత వరకు ఉచిత రేషన్ పథకంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. మాతృభాషలను కేంద్రం ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. తాను ఆంగ్ల భాషకు వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలన్నీ భారతీయ భాషల్లో ఉండాలని చెప్పారు. ఆ తర్వాతే ఆంగ్ల భాషలో ఉండాలని కోరారు. మాతృభాష, సోదర భాష తర్వాతే ఇతర భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చట్ట సభలకు ఎంపికైన వారు హుందాగా ప్రవర్తించాలి. సిద్ధాంతం నచ్చకపోతే నాయకులు పార్టీ మారవచ్చు. పార్టీ ద్వారా వచ్చిన పదవిని వదిలి వెళ్లాలి. కార్యకర్తలకు నేతలు నియమావళి రూపొందించాలి. రాజకీయాల్లో జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రయత్నించాలి. రాజకీయాల్లో కులం, ధనం ప్రభావం తగ్గిపోవాలి. గుణం చూసి నాయకులకు ఓటు వేయాలి. మార్పు రాకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. దేశ ప్రతిష్ఠను నిలబెట్టాలంటే చెడు పోకడలను అడ్డుకోవాలి" అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

# నైజీరియాలో వరుస ఆత్మహుతి దాడులు

- గంటల వ్యవధిలోనే 4 పేలుళ్లు..18 మంది దుర్మరణం
- ఆత్మాహుతి దాడులకు పాల్పడిన మహిళా సూసైడ్ బాంబర్లు
- బోర్నో స్టేట్‌లో శాన్య నైజీరియాలో ఘోరం
- శనివారం ఘోరం జరిగింది. వరుస ఆత్మాహుతి దాడుల్లో ఏకంగా 18 మంది దుర్మరణం
- గ్వోజా పట్టణంలో వరుసగా మూడు పేలుళ్లు





నైజీరియా : ఈశాన్య నైజీరియాలో శనివారం ఘోరం జరిగింది. వరుస ఆత్మాహుతి దాడుల్లో ఏకంగా 18 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 40 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో స్టేట్లో మహిళా సూసైడ్ బాంబర్లు ఆత్మాహుతి దాడులకు పాల్పడటంతో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్వోజా పట్టణంలో వరుసగా మూడు పేలుళ్లు సంభవించాయి. తొలుత ఓ ఆస్పత్రిపై ఆత్మాహుతి దాడి జరగా.. ఆ తర్వాత ఓ పెళ్లిలో ఓ మహిళ ఆత్మాహుతికి పాల్పడ్డారు. పెళ్లిలో మరణించిన వారి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలో మరో మహిళ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఇలా మొత్తం మూడు ఆత్మాహుతి దాడులు గంటల వ్యవధిలోనే జరిగాయి. బోర్నో స్టేట్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (%బాజుహీూ%) తెలిపిన ప్రకారం.. దాదాపు18 మంది మరణించగా.. 40 మందికి పైగా గాయపడ్డారు. మరణించిన వారిలో పిల్లలు, గర్భిణీలు, మహిళలు ఉన్నారని ఏజెన్సీ అధిపతి బార్కిండో సైదు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన తొమ్మిది మంది క్షతగాత్రులను రాజధాని మైదుగురికి తరలించారు. మరో 23 మందికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. గ్వోజాలోని సెక్యూరిటీ చెక్ పోస్టు దగ్గర మరో దాడి జరిగింది. ఈ దాడిలో మిలిషియా సభ్యుడు, అతని ఇద్దరు సహచరులు, ఓ సైనికుడు మరణించారు. అయితే అధికారులు ఈ మరణాలను అధికారికంగా ధృవీకరించలేదు. 2014లో ఉత్తర బోర్నో ప్రాంతంలోని గ్వోజాను బోకోహరం తీవ్రవాదులు స్వాధీనం చేసుకున్నారు. 2015లో నైజీరియా భద్రతా బలగాలు తిరిగి గ్వోజాను తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి.

**బోకో హరామ్ అంటే ఏమిటి?**

బోకో హరామ్ నైజీరియాలో దివంగత ముస్లిం మతపెద్ద మహమ్మద్ యూసుఫ్ ఆధ్వర్యంలో 2002లో ఏర్పడిన జిహాదీ ఉగ్రవాద సంస్థ. 2009లో ఇది నైజీరియా ప్రభుత్వం, దాని భద్రతా దళాలు, పౌరులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది. 2014లో బోకో హరామ్ ఈశాన్య నైజీరియాలోని బెల్జియం పరిమాణంలో ఉన్న గ్వోజాను స్వాధీనం చేసుకుంది. 2015లో నైజీరియా భద్రతా బలగాలు తిరిగి గ్వోజాను తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. అప్పటి నుంచి బోకోహరం తీవ్రవాదులు గ్వోజాపై దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. ఇప్పటివరకు ఈ దాడుల్లో 40 వేల మంది చనిపోగా, 20 లక్షల మంది వరకు నిరాశ్రయులయ్యారు. వీరి వివాదం పొరుగున ఉన్న నైజర్, కామెరూన్, చాడ్లకూ వ్యాపించింది. తీవ్రవాదులతో పోరాడటానికి ప్రాంతీయ సైనిక సంకీర్ణాన్ని ఏర్పాటు చేసింది.

# తెలంగాణపై జనసేన ఫోకస్

- సేవా కార్యక్రమాల ప్రదాత సామాజిక కార్యక్రమాల నిర్మాత ముమ్మారెడ్డి
- ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మలుపు తిప్పిన యోధుడు పవన్ కళ్యాణ్
- కొండగట్టుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాకతో శ్రేణుల్లో ఉత్సాహం
- గత ఎన్నికల్లో పార్టీ పరువు కాపాడిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్
- ముమ్మారెడ్డి ప్రేమ కుమార్‌కు కీలక బాధ్యతలు ఇవ్వాలి
- గత అసెంబ్లీ ఎన్నికల్లో కూకట్ పల్లి నుండి పోటీ చేసిన ముమ్మారెడ్డి
- జిహెచ్ఎంసి ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- భవిష్యత్తులో బిజెపి, జనసేన, టిడిపి పొత్తులుండే అవకాశం
- విషయాన్ని వెల్లడించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్టేట్ మెంట్‌తో ఉత్సాహంలో జనసేన కేడర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లో అధికార మార్పిడి జరగడంతో జనసేన తెలంగాణపై దృష్టి సారించాలని పార్టీ శ్రేణులు, అభిమానులు కోరుతున్నారు. ఒకవైపు చిరంజీవి, రామ్ చరణ్ అభిమానులు మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు తెలంగాణలో గల సీమాంధ్ర ప్రాంతానికి సంబంధించిన కాపు, తూర్పు కాపు, తెలంగాణలోని మున్నూరు కాపులు తెలంగాణ రాష్ట్రంలో జనసేన ను పట్టిసం చేయాలని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మలుపు తిప్పిన పవన్ స్టార్ పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంలో సైతం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముందుకు రావాలని ఆయన అభిమానులతో పాటు రాజకీయ పార్టీ శ్రేణులు యోచిస్తున్నారు. ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ జనసేన ను ఫస్ట్ పటిష్టం చేయడంతో పాటు అహంకారం, ఆధిపత్యం, అధికారాన్ని అనుభవించి, ఆస్వాదించి ప్రజలను మోసం చేస్తున్న వారిపై వ్యతిరేకత నెలకు ఉంది. ఈ పరిస్థితుల్లోనే తెలంగాణ రాష్ట్రంలో సైతం జనసేన అవసరమని నొక్కి చెబుతున్నారు. మరో వైపు గతంలో రాజకీయాల్లోనే చక్రం తిప్పిన తెలుగుదేశం పార్టీ జనసేన తోటి పొత్తు ఉండడం అది కూడా పవన్ కళ్యాణ్ ఉపయోగించుకోవడం కాదు పవన్ కళ్యాణ్ తోనే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే కొత్త మలుపుకు దారితీసిందని అందులో భాగంగా పవన్ కళ్యాణ్ తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా ఉండాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో జనసేన భారతీయ జనతా పార్టీ పొత్తుతో 8 సీట్లలో పోటీ చేసింది. అయితే ఎక్కడ ప్రభావం చూపనప్పటికీ ప్రతిష్టాత్మక కూకట్ పల్లి నియోజకవర్గంలో గుర్తింపు పొందిన విధంగా జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఓట్లు సాధించి జనసేన పార్టీని విలువలు పెంచడంలో ముందు వరుసలో ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ లైన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరి మనసుల్లో ఉన్న నేత. అందుకే ఆయనకు గతంలో మరెన్నడూలేని విధంగా ఓట్లు వచ్చాయి. దీంతో భారతీయ జనతా పార్టీ శ్రేణులకు సైతం విలువ పెరిగింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒకప్పుడు బిజెపి పోటీ చేస్తే 12 వేలకు పైగా ఈనాడు ఓట్లు రాని పరిస్థితుల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ కు అంతకంటే మూడు రెట్లు ఓట్లు రావడం అంటే అంత ఆశ మాసి కాదు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కు సరైన ప్రాధాన్యత కల్పించే విధంగా పదవి ఇచ్చి ఆయన ద్వారా పార్టీని మరింత పరిచిష్టంగా చేసుకోవాలని అభిమానులు కోరుతున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ భూమి ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ స్టార్ పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సైతం జనసేన ను విస్తరిస్తామని ప్రకటించారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణలో జనసేన క్రియాశీలకంగా ఉంటుందన్న పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. బీజేపీతో కలిసి కొనసాగుతామని వెల్లడించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిన్న తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యాయి. తెలంగాణలోనూ జనసేన క్రియాశీలకంగా ఉంటుందని, తెలంగాణలోనూ తాము బీజేపీతో కలిసి కొనసాగుతామని పవన్ చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర హెూం శఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పలు వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అధ్యక్షుడిగా తన ఆలోచనను ప్రకటించారు. ఆయన ఆలోచన మంచిదే కావొచ్చు. మా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జనసేన వాళ్లే ముందుగా ప్రతిపాదన తీసుకువచ్చారు కాబట్టి దానిపై మా రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అధ్యక్షుడు, పార్టీలో అందరూ కూర్చుని చర్చిస్తాం. ప్రజల అభిప్రాయం, కార్యకర్తల అభిప్రాయం, నాయకుల అభిప్రాయం సేకరించి అందుకు అనుగుణంగా వ్యవహరిస్తాం. అంతేతప్ప, ఎవరికి వారుగా పొత్తుపై నిర్ణయం తీసుకోలేం మాది అలాంటి పార్టీ కాదు. జనసేన పార్టీ ప్రతిపాదను బీజేపీ నాయకత్వం చూసుకుంటుంది" అని బండి సంజయ్ వివరించారు. ఏది ఏమైనప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో జనసేన విస్తరణ లక్ష్యంగా పవన్ సార్ పవన్ కళ్యాణ్ అభిమానులు కోరుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో నీతి నిజాయితీ ధర్మానికి ప్రతికగా ఉన్న సేవా కార్యక్రమంలో ముందున్న ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కు కీలక బాధ్యతలు అప్పగిస్తే జనసేన తెలంగాణ రాష్ట్రంలో సైతం కీలక భూమిక పోషిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంలో పవన్ కళ్యాణ్ వెనుకాడదని ఆయన అభిమానుల సైతం ఆలోచిస్తున్నారు.

## జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గద్దెగూడెం నవీన్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: నారాయణపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగద్దెగూడెం నవీన్ కుమార్ ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మరియూ మహబూబ్ నగర్ జిల్లా స్పోర్ట్స్ చైర్మన్ శ్రీ శివసేన రెడ్డి గారు నియమించడం జరిగింది.

నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంభం శివ కుమార్ రెడ్డి అద్వర్యంలో వారి చేతుల మీదుగా నియమక పత్రం అందుకోవడం జరిగింది. కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన గద్దెగూడెం నవీన్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి మండల అధ్యక్షుడు నల్ల కాంగ్రెస్ అధ్యక్షునికి జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలపటం జరిగింది.

## స్మార్ట్ సిటీ మిషన్ దేశవ్యాప్తంగా పొడిగించాలి

- కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాల అభివృదికి మహార్ధశ
- గత బీఆర్ఎస్ సర్కార్ స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లించడంవల్లే అభివృద్ధి కుంటుపడింది
- కాంట్రాక్టర్ వద్ద కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారు
- హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీ మిషన్ ను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారికి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ గారికి ధన్యవాదాలు. కేంద్ర నిర్ణయంవల్ల కరీంనగర్, వరంగల్ పట్టణాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి అయ్యే అవకాశాలు మెరుగయ్యాయి. స్మార్ట్ సిటీ నిధులను విడుదల చేయాలని గతంలో నేను మూడు సార్లు లేఖ రాశాను. కరోనా వల్ల రెండేళ్ల కాలం వృధా కావడంతో స్మార్ట్ సిటీ మిషన్ ను పొడిగించాలని కోరాం. బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా వచ్చిన విజప్తులపట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వచ్చే మార్చి నెలాఖరు వరకు స్మార్ట్ సిటీ మిషన్ ను పొడిగించినందుకు సంతోషంగా ఉందన్నారు. కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాలకు మహర్దశ రానుంది. పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగయ్యాయి. అయితే కేంద్ర నిధులు దారి మళ్లించకుండా చూడటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మ్యాచింగ్ గ్రాంట్ నిధులను సకాలంలో మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్ నిధులను దారి మళ్లించింది. కేంద్రం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించి సత్వర పనులు పూర్తి చేసినట్లయితే కరీంనగర్, వరంగల్ పట్టణాలు ఇప్పటికే అద్దంలా మెరిసేవి. కానీ రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయకపోవడంతోపాటు కేంద్ర నిధులను కూడా దారి మళ్లించింది. నేను పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సిల్ లో నిలదీసిన తరువాత కేంద్ర నిధులను జమ చేశారు. గత పాలకులు కమీషన్లకు కక్కుర్తి పడటంవల్లే స్మార్ట్ సిటీ పనుల్లో జాప్యం జరిగింది. కాంట్రాక్టర్ నుండి కమీషన్లు దొబ్బడం కొందరు పాలకులకు ఆనవాయితీగా మారింది. కాంగ్రెస్ పార్టీలో కొందరు నేతలు మళ్లీ కమీషన్ల కోసం అవతారమెత్తారు.

# టీచర్ పోస్టులను పెంచి భర్తీ చేయాలి

- నిరుద్యోగుల భారీ ధర్నా ప్రదర్శన చేస్తాం
- డీఎస్సీలలో 25వేల టీచర్ పోస్టులకు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగుల డిమాండ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద వేలాదిమందితో భారీ ధర్నా జరిపారు. 25వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది నిరుద్యోగులు నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ భారీ ప్రదర్శనకు రాష్ట్ర బి.సి యువజన సంఘం అధ్యక్షులు, నిరుద్యోగ జాక్ ఛైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షత వహించారు. నిరుద్యోగులను ఉద్దేశించి ఆర్ కృష్ణయ్య ప్రసంగిస్తూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా తక్కువగా యున్నది. బీఈడీ చేసిన వాళ్ళు 4లక్షలకు పైగా యున్నారు. కాని పోస్టులు చాలా తక్కువ 2200 మాత్రమే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు యున్నవి. వీటిని పెంచాలని అన్నారు. 75శాతం ప్రమోషన్ల ద్వారా ఇవ్వరాదని దీనిని 25 శాతంకు తగ్గించాలని, మిగతా డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోటా కింద భర్తీ చేయాలని కోరారు. ఎందుకంటే బీఈడీ వారికి ఎస్ జి ట ఒస్తులకు అర్హత లేకుండా చేశారు. బీఈడీ వారికి మిగిలినవి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు తప్ప మిగతా పోస్టులకు అర్హత లేదు. బీఈడీ చేసిన వారికి చాలా అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 11 వేల టీచర్ పోస్టుల భర్తీకే డీఎస్సీ ప్రకటించారు. టీచర్ పోస్టులు సంఖ్య కూడా తక్కువగా వేశారు. సంఖ్య విషయంలో అధికారులు ఆధారపడకుండా నిరుద్యోగుల సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం జరిపి చర్చలు జరపాలని కోరారు. ఈ క్రింది అంశాలను పరిగణలోకి తీసుకొని ఖాళీలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేస్తారు. 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించాం. ఇది సరికాదు. ఈ క్రింది అంశాలను పరిగణలోకి తీసుకొని డీఎస్సీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి. ప్రభుత్వ పాఠశాలలో 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పిఆర్సి కమిటీ రిపోర్టులో పేర్కొంది. అలాగే 10వేలమంది సెకండరీ గ్రేడ్ టీచర్ల స్కూల్ టీచర్లకు అసిస్టెంట్ ప్రమోషన్లు ఇస్తే ఇంకో 10వేల పోస్టులు వస్తాయి. గత 10 సంవత్సరాల కాలం నుంచి దాదాపు 6వేలకు పైగా పాఠశాలలు మూసివేశారు. వీటిలోని టీచర్ పోస్టులు భర్తీ చేయాలి. ఇప్పుడు కూడా 22 వేల స్పెషల్ టీచర్లు నియమించడానికి ఆర్థిక శాఖ 5 నెలల క్రితం ఆమోదించింది. టీచర్ పోస్టులు ఖాళీగా లేకపోతే ఈ స్పెషల్ టీచర్లు ఎందుకు? నియమిస్తారు.వాస్తవంగా ఎన్ని ఖాళీలు యున్నవి లెక్కించాలని, గత 10 సంవత్సరాల కాలంలో ఎంత మంది రిటైర్ అయ్యారు? ఎంత మంది ప్రమోషన్లు పొందారు. ఇతర కారణాలతో ఎన్ని ఖాళీలు ఏర్పడ్డాయి.

లెక్కించి భర్తీ చేయాలని అన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 16 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థులుకు ఈ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం లేక చదువులల్లో వెనుకబడి పోతున్నారు. విద్యా ప్రమాణాలు దిగ జారిపోతున్నాయి. దీనిలో బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ పరీక్షలలో పోటీలో ఇంజనీరింగ్, మెడిసిన్, నీట్ తదితర పోటీపరీక్షలలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారని అన్నారు. టీచర్ పోస్టులు ఖాళీల విషయంలో విద్యాశాఖ అధికారులు సరిగ్గా లెక్కించడం లేదని విమర్శించారు. టిచర్ పోస్టుల భర్తీని నిరుద్యోగులకు ఉద్యోగం ఇస్తున్నామనే బడ్జెటు ఖర్చు అవుతుంధని కోణంలో చూడరాదు. ఈ టిచర్ల ద్వారా భావి భారత పౌరులైన భాలలను తీర్చిదిద్ది ఈ సమాజానికి ఉపయోగపడే గొప్ప వారికి తయారు చేస్తామన్నామనే కోణంలో చూడాలి.

పూర్తీ స్థాయి టిచర్ పోస్టులు భర్తీ చేస్తే ప్రభుత్వ పాటశాల వ్యవస్థను బలోపేతం చేస్తే విద్యాప్రమాణాలు పెరిగి విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప నైపుణ్యం గల మానవ వనరులుగా సమాజాభివృద్దికి తోడ్పడుతారు. విద్యార్థులను తీర్చి దిద్దితే, వారిలో ఉన్న సృజనాత్మక శక్తి, తెలివి తేటలకు సాన పెడితే గొప్ప ఇంజినీర్లు, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, సంఘ సంస్కర్తలుగా విలువ గల రాజకీయ నాయకులుగా తయరవుతారు. అప్పుడు దేశ%శీ% శీఘ్ర గతిన అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యా, వైద్యం ప్రతి విద్యార్థికి ఇవ్వాలని రాజ్యాంగం ఆదేశించిన 76 సంవత్సరాల కాలంలో ఇప్పటికీ ఆ ఆశయం నెరవేరలేదన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే వారిలో దాగివున్న జ్ఞానం – ప్రతిభ బయటకు వస్తాయని దీని మూలంగా దేశంలో ప్రగతి పథంలో నడుస్తుందని భారతదేశం అగ్ర దేశంగా తయారవుతుందని అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో 100శాతం విద్యావంతులు ఉంటారో ఆ దేశాలు అగ్ర దేశాలుగా తయారైనన్నారు. సమాజ కోణం చూస్తే, ఒకసారి ఒక కుటుంబం ఉన్నత చదువులు చదివితే, సమాజంలో సామాజిక, ఆర్థిక, అసమానతలు తొలగిపోతాయి.

ఆ కుటుంబం ప్రభుత్వ రాయితీల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండదు. ఆదాయం పెరగడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముఖ్యంగా సబ్సిడీ బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణ పథకం పై ప్రభుత్వ భారం తగ్గిపోతుంది. ఈ అవాంఛనీయ శక్తులలో ప్రధానంగా కుల వ్యవస్థ మొత్తం జాతి పైన నిర్ధాక్షిణ్యమైన, విచ్ఛిన్నకర ప్రభావాన్ని చూపిస్తూనే ఉందన్నారు. దీనిని నిర్మూలించాల%శీ%టే ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలి. విద్యా ద్వారానే కుల నిర్మూలన జరుగుతుంది. ముడ విశ్వాసాలు, మూడనమ్మకాలు తొలగిపోతాయి. అజ్ఞానం, అంధకారం, అమాయకత్వం నుంచి ప్రజలను విముక్తి చేసి ఒక విజ్ఞాన వంతమైన, శాస్త్రీయ జ్ఞానం తో కూడిన సమాజం నిర్మితం చేయగలమన్నారు.

## భరతమాతను ప్రేమించాలి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు భరతమాతను ప్రేమించాలని భారతీయ జనతా పార్టీ మైనార్టీ సెల్ నాయకురాలు స్పష్టం చేశారు. ఆదివారం దేశవ్యాప్తంగా టెలివిజన్ ద్వారా ప్రసారమైన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 111 మంకీ బాత్ కార్యక్రమాన్ని మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ షబానా మోమిన్ బూత్ నెంబర్ 73 వీక్షించారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించినట్టు ప్రతి ఒక్కరూ భరతమాతను ప్రేమించాలని కన్నతల్లి పేరు మీద ఒక మొక్కను నాటాలని చెప్పిన అంశాన్ని వెంటనే పాటిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం స్థానిక సభ్యులతో పాటు వీక్షించారు.

## సీఎం వచ్చి పెన్షన్ ఇస్తారు

### రైల్వే కోడూర్ డిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఇంటికి వచ్చి అర్హులైన వారందరికీ ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రియే పెన్షన్లు ఇస్తారని తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్కా రూపానంద రెడ్డి స్పష్టం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ మానిఫెస్టోలో చెప్పిన విదంగా జులై 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయం సిబ్బంది ద్వారా పెన్షన్ లు పంపిణి కార్యక్రమం జరుగు తున్నదని స్పష్టం చేశారు. కావున రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలతో పాటు మన రైల్వే కోడూరు నియోజ కవర్గం లోని మండలాల వారీగా సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి ఇంటి వద్ద పెన్షన్ పంచడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం లోని ప్రతి మండలం లొ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ముక్కా రూపానందరెడ్డి కోరారు.

## లైబ్రరీలను ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ ఇవ్వాలి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ (పి.డీ.) లు లైబ్రరీలను ప్రిన్సిపల్ గా ప్రమోషన్ కల్పించాలని తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.లక్ష్మయ్య ప్రధాన కార్యదర్శి ఎం. పర్వతాలు గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు .రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రరీలు సింగిల్ ప్రమోషన్ లేకుండా దాదాపు20 నుంచి 30 ఏళ్లు పీడీలుగా , లైబ్రరీలు గా పోస్టులోనే పదవి వివరణ చేస్తున్నారని వారు తెలిపారు. డబుల్ పీజీ లు డాక్టరేట్ ఉన్నప్పటికీ పీడీలు లైబ్రరీలు ప్రమోషన్లను లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ ఎడ్యుకేషన్ లో పనిచేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ స్కూల్ అసిస్టెంట్లుగాను హెడ్మాస్టర్ గా డిప్యూటీ విద్యాశాఖ అధికారులుగా ప్రమోషన్లు పొందుతున్నారని ఈ విషయాన్ని వారు సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైన జూనియర్ కళాశాల పీడీలకు లైబ్రరీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రభుత్వం ప్రమోషన్ కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు.



# నిరుద్యోగులపై కాంగ్రెస్ పార్టీది కపట ప్రేమ

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః ఎన్నికల ముందు నిరుద్యోగులపై కపట ప్రేమ చూపించిన కాంగ్రెస్ పార్టీ.. గద్దెనెక్కిన తర్వాత వారి గుండెల మీద తన్నుతున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రాహుల్ గాంధీని అశోక్నగర్కు పిలిపించి మరీ హామీ ఇప్పించారని తెలిపారు.

రెండు లక్షల ఉద్యోగాలు నింపుతామని రాహుల్ మాట ఇచ్చారని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని నిలదీశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు ఆంధ్రప్రదేశ్లో 1:100 పిలుస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు సాధ్యంకాదని ప్రశ్నించారు. గ్రూప్స్ నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గాంధీ దవాఖానలో ఆమరణదీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు మోతీలాల్ నాయక్ను మాజీ మంత్రి హరీశ్ రావు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. మోతీలాల్ నాయక్ గత ఏడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే కాంగ్రెస్ సర్కారుకి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం మొద్దునిద్ర పోతున్నదని విమర్శించారు. ఇది తన ఒక్కడి కాదని, నిరుద్యోగులందరి సమస్య అంటున్నాడని చెప్పారు. బీఆర్ఎస్ పక్షాన దీక్ష విరమించాలని మోతీలాల్ను కోరామని చెప్పారు. గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.

జీవో 46 రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ ఎందుకు వేయడం లేదని, ప్రైమరీ స్కూల్స్లో టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తామన్నారు. అసెంబ్లీని స్తంభింపచేస్తామని చెప్పారు. మోతీలాల్కు ఏమైనా జరిగితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి వచ్చి చర్చలు జరపాలన్నారు.



# కిషన్ రెడ్డి మోడీని మించి పోయాడు

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్టేట్మెంట్లు చూస్తే అబద్దాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మించిపోయారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఎంఎండీఆర్ పేరుతో చట్టం ఏర్పాటు చేసి ఆ గనులను ప్రైవేట్ సంస్థలకు విక్రయిస్తున్నారన్నారు. బీజేపీ ఆలోచనలు ఉన్న బొగ్గు గనుల జోలికి వెళ్లమని, కొత్త బొగ్గు గనులను విక్రయించేలా ఉందని విమర్శలు చేశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడు తూ....బీజేపీ, కేసీఆర్ రెండు ఒక్కటే, కేసీఆర్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని సెటైర్లు చేశారు. కేసీఆర్ ఇప్పుడు పోరాటం చేస్తామని చెబుతున్నారని.. పోరాటాలు చేసేది కేవలం కమ్యూనిస్టు మాత్రమేనని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ పోరాటాలకు రోడ్ల మీదకు రావాలని, లేకుంటే అది తమ పోరాటం కాదని చెప్పారు. ఒరిస్సా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బొగ్గు గనులను ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు, కిషన్ రెడ్డి మోదీతో మాట్లాడి తెలంగాణలో ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉన్న గనులను ప్రభుత్వానికి ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి సందర్భంలో దూకుడుగా ఉండాలని. రేపు 5 వ తేదీన కోల్డ్ బెల్ట్ బంద్ చేసి, కలెక్టరేట్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. "సీపీఐ బలంగా ఉన్న స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందింది. తమిళనాడ్ వంటి ప్రాంతాల్లో కమ్యూనిస్ట పట్ల ప్రజల్లో ఉన్న అభిమానన్ని గుర్తించారు. 100 ఏళ్లు వయస్సు కలిగిన పార్టీ లేదు. ఈ నాటికి కమ్యూనిస్టకు కోట్ల మంది ప్రజలు ఆదరణ చూపెడుతున్నారు. బీజేపీ 400 స్థానాలు దాటాలని చెప్పిందని, 240 స్థానాలకు పడిపోవడం వెనుక కమ్యూనిస్ట్ ల సైద్ధాంతిక పోరాటం ఉందని గమనించాలి. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను జనాల్లోకి తీసుకెళ్లడం కమ్యూనిస్ట్ లతోనే సాధ్యం. బీజేపీ అయోధ్య వంటి స్థానాల్లో ఓడిపోవడం, జనరల్ స్థానంలో దళితుడు పోటీ చేసి గెలవడం కమ్యూనిస్ట్ ప్రభావితం ఉండటం కారణం" అని. తెలిపారు "కమ్యూనిస్ట బలాన్ని విస్తృత పరచాలి అనుకుంటున్నాం. కమ్యూనిస్ట్ లతో పొత్తులు కుదిరితే సంతోషం, లేకుంటే సొంతంగా ముందుకెళ్తాం. కాంగ్రెస్ నిలబడాలని మేము కోరుకుంటాం, కాంగ్రెస్ ప్రజల సమస్యల పట్ల ఆలోచించకుంటే మేము వాటిని ప్రజల్లోకి తీకెళ్తాం. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల స్వభావం గురించి మనం చర్చించుకున్నాం. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ తన సొంత బలంతో గెలుపొందలేదు, బీఆర్ఎస్ బలహీనం అయిన చోట బీజేపీ పుంజుకుంది. బీఆర్ఎస్ బలహీనం అయిన చోట ప్రజలు మమ్మల్ని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ సెంటిమెంట్పై ఏర్పడిన పార్టీ. ఇక్కడ బీఆర్ఎస్ స్థానాన్ని భర్తీ చేయాలి అనుకుంటే ఆ స్థానంలో కాంగ్రెస్ లేదా కమ్యూనిస్ట్ పార్టీలకు మద్దతు చూపుతారు. అన్ని రంగాల్లో నిష్ఠాతులైన కార్యకర్తలను తయారు చేయాలని చూస్తున్నాం. తెలంగాణ రాష్ట్రానికి గొప్ప సంపద బొగ్గు గనులు, దాని మీద ఎక్కువ హక్కులు మాకే ఉన్నాయి" అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు.

# డీఎస్ లేని లోటు ఎవరూ తీర్చలేరు

### డీఎస్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ నిన్న కన్నుమూసిన సంగతి తెలిసిందే. 76 ఏళ్ల డీఎస్ నిన్న వేకువ జామున హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. ఇవాళ అధికారిక లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు నిజామాబాద్ లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ లో డీఎస్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. డీఎస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్ తనయులు సంజయ్, ఎంపీ అర్వింద్ లతో మాట్లాడారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. డీఎస్ లేని లోటును ఎవరూ తీర్చలేరని అన్నారు.

డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నో రకాలుగా సేవలు అందించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో డీఎస్ పాత్ర కీలకం అని పేర్కొన్నారు. డీఎస్ కుటుంబానికి తమ సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్ కుట్ర

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః విద్యుత్ బిల్లుల వసూలును ప్రైవేటు కంపెనీలకు అప్పగించే విధంగా రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయాలు తీసుకోబోతున్నది. విద్యుత్ బిల్లుల వసూలును అదానీకి అప్పగిం చేందుకు కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఆది వారం తెలంగాణ భవన్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు వ్యక్తులు విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుగా పాతబస్తీని ఎంచుకున్నారు. కానీ, అది అక్కడికే పరిమితం కాదు, రాష్ట్రం మొత్తం విద్యుత్ బిల్లుల వసూలు ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని విమర్శించారు. విద్యు త్ సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు ఇక రాష్ట్రంలో ఉండవన్నారు. రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడతారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్ప చెప్పడాన్ని కేసీఆర్ అంగీకరించలేదన్నారు. మోదీ కనుసన్నల్లో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మోదీ, అదానీ విధానాలను తెలంగాణలో రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థ ప్రజల ఆస్తి. దీన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్తున్నారు. ఓల్డ్ సిటీలో 45 శాతం మాత్రమే కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయి . అందుకే ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అంటున్నారు. తెలంగా ణలో 95 నుంచి 97 శాతం వరకు కరెంటు బిల్లులు వసూలు అవుతున్నాయి. ఓల్డ్ సిటీ ప్రజలను అవమానించే విధంగా రేవంత్ రెడ్డి చర్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేస్తుంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వేలంలో పాల్గొన్నారు. శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం నుంచి ఎందుకు తీసివేయించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదని గుర్తు చేశారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలిపాలని డిమాండ్ చేశారు.



# తెలంగాణ సర్కారుపై బండి సంజయ్ ఫైర్

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ కూడా పయనిస్తోంది
- బీజేపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గం
- కేంద్రం కూడా అదే విధంగా చేస్తే కాంగ్రెస్ ఎంపీల పరిస్థితి ఎలా ఉంటుంది



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత కనిపిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ కూడా పయనిస్తోందని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గం అని బండి సంజయ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కూడా అదేవిధంగా కాంగ్రెస్ ఎంపీలకు నిధులు ఇవ్వకపోతే ఏమవుతుందో ఆలోచించండి అని అన్నారు. తమ మంచితనాన్ని చేతకానితనంగా భావించవద్దు అని స్పష్టం చేశారు. అన్ని పార్టీలను సమదృష్టితో చూడాలని రేవంత్ సర్కారుకు హితవు పలికారు. పార్టీ ఫిరాయింపుల్లోనూ బీఆర్ఎస్ కు, కాంగ్రెస్ పార్టీకి తేడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పై సొంత ఎమ్మెల్యేలే తిరగబడిన సంగతి కాంగ్రెస్ గుర్తుంచుకోవాలని సూచించారు. ఇక, సింగరేణి గనుల ప్రైవేటీకరణపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్‌లోకి మరో ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు?

- కారు పార్టీకి అడుగడుగునా కష్టాలే
- బీఆర్ఎస్ పార్టీ మనుగడ సాగేనా?

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన 'కారు' పార్టీకి అడుగడుగునా ఎదురుదెబ్బలే తగులుతున్నాయి.! అసెంబ్లీలో అట్టర్ ఫ్లాప్ కావడంతో పార్లమెంట్ ఎన్నికల్లో అయినా పరువు నిలబెట్టుకుందామని భగీరథ ప్రయత్నాలు చేసి అడ్రస్ లేకుండా పోయింది.! అసలు పార్టీ పరిస్థితి ఏమవుతుందో కూడా తెలియట్లేదని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్న పరిస్థితి.! దీనికి తోడు రోజురోజుకూ 'కారు' నుంచి ఎమ్మెల్యేలు దిగేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటూ ఉండటంతో పార్టీ రోజురోజుకూ ఖాళీ అవుతోంది.! ఎప్పుడు ఏ ఎమ్మెల్యే గులాబీ కండువా తీసేసి కాంగ్రెస్ కండువా కప్పుకుంటారో తెలియట్లేదు.! సార్వత్రిక ఎన్నికల ముందు మొదలైన చేరికలు.. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మరింత జోరందుకున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కారు దిగి కాంగ్రెస్లోకి వచ్చేశారు.! ఇప్పటికే.. బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, సంజయ్ కుమార్, కాలె యాదయ్యలు పార్టీకి గుడ్ బై చెప్పేసి కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఇందులో ఒకరు హ్యాట్రిక్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాగా.. మరో ఇద్దరు హైదరాబాద్ సిటీకి చెందిన వారేనని.. ఇంకో ఇద్దరు హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల ఎమ్మెల్యేలు అని లీకులు వస్తున్నాయి. దీంతో ఆ ఐదుగురు ఎవరబ్బా..? అని తెలుసుకోవడానికి జనాలు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే జులై మొదటి వారం లేదా.. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక తర్వాత ఈ చేరికలు ఉంటాయని వార్తలు గుప్పుమంటున్నాయి.

అయితే సంఖ్య పెరగొచ్చే కానీ.. తగ్గే అవకాశం అస్సలు లేదని కాంగ్రెస్ నేతలు కొందరు చెబుతున్న పరిస్థితి. గులాబీ దళం ఖాళీ అయ్యి, కాంగ్రెస్ హౌస్ఫుల్ అవుతుండటంతో ఈ మధ్యనే ఎమ్మెల్యేలతో ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక సమావేశం నిర్వహించారు. పార్టీని వీడొద్దని ఒకటికి పది సార్లు ఎమ్మెల్యేలకు చెప్పారు గులాబీ బాస్. 'అబ్బే.. అస్సలు మారే ప్రసక్తే లేదు సార్.. మీ వెంటే ఉంటాం' అని చెప్పిన రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యేలు జంప్ అయిపోతుండటం గమనార్హం. ఎప్పుడు ఎవరు పార్టీ వీడుతారో..? పార్టీలో ఉండేదెవరో..? పోయేదెవరో..? అని పెద్ద చర్చే జరుగుతోంది. దీంతో గులాబీ పార్టీలో గుబులు మొదలైంది. బీఆర్ఎస్లో ఆఖరికి ఆ నలుగురు మాత్రమే మిగులుతారని కాంగ్రెస్ నుంచి విమర్శలు, అంతకుమించి ఆరోపణలు పెద్ద ఎత్తునే వస్తున్నాయ్. ఆ నలుగురు మరెవరో కాదని.. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావులు అని కాంగ్రెస్ మంత్రులే కామెంట్స్ చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మరకు ఫామ్ హౌస్లో కేసీఆర్ మాట్లాడిన మాటలు కొన్ని లీకయ్యాయి. 'ఒకటి రెండు నెలలు ఓపిక పట్టండి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండదు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మనతో టచ్లో ఉన్నారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నేతలతో టచ్లో ఉన్నాం. రెండు నెలల తర్వాత అధికారంలోకి వస్తాం. ముఖ్యమంత్రి పదవిపై నాకు ఆశ లేదు. ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారు. నేను మీకు మార్గదర్శిగా ఉంటాను. కాంగ్రెస్లో చేరుతున్న మన ఎమ్మెల్యేలను న్యాయస్థానం ద్వారా అనర్హులుగా ప్రకటింపజేస్తాం. ఢిల్లీకి చెందిన పెద్ద లాయర్తో మాట్లాడాం. ఇంతకంటే ఎక్కువ చెప్పను. చెబితే రహస్యాలు లీక్ అవుతాయి' అని కేసీఆర్ ఫాంహౌస్కు పిలిపించుకున్న తన పార్టీ ఎమ్మెల్యేలతో చెప్పినట్లుగా తెలుస్తోంది. ఇది ఎంతవరకూ నిజమో కానీ.. జంపింగ్లు మాత్రం అస్సలు ఆగట్లేదు. ఇలాంటి వార్తలు వచ్చినప్పుడల్లా ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు వీడుతున్నారే తప్ప.. పార్టీలో ఉండటానికి ప్రయత్నాలు చేయట్లేదు. తెలంగాణ రాజకీయాల్లో ముమ్ముందు ఇంకా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సిందే మరి.

# సమాజాన్ని మార్చే శక్తులుగా బీసీలు ఎదగాలి

- ఐ. తిరుమలి ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్



సమాజాన్ని మార్చే శక్తులుగా బీసీలు ఎదగాలని అదేవిధంగా బానిసలుగా బతకకుండా సోషల్ రెవల్యూషన్ రావాలని ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి అన్నారు. ఆదివారం బీసీ టైమ్స్ బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం జరిగే బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు..బీసీలలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మార్పు వచ్చినప్పుడే అధికారం మన చేతిలో ఉంటుందని ఏ విధంగా ఇంతవరకు చాలా కులాలు అసెంబ్లీలో ఇంతవరకు అడుగు పెట్టిన సందర్భాన్ని ఆయన గుర్తు చేస్తూ ఇకనైనా సంఘటితంగా అందరూ కలిసిమెలిసి పని చేసినప్పుడే రాజ్యాధికారి సాధ్యమని తిరుమలి అన్నారు.

బీసీలకు అధికారం రావాలంటే ఎన్నికల్లో పోటీల్లో నిలవాల్సిందేనని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా సమాజాన్ని మార్చే శక్తిగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బీసీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, బీసీ సమాజ్ యూత్ ప్రెసిడెంట్ పి. సతీష్ సాగర్, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ సాగర్ తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కుల సంఘ పెద్దలు ఉద్యోగ సంఘ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐ నూతన ఛైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి

### శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్



తెలంగాణ బ్యూరో/ప్రతినిది: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానూతన ఛైర్మన్గా తెలంగాణ వ్యక్తి చల్లా శ్రీనివాసులు శెట్టి నియమితులవుతున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వివిధ పార్టీల నేతల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్బీఐలో అత్యున్నత పదవి చేపట్టబోతున్న శ్రీనివాసులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు శుభాకాంక్షలు తెలిపారు. "దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నూతన ఛైర్మన్గా నియమితులవుతున్న తెలంగాణ బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టి (సీఎస్ శెట్టి)కి హార్దిక శుభాకాంక్షలు"అని ఎక్స్లో కేటీఆర్ పోస్ట్ చేశారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని పెద్ద పోతులపాడు శ్రీనివాసులు శెట్టి స్వగ్రామం. ఏడో తరగతి వరకు స్వగ్రామంలోనే ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఎనిమిది నుంచి పదో తరగతి, ఇంటర్ గద్వాలలో పూర్తి చేశారు. రాజేంద్రనగర్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేశారు. చిన్న వయసులోనే తండ్రి కిరాణా షాపులో గ్రామస్థులు తీసుకున్న అప్పులు వసూలు చేసేవారు. ఈ అప్పుల వసూళ్ల అనుభవం ఎస్బీఐలో మొండి బకాయిల వసూళ్లలోనూ ఉపయోగపడిందని ఆయన చెబుతారు. 1988లో ఎస్బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్గా చేరిన శెట్టి.. గత మూడున్నర దశాబ్దాల్లో వివిధ హోదాల్లో పని చేశారు.

కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్, రుణాల వసూళ్లు, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ రంగాల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. శెట్టి ప్రస్తుతం ఎస్బీఐ ఎండీగా ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఎస్బీఐ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎస్బీఐ ఫౌండేషన్ ద్వారా స్వగ్రామం పెద్ద పోతులపాడు, దాని చుట్టుపక్కల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని పాఠశాల, అంగన్వాడీకి రూ.40 లక్షల విలువ చేసే సామగ్రిని అందజేయగా.. అంతక్రితం ఊరూరా తిరిగి రోగులకు ఔషధాలు అందించే ఎస్బీఐ సంజీవని వాహనాన్ని డొనేట్ చేశారు. శ్రీనివాసులు శెట్టికి ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు కెనడాలో, మరొకరు ముంబైలో స్థిరపడ్డారు

# ముగిసిన డీ శ్రీనివాస్ అంత్యక్రియలు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ పీసీసీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. నిజామాబాద్ లోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్ పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. డీఎస్ చిన్న కుమారు బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, కుటుంబ సభ్యులతో పాటు అభిమానులు డీఎస్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. డీఎస్ ను చివరి చూపు చూసుకునేందుకు అభిమానులు, కార్యకర్తలు, బంధువుల భారీగా తరలివచ్చారు. ఉదయం డీఎస్ పార్థివదేహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆయన పార్థివ దేహాన్న సందర్శించారు. డీఎస్ సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో కాంగ్రెస్ లోనే ఎక్కువగా సాగింది. ఆయన 40 ఏళ్ల పాటు రాజకీయంలో కొనసాగారు. స్థానికంగా డీ శ్రీనివాస్ ను సీనన్న అని పిలుస్తుంటారు. డీఎస్.. నిజామాబాద్ జిల్లా వేల్పురేర్ మండల కేంద్రంలో రైతు కుటుంబంలో 1948 జన్మించారు. హైదరాబాద్ నిజాం కాలేజీలో బీకాం డిగ్రీ , లా పూర్తి చేశారు. రిజర్వ్ బ్యాంకులో పనిచేశారు. ఆ టైమ్ లో యువత రాజకీయాల్లోకి రావాలన్న ఇందిరాగాంధీ పిలుపు తో ఎన్ఎస్యూఐ లో చేరారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్

### పార్టీ మారబోతున్న కీలక నేత

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః అసెంబ్లీ ఎన్నికలతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటోంది. లోక్ సభ ఎన్నికల తర్వాత ఆ పార్టీ పరిస్థితి మరింత దిగజారింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. దీంతో ఆ పార్టీ పని అయిపోయిందని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్ పార్టీన వీడారు. తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి, దానం నాగేందర్, కాలె యాదయ్య, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, పోచారం శ్రీనివాస రెడ్డి హస్తం గూటికి చేరారు. ఇంకా చాలా మంది ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నాట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జారిపోకుండా ప్రయత్నాలు చేస్తోంది.

ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశం అవుతూ పార్టీ మారొద్దని కోరుతున్నారు. అయినప్పటికీ కొంత మంది ఎమ్మెల్యేలు పక్క చూపులు చూస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలో కీలక నేతగా ఉన్న ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే ఇప్పటికే కాంగ్రెస్తో ప్రాథమిక చర్చలు జరిపారని.. ఆషాఢ మాసం ప్రారంభంలోనే ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆ ఎమ్మెల్యే ఇటీవల నియోజకవర్గంలో పర్యటించినప్పుడు పలు వ్యాఖ్యలు చేశారు.

ఓ మీడియా ప్రతినిధి మీ కోసం హెం శాఖ, విద్య శాఖలు ఖాళీ ఉంచారనుకుంటా అని అడిగారు. దీనికి ఆ ఎమ్మెల్యే సమాధానం ఇస్తూ మంత్రి పదవి కావాలంటే అదృష్టం ఉండాలన్నారు. ప్రస్తుతం తమ పార్టీ అధికారంలో లేదు.. మంత్రి పదవి ఎలా సాధ్యమని సమాధానం చెప్పకుండా అదృష్టమని చెప్పారంటే..ఆ ఎమ్మెల్యే పార్టీ మారే యోచనలో ఉన్నట్లు కనిపిస్తుందని సోషల్ మీడియాలో కామెట్లు వస్తున్నాయి.

ఇంతకీ ఆ ఎమ్మెల్యే ఎవరో చెప్పలేదు. కదూ.. ఆమె ఎవరో కాదు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఆమె రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో హెూం శాఖ మంత్రిగా పని చేశారు. 2019లో బీఆరెస్ చేరారు. బీఆర్ఎస్ చేరగానే ఆమెకు మంత్రి పదవి ఇచ్చారు. అయితే బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఆమె పార్టీ మారేందుకు రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమె కుమారుడు కార్తీక్రెడ్డి సైతం కాంగ్రెస్లో చేరబోతున్నారని, అతడికి నామినేటెడ్ పోస్టును సైతం కాంగ్రెస్ ఆఫర్ చేసిందనే ప్రచారం సాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్నం, పట్లోళ్ల ఫ్యామిలీలదే ఆధిపత్యం ఉంటుంది. ప్రస్తుతం పట్నం కుటుంబం కాంగ్రెస్ లో కొనసాగుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్న శ్రీచక్రా మిల్క్ ప్రొడక్ట్స్





తెలంగాణ బ్యూరో ప్రతినిధి : శ్రీచక్రా మిల్క్ ప్రొడక్ట్స్ తమ బిజినెస్ను మరింతగా విస్తరించడానికి సిద్ధమయ్యింది. పశ్చిమగోదావరి జిల్లా, నల్లజర్ల మండలంలోని అవపాడు గ్రామం లో 2014 లో మొదలైన ఈ కంపెనీ, పాడి రైతులు, వినియోగదారుల సపోర్ట్తో రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించింది. ప్రస్తుతం 18 పాల శీతలీకరణకేంద్రాలు, టెట్రాప్యాక్కింగ్ మిషినరీలను ఆపరేట్ చేస్తోంది. 25 వేలకు పైగా కుటుంబాలకు, వెయ్యికి పైగా రెస్టారెంట్లకు, అనేక ప్రభుత్వ, ప్రేవేటు విద్యాసంస్థలకు పాలను సరఫరా చేస్తోంది. గత పదేళ్లలో రూ. 200 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ సాధించామని, లక్ష మందికి పైగా ఉపాధి, ఉద్యోగాలను కల్పించామని శ్రీచక్ర మిల్క్ ప్రొడక్ట్స్ ఓ స్టేట్మెంట్లో పేర్కొంది.

# నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరిగేది ఎప్పుడు?

- గత ప్రభుత్వంలోనూ అన్ని రంగాలలో అన్యాయం
- కాంగ్రెస్ సర్కార్ అయినా.. ఆదుకునేనా
- తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయీ



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః దేశానికి స్వాతంత్రం వచ్చి 7 దశాబ్దాలు గడిచి పోయినా..నాయీ బ్రాహ్మణులకు అన్ని రంగాలలో వివక్ష కొనసాగడం దౌర్భాగ్యమని తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కుల ఫెడరేషన్లు, బీసీ కార్పోరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించి, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేశారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కుల సామాజిక వర్గానికి ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదని, కేవలం నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ తప్పితే ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. రాజకీయ రంగంలో ఎలాంటి ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల తమ సామాజిక సమస్యలను పట్టించుకునే నాథుడు లేడన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగానే పరిగణించడం బాధాకరమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా..తమకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. తెలంగాణలో రజకులకు వారి వృత్తి వారే చేసుకునే విధంగా ప్రభుత్వం ఏ విధంగా జీవో అమలు చేసిందో అలాగే మన నాయి బ్రాహ్మణుల వృత్తి మనమే చేసుకునే విధంగా ప్రత్యేక జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కుల దూషణ.. చేసే వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నాయి బ్రాహ్మణ కులాన్ని కించపరిచే విధంగా లేదా దాడులు చేసిన వారిపై అట్రాసిటీ చట్టం అమలు చేయాలని అన్నారు. చట్ట సభలలో..నాయి బ్రాహ్మణులకు ఎంఎల్సీ, ఎంఎల్ఏ, ఎంపితో పాటు ఇతర నామినేటెడ్ పదవులు కల్పించాలన్నారు. పెన్షన్, హెల్త్ కార్డు జారి కోసం.. నాయి బ్రాహ్మణుల వృత్తి, వాయిధ్య కళాకారుల 55సం?లు దాటిన వారికి పెన్షన్ మరియు హెల్త్ కార్డు జారి చేయాలన్నారు. దేవధర్మదాయ శాఖలలో సేవలు అందిస్తున్న వాయిధ్య కళాకారులకు ఉద్యోగభద్రత కల్పించాలని, తలనీలాల కాంట్రాక్టు నాయి బ్రాహ్మణులకు కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వం ప్రకటించిన 25 వేల నవీన క్షౌరశాలలు వెంటనే అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి పాలకవర్గం ఏర్పాటు చేయలేదు కాబట్టి ప్రభుత్వం బడ్జెట్లో ప్రకటించిన 500 కోట్లు మంజూరు చేస్తూ పాలక వర్గం నియమించాలని పాల్వాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# మన దేశం విశ్వవిజేత

- టి 20 ప్రపంచ కప్ భారత్ కైవసం
- ఆద్యంతం పోరు ఉత్కంఠ భరితం
- ఎక్కడ కోల్పోయాడో అక్కడే సాధించిన ద్రవిడ్

**టీమిండియా దుమ్మురేపింది. అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతూ సగర్వంగా టీ20 వరల్డ్ కప్ ను చేజిక్కించుకుంది. ఐసీసీ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ ఓటమిని, నిరుడు సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఎదురైన ఓటమిని మరిపిస్తూ... టీ20 వరల్డ్ కప్-2024 టోర్నీలో విజేతగా ఆవిర్భవించింది. దక్షిణాఫ్రికాతో హోరాహోరీగా సాగిన ఫైనల్లో టీమిండియా 7 పరుగుల తేడాతో నెగ్గి చాంపియన్ టీమ్ గా అవతరించింది. వరల్డ్ కప్ ట్రోఫీ అందుకున్న టీమిండియా ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఓవర్లు గడిచే కొద్దీ, లక్ష్యం కరిగిపోతూ వస్తోంది. మ్యాచ్ చేజారి పోతోంది. ఇంకా అంతా అయిపోయింది అనడమే మిగిలి ఉంది. అరచేతుల్లో చెమటలు పడుతున్నాయి. నీరసం, నిస్సత్తువ అవహించింది. మరో ఫైనల్ ఓటమి ఖాయమని అంతా అభిప్రాయంలోకి వచ్చేశారు. కానీ మైదానంలో ఉన్న భారత వులులు మాత్రం ఈ ఆలోచన చేయడానికి కూడా సిద్ధంగా లేరు. చివరి ఓవర్ వరకూ పోరాటం చేయడానికి వారంతా నిశ్చయించుకున్నారు. కానీ మ్యాచ్ విషయాలను ఓసారి తలచుకుంటే..**



ప్రపంచకప్ లో మొదటి సారిగా ఫైనల్ చేరుకుంది దక్షిణాఫ్రికా, ఎలాగైన కప్ ను గెలుచుకోవాలనే లక్ష్యంతో ఆడారు. మరో ఐదు ఓవర్లు, ముప్పై పరుగులు గట్టిగా ఆడితే ఐదు భారీ షాట్లు అంతే.. మ్యాచ్ ఫినిష్ అవుతుంది. కప్ చేజిక్కుతుంది. పైగా ఇక్కడ ఉన్నది ప్రపంచంలోని పేరు మోసిన హిట్టర్లు క్లాసెన్, డేవిడ్ మిల్లర్. ఈ పొట్టి కప్ లోనే మన జట్టుకు అండగా నిలిచిన స్పిన్నర్లనే లక్ష్యంగా చేసుకున్నారు. వచ్చిన బంతులను వచ్చినట్లు బౌండరీ దాటిస్తున్నారూ ఈ ఇద్దరు మేటీ బ్యాట్స్ మెన్. ముఖ్యంగా అక్షర్, కుల్దీప్ లో బంతులను మంచినీళ్లు తాగినంత తేలికగా స్టాండ్స్ కు పంపిస్తున్నారు. కానీ చివరి ఐదు ఓవర్లలో అద్భుతమే జరిగింది.

### క్లిఫ్-హ్యాంగర్

ఐదు ఓవర్లు ముగిసే సమయానికి, భారతదేశం ఏడు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేయడం సానుకూలంగా కనిపించింది. ఆరంభంలో రెండు వికెట్లు పడ్డా, సౌత్ ఆఫ్రికా మాత్రం బలంగా రేసులోకి వచ్చింది. 15 ఓవర్లు పూర్తి అయ్యే సరికి మ్యాచ్ మొత్తం ప్రత్యర్థి చేతిలోకి వచ్చింది. 30 బంతుల్లోనే 30 పరుగులు చేస్తే కప్ ప్రోటీస్ జట్టుకు వెళ్లేది. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ చాలా కూల్ గా తన పని తాను చేసుకుపోయాడు. వర్షం పడాలనో... సూర్యరశ్మి తగ్గాలి అనో, గాలి బాగా వీయలనో అని కోరుకోలేదు.

### నో ఫస్ బుమ్రా

శనివారం మధ్యాహ్నం బ్రిడ్జిటౌన్‌లోని కెన్సింగ్టన్ ఓవల్‌లో, దక్షిణాఫ్రికా 30 బంతుల్లో 30 పరుగులు చేయాల్సి ఉన్న సమయంలో రోహిత్ బంతిని జస్ప్రీత్ బూమ్రాకు ఇచ్చాడు. భారత్ కు ఇప్పుడు పరుగుల నియంత్రణ, వికెట్లు కూడా అవసరం. అంతకుముందు ఓవర్ లో అక్షర్ పటేల్ బౌలింగ్ లో క్లాసెన్ ఆకాశమే హద్దుగా రెండు ఫోర్లు, రెండు సిక్స్ లతో 25 పరుగులు పిండుకున్నారు. ఆశలన్నీ బూమ్రాపైనే. మెల్లిగా, చిన్న రన్ అప్ తో తన శక్తి కొలది బౌలింగ్ చేస్తున్నాడు. ఆరు బంతులను ఆరు విధాలుగా సంధించాడు. బూమ్రా బౌలింగ్ లో పరుగుల సంగతి తరువాత ఇద్దరు క్రీజులో నిలదొక్కకోవడానికి ఇబ్బంది పడ్డారు. కేవలం నాలుగు పరుగులే ఇచ్చారు. ఇప్పుడు గెలువుకోసం 26 పరుగులు కావాలి. అది కూడా 24 బంతుల్లో..

### క్రంచ్ సమయం

రోహిత్ మదిలో మరో ప్రశ్న మెదులుతోంది. 17 ఓవర్ ఎవరి చేత వేయించాలి. ఐదో బౌలర్ గా జడేజా, హార్థిక్ పాండ్యా ఉన్నారు. కానీ క్రీజులో క్లాసెన్ ఉన్నాడు. కాబట్టి పాండ్యా చేతికి బాల్ ఇచ్చాడు. బంతిపై పాండ్యాకు సరిగా నియంత్రణ ఉందా? లేదా అని ఆలోచించలేదు. కానీ మంచి వైవిధ్యంతో బౌలింగ్ చేయగలడు. కెప్టెన్ అంచనాలకు అనుగుణంగా.. అనూహ్యంగా ఆఫ్ స్టంప్ ఆవలగా స్లో డెలివరీ సంధించాడు పాండ్యా. అది క్లాసెన్ బ్యాట్ ను తాకుతూ పంత్ చేతుల్లో పడింది. అంతే భారత్ గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఇక్కడ కేవలం నాలుగు పరుగులే వచ్చాయి. ఫలితం 18 బంతుల్లో 22 పరుగులు కావాలి.



### బుమ్రా చివరి ఓవర్..

హార్థిక్ బౌలింగ్ లో ప్రమాదకర క్లాసెన్ వెనక్కి వెళ్లాక మ్యాచ్ ఫిఫ్టి ఫిఫ్టి గా మారింది. కానీ 18 ఓవర్ ఎవరికివ్వాలి. బూమ్రాను దించాలా.. లేక అర్షదీప్ సింగ్ ను తీసుకురావాలని అని కాస్త ఆలోచించి ఉంటాడు. కొత్తగా వచ్చిన బ్యాట్స్ మెన్ పై ఒత్తిడి ఉండాలనే లక్ష్యంతో మరోసారి బూమ్రానే రంగంలోకి దించాడు కెప్టెన్.

అనుకున్నట్లుగానే ఈ ఓవర్ లో బూమ్రా రివర్స్ స్వింగ్ తో చుక్కలు చూయించాడు. ఆల్ రౌండర్ మార్కో యన్సన్ ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అయితే అప్పుడు ఉన్న ఒత్తిడి మాములుది కాదు. ఎంత గొప్ప బౌలర్ అయినా నియంత్రణతో కూడిన బౌలింగ్ వేయకపోతే మ్యాచ్ కాదు కప్పు కూడా చేజారిపోయే ప్రమాదం ఉంది. ఒక వేళ బూమ్రా 18 ఓవర్ లో తీసుకురావడం సరియైన నిర్ణయం కాకపోతే కెప్టెన్ పై నిందలు వేసేందుకు విమర్శకులు ఎప్పుడు సిద్ధంగా ఉండేవారు.

### మైండ్ గేమ్స్

ఆరు మ్యాజికల్ డెలివరీలు, రెండు పరుగులు, రివర్స్-స్వింగ్ తో మార్కో యన్సెన్ వికెట్ పడింది. భారత్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ఈ ఓవర్లో బూమ్రా విజృాఎంభణ తరువాత 20 పరుగులు 12 బంతుల్లో సాధించాలి. ఇదేం అసాధ్యం కాదు. కొంచెం ఏదో మూల ఆందోళన. మిల్లర్ ఏం చేస్తాడో ఏమో అని బెరుకు.

### 16 పరుగుల బహుమతి..

19 ఓవర్ లో మరో హీరో రంగ ప్రవేశం చేశాడు. అప్పటి దాకా మూడు ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు తీశాడు. కానీ ఇప్పుడు వేయబోయేది ప్రపంచంలోని అత్యుత్తమ ఆరుబంతులు అయి ఉండాలి. బంతి ఏ మాత్రం గతి తప్పిన బౌండరీ దాటించడానికి మిల్లర్ ఓ వైపు కాచుకుని ఉన్నాడు. కానీ ఏ బంతికా బంతి వైవిధ్యం అన్నట్లు సంధించిన ఈ యువ పేసర్.. కేవలం 4 పరుగులే ఇచ్చి 19 ఓవర్ ముగించాడు. ఇక చివరి ఓవర్.. ఆరు బంతులు..

### 16 పరుగులు. కానీ పాండ్యా దీన్ని ఢిపెండ్ చేస్తాడా?

పాండ్యా ఈ జట్టుకు వైస్ కెప్టెన్, ఇప్పుడు టి20 ల నుంచి రోహిత్ రిటైర్మెంట్ తర్వాత కచ్చితంగా కెప్టెన్. అతను ఓ బ్యాలెన్సర్, బ్యాట్‌తో డిస్ట్రాయర్. బంతిని సమర్ధవంతంగా నియంత్రణ చేయగలడా? కప్పును గెలిపిస్తాడా? ఓ సందేహం. ఆ అనుమానం నిజమై, ఆఫ్ స్టంప్ పక్కగా టాస్ బాల్ వేశాడు. క్రీజు లో ఉన్న మిల్లర్ దాన్ని మిడ్ ఆన్ లో గాల్లోకి లేపాడు.

బంతి బౌండరీ దాటినట్లు కామెంట్రీ వినిపిస్తోంది. కానీ అనూహ్యం... అద్భుతం.. స్కై సూర్య అదరగొట్టె విన్యాసంతో బంతిని పట్టుకుని నియంత్రణ కాలేక బౌండరీ లైన్ దాటేశాడు.. అంతకుముందే బంతిని గాల్లోకి విసిరాడు. తిరిగి మైదానంలోకి వచ్చి బంతిని పట్టుకున్నాడు. డేంజరస్ మిల్లర్ పెవిలియన్ చేరాడు.సూర్య వల్ల ఆరు పరుగులు సేఫ్ అయ్యాయి. ఇంకా విజయం చేకూరలేదు. ఐదు బంతుల్లో 16 పరుగులకు విజయ సమీకరణం మారింది. రబడ క్రీజులోకి వచ్చాడు. వచ్చిరాగనే ఒక థిక్ ఎడ్జ్ తో బంతి బౌండరీకి దూసుకెళ్లింది. నాలుగు బంతుల్లో 12 పరుగులు చేయాలి. కానీ మిగిలిన బంతుల్లో కేవలం మరో నాలుగు పరుగులు ఇచ్చిన పాండ్యా రబడను వెనక్కి పంపి, కప్ ను ఇండియా తెచ్చాడు. వాట్ ఏ అమేజింగ్ మ్యాచ్..

కోట్లాది భారతీయుల ఏళ్ళ నీరీక్షణ ఫలించింది. టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో టీమిండియాఅద్భుత విజయం సాధించింది. ఓ వైపు సంబరాలు జరుగుతున్నాయి. ఆటగాళ్ళు ఆనంద పారవశ్యంలో ఉన్నారు. ఒకరిని ఒకరు హత్తుకుంటూ అభినందనలు తెలువుకుంటూ మురిసిపోతున్నారు. సమయం చూసుకొని విషయం చెప్పేశాడు కింగ్ కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న అత్యుత్తమ ఆటగాడు టీ 20 ఫార్మెట్ క్రికెట్ కి సెలవు ప్రకటించేశాడు. ఇక కొత్త తరం రావాల్సిన సమయం ఆసన్నం అయింది అన్నాడు. తాను ఏం కోరుకున్నాడో అది సాధించానని చెప్పాడు. ఆ విషయం విని అభిమానులే కాదు తోటి ఆటగాళ్ళు కూడా ఆశ్చర్యపోయారు.

కోహ్లీ ప్రకటన నుంచి తెరుకొనేలోగానే రోహిత్ శర్మ ( ) బాంబ్ పేల్చాడు. తను కూడా అదే నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించాడు. దక్షిణాఫ్రికాతో బార్బడోస్‌లో జరిగిన ఫైనల్ ఫైట్ లో విజయం సాధించిన తరువాత రోహిత్ మాట్లాడుతూ ఈ ప్రకటన చేశాడు. టీ20ల నుంచి సెలవు తీసుకొనేందుకు ఇంతకన్నా మంచి సమయం లేదన్నాడు. రిటైర్మెంట్ ప్రకటన వల్ల మాటలు రావటం లేదంటూ ఎమోషనల్ అయ్యాడు హిట్ మ్యాన్. మొత్తానికి దేశాన్ని విశ్వ విజేతగా నిలిపిన ఇద్దరు మొనగాళ్ళు ఆడే రోజు ఆటకు వీడ్కోలు చెప్పి జూన్ 29 వ తేదీని చరిత్రలో గుర్తుండిపోయేలా చేశారు.మొత్తం అసలు క్రికెట్ కెరియర్లో ఈ ఇద్దరు ఒకరికి ఒకరు అండగా నిలబడిన విధానం, మానసిక ధైర్యాన్ని ఇచ్చి వుచ్చుకున్న తీరు వారి స్నేహాన్ని బయటపెడుతుంది. స్నేహం అంటే కలిసి తిరగడం తినడం కాదు. ఒకరికి ఒకరు తెలువుకొనే మద్దతు . కెప్టెన్ గా ఉన్నా, ఆటగాడినా మిగిలినా ఇద్దరి మధ్యా ఎక్కడా ఆధిపత్య ధోరణి కనిపించకపోవటం ఈ జంట లో ప్రత్యేకత. ఒకరు నాయకత్వంలో మరొకరు ఫెయిల్ అయినప్పుడు, విమర్శలు వచ్చినప్పుడు ఒకరి మీద ఒక సింపతీ చూపించుకోలేదు. ఒకరి మీద ఒకరు అవకాశం దొరికింది కదా అని ఆధిపత్యం చూపించలేదు. ఒకరికొకరు అండగా నిలబడ్డారు. రోహిత్ ని తీసేయచ్చుగా అని ఓ ప్రెస్మీట్ లో అడిగిన వారికి కోహ్లీ ఇచ్చిన జవాబు ఇప్పటకీ వైరల్ గానే ఉంది. ఇక టీ 20 వరల్డ్ కప్ లో కోహ్లీ ఫెయిలైతే బలాన్ని దాచుకుంటున్నాడు అంటూ సరదాగా నవ్వేసిన రోహిత్ తెలుసు మనకి. ఇద్దరి మధ్య అస్సలు అండర్స్టాండింగ్ లేదు, ఒకరంటే ఒకరికి పడదు. వీళ్ళిద్దరు ఒకే లక్ష్యంతో లేరని, వారి దారులు వేరని మాట వచ్చినప్పుడు ఆ ఇద్దరు నవ్వుకొనే ఉంటారు. అలా ఇద్దరు సమఉజ్జీలు ఒకరికొకరు మద్దతుగా నిలబడటమే ఈ జట్టును విశ్వవిజేత గా నిలిపింది. ఈ ఇద్దరూ కలిసి చేసిన సందడి, దిగిన ఫోటోలు భావోద్వేగపు కౌగిలింతలు, హ్యాపీ మూమెంట్స్ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.





## 2007 నుండి 2024 వరకు టి 20 ప్రపంచ కప్ విజేతల జాబితా



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 క్రికెట్ ప్రపంచ కప్ ప్రతి రెండు సంవత్స రాలకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే ప్రతిష్టాత్మక గ్లోబల్ టోర్న మెంట్. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వురుషుల టి20 ప్రపంచ కప్ యొక్క ప్రారంభ ఎడిషన్ 2007లో దక్షిణాఫ్రికాలో జరిగింది, భారతదేశం విజేతగా నిలిచింది. వురుషుల అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి 20 క్రికెట్ ప్రపంచ కప్ 2024 ఎడిషన్ ప్రస్తుతం యుఎస్ఏమరియు వెస్టిండీస్‌లలో జూన్ 2వ తేదీ నుండి జూన్ 29వ తేదీ వరకు కొనసాగుతోంది. 2007 నుండి 2024 వరకు టి20 ప్రపంచ కప్ విజేతల సమగ్ర జాబితా ఓ సారి పరిశీలిస్తే...

1 2007 దక్షిణాఫ్రికా వాండరర్స్ స్టేడియం, జోహన్నెస్‌బర్గ్ ఇండియా 157/5 (20 ఓవర్లు) భారత్ 5 పరుగుల తేడాతో పాక్ గెలిచింది
152 ఆలౌట్ (19.4 ఓవర్లు) 12 ఎంఎస్ ధోని

2 2009 ఇంగ్లాండ్ లార్డ్స్, లండన్ పాకిస్తాన్ 139/2 (18.4 ఓవర్లు) పాకిస్తాన్ 8 వికెట్ల తేడాతో శ్రీలంక గెలిచింది 138/6 (20 ఓవర్లు) 12 యూనిస్ ఖాన్

3 2010 వెస్టిండీస్ కెన్సింగ్టన్ ఓవల్, బ్రిడ్జ్‌టౌన్ ఇంగ్లాండ్ 148/3 (17 ఓవర్లు) ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలిచింది
147/6 (20 ఓవర్లు) 12 పాల్ కాలింగ్‌వుడ్

4 2012 శ్రీలంక ప్రేమదాస స్టేడియం, కొలంబో వెస్ట్ ఇండీస్ 137/6 (20 ఓవర్లు) వెస్టిండీస్ 36 పరుగుల తేడాతో శ్రీలంక గెలిచింది
101 ఆలౌట్ (18.4 ఓవర్లు) 12 డారెన్ సమీ

5 2014 బంగ్లాదేశ్ షేర్-ఎ-బంగ్లా స్టేడియం, ఢాకా శ్రీలంక 134/4 (17.5 ఓవర్లు) శ్రీలంక 6 వికెట్ల తేడాతో భారత్ గెలిచింది 130/4 (20 ఓవర్లు) 16 లసిత్ మలింగ

6 2016 ఇండియా ఈడెన్ గార్డెన్స్, కోల్‌కతా వెస్టిండీస్ 161/6 (19.4 ఓవర్లు) వెస్టిండీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ గెలిచింది 155/9 (20 ఓవర్లు) 16 డారెన్ సమీ

7 2021 యుఏఈ ఒమన్ దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం, దుబాయ్ ఆస్ట్రేలియా 173/2 (18.5 ఓవర్లు) ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గెలిచింది
172/4 (20 ఓవర్లు) 16 ఆరోన్ ఫించ్ 8 2022 ఆస్ట్రేలియా మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్, మెల్బోర్న్ ఇంగ్లాండ్ 138/5 (19 ఓవర్లు) ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది 137/8 (20 ఓవర్లు) 16 జోస్ బట్లర్

9 2024 వెస్టిండీస్ యునైటెడ్ స్టేట్స్ కెన్సింగ్టన్ ఓవల్, బ్రిడ్జ్‌టౌన్ ఇండియా 176/7 (20) దక్షిణాఫ్రికాపై భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది 169/8(20) 20 రోహిత్ శర్మ



# కన్నీటితో కోహ్లీ వీడియో కాల్..కొడుకుతో సంబరాలు

టీ20 ఫార్మాట్‌కు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్ టీ20 వరల్డ్ కప్ గెలిచిన అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించాడు. ఫైనల్‌లో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న సమయంలో కోహ్లీ మాట్లాడుతూ.. పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. భవిష్యత్ తరానికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో టీ20లకు గుడ్‌బై చెప్పాడు. అయితే విజయానంతరం విరాట్ కోహ్లీ భావోద్వేగానికి గురయ్యాడు. ఆటగాళ్లతో కలిసి సంబరాలు చేసుకున్న అనంతరం తన ఫ్యామిలీకి వీడియో కాల్ చేశాడు.

కాల్‌లో తన భార్య అనుష్క శర్మ, కుమార్తె వామిక, కుమారుడు అయాన్‌తో మాట్లాడాడు. కాల్ మాట్లాడుతున్న సమయంలో కోహ్లీ కళ్లలో తడి కనిపించింది. ప్రపంచకప్ గెలిచిన ఆనందం, టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై పలికిన బాధ కలయికతో కోహ్లీ ఎమోషలన్ అయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, కోహ్లీ ఈ ప్రపంచకప్‌లో తొలి ఏడు మ్యాచ్‌ల్లో 75 పరుగులు చేశాడు. కీలక ఫైనల్‌లో మాత్రం 76 పరుగులు బాదాడు.

## రిటైర్మెంట్ ప్రకటించిన
# రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా




టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సైతం అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బాటలోనే పొట్టి ఫార్మాట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం ముందుగా విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. భవిష్యత్తు తరాల కోసం అంతర్జాతీయ టీ20ల నుంచి తప్పుకుంటున్నానని తెలిపాడు. ఆ కొద్ది సేపటికే విరాట్ కోహ్లీని అనుసరిస్తూ రోహిత్ శర్మ కూడా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. శనివారం ఉత్కంఠగా సాగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా 7 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. 11 ఏళ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు తెరదించింది. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న రోహిత్ శర్మ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. 2007 టీ20 ప్రపంచకప్తో అంతర్జాతీయ క్రికెట్లోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్ శర్మ.. 17 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలికాడు. ఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ(59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 76) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. అక్షర్ పటేల్(31 బంతుల్లో ఫోర్, 4 సిక్సర్లతో 47)కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

భారత జట్టులో మరో స్టార్ ప్లేయర్ రిటైర్మెంట్ బాట పట్టాడు. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలుకుతున్నట్లు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ప్రకటించాడు. గత 24 గంటల వ్యవధిలో టీ20లకు గుడ్‌బై పలికిన మూడో భారత ప్లేయర్ జడేజా! టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన అనంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై అంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా 35 ఏళ్ల రవీంద్ర జడేజా ఆదివారం ప్రకటించాడు. టీ20 ప్రపంచకప్ గెలిచి తన కలను నెరవేర్చుకున్నాని భావోద్వేగంతో జడ్డూ పోస్ట్ పెట్టాడు. "కృతజ్ఞతతో నిండిన హృదయంతో అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలుకుతున్నాను. పొగరుతూ దూసుకెళ్లే గుర్రంలా నేనెప్పుడూ దేశం కోసం నా అత్యుత్తమ ఆటనే అందించాను.

అదే జోరును ఇతర ఫార్మాట్లలో కొనసాగిస్తాను. టీ20 వరల్డ్ కప్‌ను అందుకోవాలనుకున్న నా కల నెరవేరింది. ఇది నా టీ20 కెరీర్‌లో అత్యున్నత దశ. ఎన్నో జ్ఞాపకాలు అందించినందుకు, మద్దతు కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు" అని జడేజా పేర్కొన్నాడు. ఈ టీ20 వరల్డ్ కప్‌లో జడేజా అన్ని మ్యాచ్‌లు ఆడాడు. తన స్థాయికి తగిన ప్రదర్శన చేయలేనప్పటికీ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. మెరుపు ఫీల్డింగ్‌తో, బ్యాటుతో భారత్ ఛాంపియన్‌గా నిలవడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌లో తొమ్మిది బంతుల్లో అజేయంగా 17 పరుగులు చేశాడు. ఆఖర్లో జడ్డూ చేసిన ఈ పరుగులు విజయంలో ప్రధాన పాత్ర పోషించాయి. అయితే ఈ మెగాటోర్నీలో బంతితో జడేజా ఆకట్టుకోలేకపోయాడు. ఒక్క వికెట్ మాత్రమే సాధించాడు. ఇక భారత్ తరఫున 2009లో అరంగేట్రం చేసిన జడేజా 74 టీ20లు ఆడాడు. 41 ఇన్నింగ్స్‌ల్లో 21 సగటుతో 515 పరుగులు చేశాడు. అలాగే 54 వికెట్లు పడగొట్టాడు.



# హార్ట్ బీట్ పెరిగింది

## నా కోసమేనా స్పెషల్ గిఫ్ట్ : ధోనీ



భారత్ విశ్వవిజేతగా నిలిచింది. టీ20 వరల్డ్ కప్-2024 ఛాంపియన్‌గా అవతరించింది. 13 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రపంచకప్ నిరీక్షణకు తెరదించుతూ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. బార్బడోస్ వేదికగా నరాలు తెగే ఉత్కంఠభరితంగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో టీమిండియా ఏడు పరుగుల తేడాతో గెలిచి టైటిల్ సాధించింది. అయితే సౌతాఫ్రికా విజయానికి ఆఖరి అయిదు ఓవర్లలో 30 పరుగులే అవసరం. సఫారీ జట్టు చేతిలో ఇంకా ఆరు వికెట్లు ఉండటం.. క్రీజులో క్లాసెన్, మిల్లర్ కూడా ఉండటంతో విజయంపై భారత్ ఆశలు సన్నగిల్లాయి. కానీ బుమ్రా, హార్దిక్, అర్షదీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ప్రత్యర్థిని చిత్తుచేస్తూ జగజ్జేతగా టీమిండియాను నిలిపారు. 2007 తర్వాత భారత్ మరోసారి టీ20 ప్రపంచకప్ అందుకుంది. ఈ నేపథ్యంలో తొలి టీ20 కప్‌ను దేశానికి అందించిన భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. ఉత్కంఠ పోరులో ప్రశాంతతో ఉంటూ విజయాన్ని అందుకున్న టీమిండియాను ధోనీ కొనియాడాడు.

## రోహిత్ స్థానంలో శుభ్‌మన్ గిల్‌కు
# టీమిండియా కెప్టెన్సీ అప్పగించాల

టీ20 వరల్డ్ కప్-2024 భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. వన్డే వరల్డ్ కప్‌ను తృటిలో చేజార్చుకుని పగిలిన గుండెతో బరిలోకి దిగిన భారత ఆటగాళ్లు ఈసారి పొట్టికప్‌ను మిస్ చేయలేదు. టోర్నీ ఆద్యంతం విజయాలతో హోరెత్తిస్తూ జగజ్జేతగా నిలిచారు. అయితే ఫైనల్‌లో ఓ దశలో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. కానీ అద్భుత పోరాటంతో అంతిమంగా విజేతగా నిలిచారు. ఆఖరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో నెగ్గారు.కాగా, వరల్డ్ కప్ గెలిచిన అనంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించారు. భవిష్యత్ తరాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో విజయానంతరం తమ నిర్ణయాన్ని వెల్లడించారు. అయితే టీ20ల్లో రోహిత్ స్థానాన్ని భర్తీ చేసే భారత్ కెప్టెన్ ఎవరనే చర్చ మొదలైంది. రో'హిట్' కెప్టెన్సీని కొనసాగించే వారసుడు ఎవరనే ఉత్కంఠ అందరిలో కొనసాగుతోంది.

మరికొన్నాళ్లలో రోహిత్ వన్డే, టెస్టులకు గుడ్‌బై పలికే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో



నయా సారథిని భారత్ సిద్ధం చేసుకోవాల్సి ఉంది. అయితే రోహిత్‌కు స్టాండ్‌బై కెప్టెన్‌గా హార్దిక్ పాండ్య గత కొన్నాళ్లుగా చిన్నచిన్న సిరీస్‌లకు నాయకత్వం వహించాడు. కాగా, కెప్టెన్సీ రేసులో హార్దిక్‌తో పాటు జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ కూడా ఉన్నారు. రోహిత్, హార్దిక్ గైర్హాజరీలో బుమ్రా, సూర్య కూడా జట్టును నడిపించారు. ఈ నేపథ్యంలో హార్దిక్‌కు సారథి బాధ్యతలు దక్కుతాయా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. అయితే భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్.. హార్దిక్‌కు మద్దతు ఇవ్వలేదు. టీ20ల్లో యువ ప్లేయర్ శుభ్‌మన్ గిల్‌కు టీమిండియా కెప్టెన్సీ అప్పగించాలని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు.

సీనియర్ క్రికెటర్లంతా టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనడంతో, జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేసిన భారత జట్టుకు గిల్ కెప్టెన్సీ వహించనున్న విషయం తెలిసిందే. అయితే భవిష్యత్‌లో కూడా భారత రెగ్యులర్ కెప్టెన్‌గా రోహిత్ అనంతరం గిల్‌కే బాధ్యతలు ఇవ్వాలని సెహ్వాగ్ అన్నాడు. 'గిల్కు సుదీర్ఘంగా కెరీర్ ఉంది. అతను మూడు ఫార్మాట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. గతేడాది గొప్పగా పరుగుల వరద పారించాడు. దురదృష్టవశాత్తు టీ20 వరల్డ్ కప్-2024కు దూరమయ్యాడు. నా పరంగా.. గిల్ను భారత కెప్టెన్గా చేయడమే సరైన నిర్ణయం. అన్ని ఫార్మాట్లకు రోహిత్ శర్మ గుడ్బై చెప్పిన వేళ సారథి స్థానాన్ని గిల్తో భర్తీ చేయాలి" అని సెహ్వాగ్ పేర్కొన్నాడు.

# కోహ్లీ వల్లే ఈ విజయం

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అసాధారణ ప్రదర్శనతోనే విజయం సాధించామని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. క్లిష్ట పరిస్థితుల్లో కోహ్లీ తన అనుభవాన్ని ఉపయోగించి ఆడాడని కొనియాడాడు. శనివారం హోరాహోరీగా సాగిన టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో సమష్టిగా రాణించిన టీమిండియా 7 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఈ గెలుపుతో రెండోసారి టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యాలపై ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లీ, అక్షర్ పటేల్ బ్యాటింగ్లో సత్తా చాటితే బుమ్రా, హార్దిక్ పాండ్యా బౌలింగ్లో రాణించారని కొనియాడాడు. ఈ విజయాన్ని గత 3-4 ఏళ్లుగా తాము పడుతున్న కష్టానికి దక్కిన ఫలితంగా రోహిత్ శర్మ అభివర్ణించాడు. గత నాలుగేళ్లలో తమ జట్టు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొందని, తీవ్ర ఒత్తిడితో కూడుకున్న ఎన్నో మ్యాచ్‌లు ఆడిందని చెప్పాడు. కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలు కూడా ఎదురయ్యాయని గుర్తు చేసుకున్నాడు. తాజా టోర్నీలో సమష్టిగా రాణించి విజయం సాధించామని చెప్పాడు.

ఈ విజయం వెనుక టీమ్‌మేనేజ్‌మెంట్‌తో పాటు సపోర్ట్ స్టాఫ్ కష్టం ఎంతో ఉందని రోహిత్ తెలిపాడు. ఈ టోర్నీలో అసాధారణ ప్రదర్శన కనబర్చామని, తమ ఆటగాళ్ల ఆటతీరు పట్ల గర్వంగా ఉందన్నాడు.'విరాట్ కోహ్లీ ఫామ్‌పై నాతో పాటు జట్టులోని ఏ ఒక్కరికి సందేహం




లేదు. అతని క్వాలిటీ స్కిల్స్ గురించి మాకు బాగా తెలుసు. గత 15 ఏళ్లుగా అతను టాప్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఇలాంటి పెద్ద మ్యాచ్‌ల్లో పెద్ద ప్లేయర్లు జట్టు కోసం నిలబడుతారు. ఓవైపు నిదానంగా ఆడుతూ కోహ్లీ ఆడిన ఇన్నింగ్స్ మాకు చాలా కీలకమైంది.

ఇవి దూకుడు ఆడే పిచ్‌లు కాకపోవడంతో ఎవరో ఒక్కరు మ్యాచ్ అసాంతం క్రీజులో ఉండాలని మేం భావించాం. వరుసగా వికెట్లు కోల్పోవడంతో స్వేచ్ఛగా ఆడే పరిస్థితిని కోల్పోయాం. దాంతో ఒకరు ఆచితూచి ఆడాలనుకున్నాం. ఆ బాధ్యతను కోహ్లీకి అప్పజెప్పాం. అతను తన అనుభవాన్ని ఉపయోగించి సమర్థవంతంగా తన బాధ్యతను నిర్వర్తించాడు. అతని అండతో ఇతర ఆటగాళ్లు చెలరేగారు. ముఖ్యంగా అక్షర్ పటేల్ చేసిన 47 పరుగులు మాకు చాలా కీలకమయ్యాయి. బుమ్రా, హార్దిక్ పాండ్యా సైతం జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. చివరి ఓవర్‌ను హార్దిక్ పాండ్యా అద్భుతంగా వేసాడు. ఈ రోజు మేం సాధించిన విజయానికి, మా జట్టు ఆటతీరుకు గర్వపడుతున్నా. కోట్ల మంది భారతీయులకు ఈ విజయం సంతోషాన్నిచ్చిందని భావిస్తున్నా'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

## భవిష్యత్తు తరానికి అవకాశం ఇవ్వాలనే
# టీ20ల నుంచి తప్పుకుంటున్నా




టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. భవిష్యత్తు తరాలకు అవకాశం ఇవ్వాలనే తాను అంతర్జాతీయ టీ20ల నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశాడు. శనివారం ఉత్కంఠగా సాగిన టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో టీమిండియా 7 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. ఈ మ్యాచ్లో విరాట్ కోహ్లీ(59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 76) అసాధారణ బ్యాటింగ్తో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలిచాడు. ఈ అవార్డ్ అందుకున్న అనంతరం మాట్లాడిన విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. 'ఇది నా చివరి టీ20 ప్రపంచకప్. మేం సాధించాలనుకున్నది కూడా ఈ విజయమే. ఆ దేవుడు చాలా గొప్పవాడు. కీలక మ్యాచ్‌లో జట్టును గెలిపించే అవకాశాన్ని నాకిచ్చాడు. ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదు. భారత్ తరఫున ఇదే నా చివరి టీ20 మ్యాచ్. ప్రపంచకప్ గెలవాలని మేం అనుకున్నాం. అలాగే సాధించాం. అంతర్జాతీయ టీ20ల నుంచి నేను తప్పుకోవాలనుకుంటున్నది అందరికి తెలిసిన విషయమే. ఒకవేళ ఈ ఫైనల్లో ఓడినా నేను రిటైర్మెంట్ ప్రకటించేవాడిని. భవిష్యత్తు తరానికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఐపీఎల్లో కుర్రాళ్లు అద్భుతాలు చేస్తున్నారు.

వాళ్లు భారత జెండాను రెపరెపలాడిస్తారనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మేం ఐసీసీ టైటిల్ గెలిచాం. నాకు ఒక్కడికే కాదు. రోహిత్ 9 టీ20 ప్రపంచకప్లు ఆడాడు. నేను 6 టోర్నీలే ఆడాను. ఈ విజయానికి రోహిత్ పూర్తి అర్హుడు. ఎట్టకేలకు ఐసీసీ టైటిల్ గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. కొన్ని మ్యాచ్లో నేను విఫలమయ్యాను. నా ఆత్మవిశ్వాసం కూడా సన్నగిల్లింది. కానీ ఆ దేవుడు దయ వల్ల కీలక మ్యాచ్లో రాణించగలిగాను.'అని విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు. ప్రపంచకప్ ఫైనల్లో 34 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన భారత జట్టును విరాట్ కోహ్లీ.. అక్షర్ పటేల్తో కలిసి ఆదుకున్నాడు. నాలుగో వికెట్కు 72 పరుగులు జోడించి భారీ స్కోర్ అందించాడు.

## రోహిత్-కోహ్లీ వన్డే, టెస్టు ఫార్మాట్‌లో
# ఇంకా కొనసాగండి

టీ20 వరల్డ్ కప్-2024 ఛాంపియన్‌గా భారత్ అవతరించింది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి 13 ఏళ్ల ప్రపంచకప్ నిరీక్షణకు టీమిండియా తెరదించింది. గెలుపు ఆశలు లేని స్థితి నుంచి అద్భుతంగా పోరాడి జగజ్జేతగా నిలిచింది. నరాలు తెగే ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది.మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 176 పరుగులు చేసింది. అయితే ఫైనల్ అనంతరం స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. భవిష్యత్ తరానికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దశాబ్ద కాలం పాటు భారత విజయాల్లో ఈ ఇద్దరూ కీలక పాత్రను పోషించారు. అన్నిఫార్మాట్లలో భారత బ్యాటింగ్‌కు మూలస్తంభాలుగా సేవలు అందించారు. అలాంటి ఈ ఇద్దరు ఒకేసారి పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై పలకడంతో



ప్రపంచకప్ గెలిచిన ఆనందంతో పాటు తమ ఫేవరేట్ ప్లేయర్లను టీ20ల్లో చూడలేమనే బాధ అభిమానుల్లో వెంటాడుతోంది. కాగా, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ గురించి భారత మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. ప్రపంచకప్ గెలిచిన అనంతరం వీడ్కోలు పలకడం కంటే మరో గొప్ప ముగింపు ఉండదని అన్నాడు. అయితే వన్డే, టెస్టు ఫార్మాట్‌లో వారిద్దరు మరికొన్నాళ్లు కొనసాగాలని అన్నాడు. వన్డే, సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టు విజయాల్లో తమ పాత్ర పోషించడం కొనసాగించాలని పేర్కొన్నాడు. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ అయ్యారు. ఇంతకంటే గొప్ప ముగింపు కథ మరొకటి ఉండదు. అయితే టెస్టు, వన్డే ఫార్మాట్లలో వాళ్లు కొనసాగనున్నారు. ఈ ఫార్మాట్లలో దేశం కోసం, జట్టు కోసం కీలక పాత్రను కొనసాగిస్తారని ఆశిస్తున్నాను అని గంభీర్ అన్నాడు.

## ప్రపంచకప్ ట్రోఫీకి
# రాహుల్ ద్రవిడే అర్హుడు



భారత్ జగజ్జేతగా నిలిచింది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి టీ20 వరల్డ్ కప్ సాధించింది. 13 ఏళ్ల ప్రపంచకప్, 11 ఏళ్ల ఐసీసీ టోర్నీ నిరీక్షణకు తెంపడింది. కాస్త ఆలస్యమైనా చరిత్రలో నిలిచేలా తుదిపోరులో టీమిండియా విజయం సాధించింది. గెలుపు ఆశలు లేని స్థితి నుంచి అద్భుతంగా పోరాడింది. నరాలు తెగే ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా, విజయానంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడాడు. అందరి కంటే తమ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రపంచకప్ ట్రోఫీకి అసలైన అర్హుడు అని అన్నాడు. రెండు దశాబ్దాలకు పైగా భారత క్రికెట్కు ద్రవిడ్ సేవలందించాడని తెలిపాడు. "ప్రపంచకప్ ట్రోఫీకి అందరి కంటే రాహుల్ ద్రవిడే అర్హుడు. గత 20-25 ఏళ్లు భారత క్రికెట్ అతనెంతో చేశాడు. అయితే అతని ఖాతాలో అంతకుముందు ప్రపంచకప్ ఒక్కటి మిస్ అయ్యింది. ఇప్పుడు సంపూర్ణం అయ్యింది. "ద్రవిడ్ కోసం దీన్ని సాధించిందుకు జట్టు మొత్తం సంతోషంగా ఉంది. ఇక ద్రవిడ్ ఎంతో ఉత్సాహంగా, గర్వంగా ఉన్నారో మీరు చూశారు!" అని రోహిత్ శర్మ అన్నాడు. సాధారణంగా భావోద్వేగాలను నియంత్రించుకునే రాహుల్ ద్రవిడ్ ఫైనల్లో విజయం అనంతరం ఎమోషనల్ అయ్యాడు. మైదానంలోకి వచ్చి ఆటగాళ్లతో సంబరాల్లో తేలిపోయాడు.ప్రపంచకప్ అందుకుని గట్టిగా అరుస్తూ ఉద్వేగాన్ని బయటపెట్టాడు. 2021 నవంబర్లో టీమిండియా కోచ్ బాధ్యతలు అందుకున్న ద్రవిడ్ గత టీ20 ప్రపంచకప్లో సెమీస్కు,గత వన్డే వరల్డ్ కప్లో ఫైనల్కు జట్టును చేర్చడం కీలకపాత్ర పోషించాడు. కోచ్గా భారత్ వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్కు కూడా చేర్చాడు.

# మోడీకి వరలక్ష్మి పెళ్లిపిలుపు



నటి వరలక్ష్మి శరత్ కుమార్ నెల రోజులుగా పెళ్లి పనుల్లో బిజీ బిజీగా గడుపుతోన్న సంగతి తెలిసిందే. స్వయంగా తానే పెళ్లి కార్డులను పంపిణీ చేస్తోంది. ఇప్పటికే టాలీవుడ్ సెలబ్రిటీలందర్నీ కవర్ చేసింది. స్టార్ హీరోలు, డైరెక్టర్లు, నిర్మాతలు అందర్నీ కలిసి స్వయంగా కార్డులు అందజేసింది. తప్పకుండా రిసెప్షన్ కు రావాలని ఆహ్వానించింది. ఆ ఫోటోలు నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇంత వరకూ ఏ నటి కూడా ఇలా స్వయంగా హాజరై కార్డులు పంపిణీ చేసింది లేదు. అందులో టాలీవుడ్ లోనూ అందర్నీ కవర్ చేసి ఇవ్వడం అన్నది వరలక్ష్మి ప్రత్యేకతే అనే చెప్పాలి. మరోవైపు కుమార్తె కోసం తండ్రి శరత్ కుమార్ కూడా చెన్నైలో ఉండి తాను చేయాల్సిన పనులన్నీ చేస్తున్నారు. కోలీవుడ్ ఇండస్ట్రీని ఆయన కవర్ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమైన వారంద రికీ స్వయంగా ఆయనే వెడ్డింగ్ కార్డులు అందజేసారు. తాజాగా వరలక్ష్మి శరత్ కుమార్ కుటుంబ సభ్యులు ఏకంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసారు. వధువు వరలక్ష్మి-వరుడు నికోలయ్ సచ్ దేవ్, శరత్ కుమార్, రాధిక నలుగురు మోదీని కలిసి కార్డు అందిం చారు. అయితే ప్రధాని అంత బిజీ షెడ్యూల్‌లోనూ వాళ్లకు సమయం ఇవ్వడంతో కుటుంబ సభ్య లంతా సంతోషం వ్యక్తం చేసారు. మోదీకి ధన్యవాదాలు తెలియజేసారు.

# కల్కి రికార్డ్స్

ప్రభాస్ 'కల్కి2898 ఎడి' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. వరుసగా రెండవ రోజు కూడా మంచి వసూళ్లను రాబట్టింది. రెండో రోజు తెలుగులో రూ.25.65 కోట్లు, హిందీలో రూ.22.5 కోట్లు వసూలు చేసింది. డే 2 ఇండియాలో మొత్తం రూ.149.3 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. స్టార్ కాస్ట్ ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె ప్రధాన పాత్రలో నటిం చిన మోస్ట్ యాంటిసిపేటెడ్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. ఫిల్మ్ క్రిటిక్, ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ప్రకారం 'కల్కి 2898 ఏడీ' తొలిరోజు హిందీలో 27.5 కోట్లు వసూలు చేయగా, వరల్డ్ వైడ్‌గా రూ.190 కోట్లు వసూలు చేసింది. భారతదేశంలో మొత్తం రూ .95 కోట్లు వసూలు చేసింది.



**కల్కి డే 2 కలెక్షన్స్**

ఇక రెండో రోజు కూడా భారీ వసూళ్లను రాబట్టింది కల్కి. రెండవ రోజు కలెక్షన్ విషయానికొస్తే.. రూ.54 కోట్లు కలెక్ట్ చేసినట్లు సెక్నిక్ రిపోర్ట్ తెలిపింది. తెలుగులో రూ.25.65 కోట్లు, హిందీలో రూ.22.5 కోట్లు వసూలు చేసింది. 'కల్కి 2898 ఏడీ' డే 2 ఇండియాలో మొత్తం రూ.149.3 కోట్లు వసూలు చేసింది. ఇందులో అత్యధికంగా తెలుగు వెర్షన్ రూ.91.45 కోట్లు రాబట్టింది. ఆ తర్వాత హిందీలో 45 కోట్లు రాబట్టింది.

**బాహుబలి, కేజీఎఫ్ రికార్డ్స్ బ్రేక్**

కల్కి ఫస్ట్ డే కలెక్షన్స్ కేజీఎఫ్, బాహుబలి1,సాహో, జవాన్ తో సహా పలు పెద్ద సినిమాల రికార్డులను బ్రేక్ చేసింది. ఈ చిత్రం రెండు రోజుల్లో ప్రపంచ బాక్సాఫీస్ వద్ద రూ 250 కోట్లకు పైగా వసూలు చేసి రికార్డు సృష్టించింది. ఇదే జోరు కొనసాగితే ఈ సినిమా 'పఠాన్', 'జవాన్', 'జైలర్', బాహుబలి వంటి చిత్రాల రికార్డులను బద్దలు కొట్టడం ఖాయం.

# యానిమాల్ తరహా 'జాట్'

నందమూరి బాలకృష్ణ తో వీరసింహా రెడ్డి సినిమాను రూపొందించి సూపర్ హిట్ ను దక్కించుకున్న దర్శకుడు గోపీచంద్ మలినేని వెంటనే మరో సినిమాను చేయాలని భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల చాలా ఆలస్యం అయ్యింది. దాదాపు ఏడాది పాటు జరిపిన చర్చల తర్వాత చివరకు బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ తో సినిమా మొదలు పెట్టాడు. టాలీవుడ్ హీరోతో మొదట ఈ సినిమాను చేయాలని భావించినా కూడా బడ్జెట్ విషయంలో కాస్త ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని భావించి ఆ సినిమా క్యాన్సల్ చేశారు. గదర్ 2 సినిమా తో సూపర్ హిట్ ను దక్కించుకున్న సన్నీ డియోల్ తో తన కథ ను సినిమాగా చేయాలని దర్శకుడు గోపీచంద్ మలినేని భావించాడు. పాన్ ఇండియా రేంజ్ లో సన్నీ డియోల్ మరియు గోపీచంద్ మలినేని కాంబో మూవీ రూపొందబోతుందట. తాజాగా ఈ సినిమాకు 'జాట్' అనే విభిన్నమైన టైటిల్ ను ఖరారు చేసినట్లుగా సమాచారం అందుతోంది. అతి త్వరలోనే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా టైటిల్ తో పాటు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. వయసుకు తగ్గ పాత్రలో సన్నీ డియోల్ పాత్రలో కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ వారు ఈ సినిమా ను హిందీ సినిమాగా నిర్మిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ అరుదైన కలయిక మూవీని ఇదే ఏడాదిలో విడుదల చేస్తారనే సమాచారం.



# ప్రభాస్..స్పిరిట్ మార్చాల్సిందే?

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన పాన్ వరల్డ్ మూవీ కల్కి 2898ఏడీ థియేటర్స్‌లోకి వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అద్భుతమైన కలెక్షన్స్‌తో ఈ మూవీ దూసుకుపోతోంది. వీకెండ్ పూర్తయ్యేనాటికి 500o కోట్లు కలెక్షన్స్ సాధించడం గ్యారెంటీ అనే మాట ట్రేడ్ పండితుల నుంచి వినిపిస్తోంది. ఇదిలా ఉంటే కల్కి మూవీ వైబ్ కనీసం రెండు వారాల పాటు నడిచే అవకాశం ఉంది. దీని తర్వాత ప్రభాస్ సందీప్‌రెడ్డివంగా దర్శకత్వంలో స్పిరిట్ మూవీ చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాదిలోనే మూవీ షూటింగ్ స్టార్ట్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. కల్కి సినిమా సూపర్ హిట్ దిశగా దూసుకుపోతూ ఉండటంతో సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ పైన కూడా అంచనాలు పెరిగాయి. యానిమల్ సినిమాతో సందీప్ రెడ్డి వంగా గత ఏడాది బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. %ూశ్రీంశీ =ఝఎ% - కల్కి.. ఇక్కడే కాదు.. హాలీవుడ్ వాళ్లు కూడా! దీంతో స్పిరిట్ మూవీకి కూడా సందీప్ రెడ్డివంగా కచ్చితంగా బెస్ట్ అవుట్ ఇస్తాడని డార్లింగ్ ఫ్యాన్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. ఈ చిత్రాన్ని టి-సిరీస్, సందీప్ రెడ్డి వంగా కలిసి నిర్మించబోతున్నారు. డార్లింగ్ ప్రభాస్ కెరియర్ ఇప్పటి వరకు చేయనటువంటి పోలీస్ ఆఫీసర్ రోల్ ని స్పిరిట్ చిత్రంలో చేయబోతున్నాడు. కథ కూడా చాలా పవర్ ఫుల్‌గా ఉంటుందంట. సందీప్ రెడ్డి సినిమాలలో హీరో క్యారెక్టరైజేషన్ చాలా వైలెంట్ గా ఉంటుంది. స్పిరిట్ మూవీలో కూడా ప్రభాస్ పాత్ర అలాగే ఉండబోతోందంట. రీసెంట్‌గా సందీప్ రెడ్డి, ప్రభాస్ మీట్ అయ్యారంట. ఈ సందర్భంగా సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ నుంచి డిస్కషన్ జరిగినట్లు తెలుస్తోంది.





# అమితాబ్‌ని సరిగ్గా వాడింది వారే

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ మూవీ 'కల్కి 2898 ఎడి'. గురువారం వరల్డ్ వైడ్‌గా రిలీజైన ఫ్యూచరిస్టిక్ ఇండియన్ సినిమా, బాక్సాఫీస్ వద్ద రికార్డ్ స్థాయి ఓపెనింగ్స్ రాబట్టింది. మైండ్ బ్లోయింగ్ విజువల్స్‌తో పాటుగా ప్రధాన పాత్రధారుల నటన హైలైట్‌గా నిలిచాయి. ముఖ్యంగా అమితాబ్ బచ్చన్ పోషించిన పాత్రకు, ఆయన నట నకు అంతటా ప్రశంసలు దక్కుతున్నాయి. 'కల్కి' సినిమాలో అశ్వద్ధామ పాత్రలో నటించారు బాలీవుడ్ సీనియర్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్. కృష్ణుడి శాపం వల్ల ద్వాపరయుగం నుంచి 6 వేల సంవత్సరాలకు పైగా భూమిపై జీవిస్తున్న అమరుడిగా కనిపించారు. ఈ ఐకానిక్ క్యారక్టర్ కు బిగ్ బీ పర్ఫెక్ట్ గా సూట్ అవ్వడమే కాదు, అద్భుతమైన నటన కనబరిచారు. 3 గంటల మూవీలో ఆయన 25 నిమిషాల పాటు కనిపించి, సినిమా మొత్తాన్ని ప్రభాస్‌తో కలిసి తన భుజాలపై మోసారు. 81 ఏళ్ల వయసులోనూ ప్రభాస్ కు ధీటుగా యాక్షన్ సీన్స్ చేశారు. 'ది హాబిట్' 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి హాలీవుడ్ చిత్రాల్లోని గాండాల్ఫ్ ను గుర్తు చేశారు. కల్కి సినిమా కోసం అమితాబ్ బచ్చన్ చాలా కష్టప డ్డారు. కర్రతో ఫైట్ సీక్వెన్స్ కోసం సెట్స్ లో ప్రాక్టీస్ చేశారు. అందుకే ఇప్పుడు భైరవ, అశ్వత్థామ పాత్రల మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను బాగా అలరిస్తున్నాయి. ఇక అశ్వత్థామగా మేకప్ వేసుకోడానికి, దాన్ని తీసేయడానికి కొన్ని గంటల సమయం పట్టేదని చిత్ర బృందం తెలిపింది. అయినా సరే ఆయన అంతసేపూ ఎంతో ఓపికగా ఉండి, షూటింగ్ చేసేవారట. ఇది సినిమాపై ఆయనకున్న నిబద్ధత, అంకితభావాలను తెలియజేస్తుంది.



# వారానికే ఆసుపత్రిలో?

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా-జహీర్ ఇక్బాల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. కొన్నేళ్ల ప్రేమ బంధానికి పెద్దల్ని ఒప్పించి వివాహంతో ఫుల్ స్టాప్ పెట్టారు. దీంతో సోనాక్షి సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారం భమైంది. కెరీర్ పరంగా అమ్మడు ఎలా ముందుకు సాగుతుంది? మునుపటిలా అదే దూకుడుతో కొనసా గుతుందా? ఏవైనా మార్పులు చేస్తుందా? అన్నది చూడాలి. అయితే తాజాగా సోనాక్షి సిన్హా ఆసుపత్రిలో కనిపించడం నెట్టింట చర్చనీయాశంగా మారింది. పెళ్లైన వారం రోజులకే సోనాక్షి భర్త ఇక్బాల్ తో ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో కనిపించింది. దీంతో నెట్టింట ఆసక్తికర చర్చకు తెర తీసినట్లు అయింది. సోనాక్షి గర్భం దాల్చిందా? రెగ్యులర్ చెకప్‌లో భాగంగా వచ్చిందా? అంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఆ కాసేపటికే ఇదంతా తప్పుడు ప్రచారమని తేలింది. తండ్రి శత్రుఘ్న సిన్హా రెగ్యులర్ చెకప్ కోసమే భర్తతో కలిసి వచ్చిందని బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. నేరుగా ఆమె డాక్టర్లు తండ్రి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని వెళ్లినట్లు సమాచారం. అలాగే ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండమని డాడ్ కి చెప్పినట్లు తెలుస్తోంది.





# అప్పుడు తెలియక తప్పు చేశాను



సమంత హీరోయిన్‌గా ఈ అమ్మడు సంపాదించుకున్న స్టార్‌డమ్ మాములుది కాదు. కెరీర్ తొలినాళ్ల నుంచి వరుస విజయా లను అందుకుంది. అగ్ర హీరో యిన్లలో ఒకరిగా పేరు సంపాదించుకుంది. అనంతరం నాగ చైతన్యతో వివాహం చేసుకున్న తర్వాత కూడా సినిమాలను కొనసాగించింది. హీరో యిన్‌గా వరుస అవకాశాలు దక్కించుకుంటున్న సమయంలోనే నాగ చైతన్యతో విడాకులు, ఆ తర్వాత మయోసైటిట్ వ్యాధి బారిన పడింది. దీంతో సినిమాలకు చాలా గ్యాప్ ఇచ్చింది సామ్. ప్రస్తుతం సామ్ చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. అయితే ఇటీవలే ఓ వెబ్ సిరీస్‌కు ఈ బ్యూటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే సినిమాలు లేకపోయినా సోషల్ మీడియా ద్వారా నిత్యం అభిమానులతో టచ్ ఉండే సామ్, ఫ్యాన్స్ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. గతంలో తాను ఓ విషయంలో తెలియక తప్పు చేశానని చెప్పుకొచ్చింది. గతంలో సమంత కొన్ని అనారోగ్యకరమైన బ్రాం డ్స్‌ని ప్రమోట్ చేసిన విషయమై అభిమాని ప్రశ్నించాడు. దీనికి బదులిచ్చిన సమంత.. గతంలో తాను తప్పులు చేసిన మాట వాస్తవమేనని, అయితే అన్నవీ పూర్తిగా తెలియక చేసినవని చెప్పుకొచ్చారు. అయితే అసలు విషయం తెలుసుకున్న తర్వాత ప్రమోషన్స్ చేయడం ఆపేశానని తెలిపారు. ఇప్పుడు తాను ఏం చేస్తుందో వాటి గురించి మాత్రమే చెబుతున్నాని సమాధానం ఇచ్చారు.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**